మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 22.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 108 ‖ వెల (Price) రూ.8.00

పంచమి

ఆదివారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-12. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: పంచమి పగలు 3-44 వరకు. నక్షత్రం: కృత్తిక రాత్రి 11-02 వరకు. వర్జ్యం: పగలు 11-50 నుంచి పగలు 1-19 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-07 నుంచి సాయంత్రం 6-11 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-34 నుంచి సాయంత్రం 5-22 వరకు. అమృతకాలం: రాత్రి 8-47 నుంచి రాత్రి 10-17 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఇందిరమ్మ భూములకు కార్పొరేట్ చెర

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ఓఆర్ఆర్, వంద ఫీట్ల రోడ్డు, ఫోర్త్‌సిటీ రాకతో దళితుల భూముల ధరలకు రెక్కలు

600 కోట్ల విలువైన 'లావణి' భూములకు పట్టా!

రికార్డుల్లో లేని 12 ఎకరాలు సహా 48 ఎకరాలు వీఆర్‌కే డెవలపర్స్, ఇతరులకు బదలాయింపు



ప్రత్యేక కథనం 4

పీవోటీ కింది రెండెకరాలు సర్కారువని కొనసాగింపు.. మంఖాల్‌లో కొనసాగుతున్న రెవెన్యూ విచారణ

భూమి చుట్టూ రేకుల ప్రహరీ కట్టిన కంపెనీ.. ఉద్దేశపూర్వకంగా రికార్డులు మాయమంటూ ప్రచారం

పెద్దల సహకారంతో చేతులు మారిన రూ.కోట్లు

ఈ భూదందాకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి

91827 77711

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మహేశ్వరం, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): అవి ఇందిరమ్మ కాలంలో భూమిలేని నిరుపేదలు వ్యవసాయం చేసుకొని జీవనోపాధి పొందుతారనే సదుద్దేశంతో ఇచ్చిన భూములు! లబ్ధిదారులందరూ దళితులు! ఇప్పుడా భూముల సమీపంలోనే ఔటర్ రింగు రోడ్డు, వంద ఫీట్ల రోడ్డు రావడం, అంతకుమించి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే ఇక్కడ ఫోర్త్

3వ పేజీలో



ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా.. లేదా?

- హైకోర్టు సూటి ప్రశ్న.. నీళ్లు నమిలిన ప్రభుత్వం
- అఫిడవిట్ వేస్తామని అడ్వకేట్ జనరల్ జవాబు
- సోమవారమే చెప్పాలని న్యాయస్థానం ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ రద్దు కాలేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. కానీ, మేడిపల్లిలోనే ఫార్మాసిటీని కొనసాగించేదీ లేనిదీ స్పష్టత ఇవ్వకపోవడంతో న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని, మేడిపల్లిలో సేకరించిన భూముల్లోనే ఫార్మాసిటీని కొనసాగిస్తారో లేదో చెప్పడానికి ఎన్ని వాయిదాలు తీసుకుంటారని నిలదీసింది. ఫార్మాసిటీ భూములపై ధరణిలో లావాదేవీలకు అనుమతించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లాకు చెందిన డీవీవీ సత్యకొండలరాయ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శనివారం విచారణ జరిపారు. ఫార్మాసిటీ వివరాలను సమర్పించేందుకు మరోసారి గడువు ఇవ్వాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోరగా.. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. ఫార్మాసిటీ రద్దయినట్టు పత్రికల్లో వచ్చిన కథనాలను పిటిషనర్లు సమర్పించినప్పటికీ ప్రభుత్వం మాత్రం స్పష్టత

8వ పేజీలో

శుద్ధపూసలైతే సీబీఐ విచారణ కోరండి



- రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన లేదు 3
- అలైన్‌మెంట్ మార్పుపై సూటిగా సమాధానాలు చెప్పండి : వేముల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రావు, మధుసూదనాచారి

బామ్మర్దికి అమృతం!

సీఎం బంధువుకు రూ.1000 కోట్ల పనులు

> ఐహెచ్‌పీ కంపెనీని శిఖండి సంస్థగా అడ్డంపెట్టుకుని రేవంత్‌రెడ్డి, సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. 2 కోట్ల సృజన్‌రెడ్డి కంపెనీ రూ. 1000 కోట్ల పనులు, పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ అయిన ఐహెచ్‌పీ రూ. 200 కోట్ల పనులు చేయడం ఏంటి? బావమరిది కండ్లలో సంతోషం నింపడం కోసమే రేవంత్ రాష్ర్టాన్ని దోచుకుంటున్నారు. తన ఇంట్లో లంకెబిందెలు నింపుకోవడం కోసమే అక్రమ టెండర్లకు తెరలేపారు.
>
> -కేటీఆర్

- **అమృత్ టెండర్లలో భారీ అవినీతి.. అర్హత లేకున్నా 8,888 కోట్ల పనులు**
- **బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయం.. టెండర్లపై విచారణ జరిపించాలి**
- **ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం కింద సీఎం రేవంత్‌రెడ్డి పదవి కోల్పోవడం పక్కా**
- **కుంభకోణాలను ఒక్కొక్కటిగా బయటపెడతాం: మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి అర్హతలేకపోయినా వేయి కోట్ల పనులను అప్పగించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్లలో రూ.8,888 కోట్ల అవినీతి జరిగిందని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరిపించి టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు టెండర్లు దక్కేలా చేసిన రేవంత్‌రెడ్డి.. ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం ప్రకారం పదవి కోల్పోతారని పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్లపై కేంద్రం విచారణ చేయకుంటే బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కు అయినట్టే

2వ పేజీలో




రైతుబంధు ఎగ్గొట్టినట్టేనా? 2

కౌలు రైతులను మోసం చేసిన కాంగ్రెస్.. ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి

హెరిటేజ్ కోసమే రైతులకు విజయ డెయిరీ బకాయిలు ఇవ్వటం లేదు: నిరంజన్‌రెడ్డి

రాష్ట్రంలో గట్టి టాక్స్!



మి(ని)స్టర్ 8 పర్సెంట్!

కొన్ని పనులకు 20 శాతం ఇచ్చుకుంటున్న కాంట్రాక్టర్లు

'మేడమ్'ను కలిస్తే పని పక్కా

పెద్దాయనతో చెప్పించుకున్నా పైసలు ముట్టాల్సిందే

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆర్థిక శాఖ బిల్లుల మంజూరు హాట్ టాపిక్‌గా మారింది. తమ శాఖల పరిధిలో బిల్లులు మంజూరు కావడం లేదని, తాము సిఫార్సు చేసినా చిన్న కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు రావడం లేదని క్యాబినెట్ సమావేశంలో మంత్రులు అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం. రూ. 5-10 లక్షలకు కూడా ఆర్థికశాఖ మంత్రి వైపే చూడాలా? ఇలా అయితే మాకు మంత్రి పదవులు ఎందుకు? అని ఒకరిద్దరు గట్టిగానే మాట్లాడినట్టు సచివాలయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. ఒకవైపు అమాత్యుల ఆవేదన ఇలా ఉండగా బిల్లుల విషయంలో ఒకటి కాదు.. రెండు కాదు.. వందల కోట్లు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ఆర్థికశాఖలో జరుగుతున్న వసూళ్ల గురించి గుసగుసలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది నెలలే అయింది. కొత్తగా పరిపాలన అనుమతులు ఇచ్చి ప్రారంభించిన పెద్ద ప్రాజెక్టులేవీ లేవు. కానీ, గత ప్రభుత్వంలో మొదలైన ప్రాజెక్టులు పూర్తి అవుతుండటంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఆర్థికశాఖ చుట్టూ తిరుగుతున్నారు. కాంట్రాక్టర్లు మాత్రమే కాదు.. ప్రభుత్వ ఉద్యోగులు

6వ పేజీలో

ఉదయమే పైరవీలు!

నేరుగా అధికారులకు ఫోన్ చేస్తున్న 'నీడ'

- **పెద్దసార్ పీఏనంటూ ఐఏఎస్‌లు, హెచ్‌వోడీలకు కాల్స్**
- **వెంటనే ఫైల్ క్లియర్ చేయాలంటూ ఆదేశాలు**
- **సదరు వ్యక్తిపై అధికారవర్గాల్లో జోరుగా చర్చ**
- **గతంలో ఓ కేసులో నిందితుడిగా అనుమానాలు**

హైదరాబాద్. సెప్టెంబర్ 21,(నమస్తే తెలంగాణ):'హలో..సర్.. నేను ....సర్ పీఏను మాట్లాడుతున్న.. మీకు ఆ 50 కోట్ల బిల్ రిలీజ్ చేయాలని చెప్పి వారం రోజులైంది. ఇప్పటివరకు క్రెడిట్ కాలేదు. ఏంది ప్రాబ్లం.. ఇంత రిక్వెస్ట్‌గా చెబుతున్నా మీరు పట్టించుకోవట్లే.. ఇంకొకాయన బిల్లులు ఒక్క రోజులనే రిలీజ్ చేసిండ్రట. మా బిల్స్‌కు ఏంటి ఇబ్బంది. ఇట్లైతే కష్టం. సర్ వెరీ సీరియస్ ఆన్ దిస్ ఇష్యూ..' మరొకసారి ఫోన్ రాకుండా చూసుకోండ్రి.. ఆ బిల్ ఫాస్ట్‌గా రిలీజ్ చేయండి. 'కలెక్టర్ గారు..! నమస్తే.. నేను ...సర్

6వ పేజీలో



అంగట్లో రేషన్ డీలర్ పోస్టులు

పోస్టులు అమ్ముకుంటున్నారన్న కాంగ్రెస్ కార్యకర్త

హస్తం కండువా కప్పుకుంటేనే రేషన్ దుకాణం

బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత కక్ష

5



నాలుగు నెలలుగా పెండింగులో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం ఎదుట కల్వకుర్తి-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న పాడి రైతులు



పాడి రైతులకు పొగ

- ప్రైవేటు డెయిరీలకు వెళ్లేలా కుట్రలు
- మూడు నెలలుగా బిల్లుల చెల్లింపులు బంద్
- విజయ డెయిరీ బకాయిలు 150 కోట్లు
- ప్రభుత్వంపై పాడి రైతుల పోరుబాట 6
- 26న ధర్నాచౌక్‌లో భారీ ధర్నాకు పిలుపు



మరో రైతు ఆత్మహత్య

6

పంట పెట్టుబడుల కోసం రూ.4 లక్షల అప్పు

అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపం

పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో విషాదం



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, మాగంటి గోపీనాథ్, ఎంపీ రవిచంద్ర, నేతలు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య యాదవ్

సీఎం బామ్మర్దికి అమృతం!

▶ మొదటిపేజీ తరువాయి...

అనుకోవాల్సి ఉంటుందన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు సైతం రేవంత్‌రెడ్డిని పొగడటం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని అన్నారు. రేవంత్ తన కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం కలిగేలా వ్యవహరిస్తూ అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని, త్వరలోనే వరుసగా వాటిని బయటపెడతానని చెప్పారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కుటుంబ కథా చిత్రం నడుస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే భారీ కుంభకోణానికి రేవంత్ పాల్పడ్డారని ధ్వజమెత్తారు. తెలంగాణలోని వివిధ పట్టణాల్లోని మంచినీటి సరఫరా కోసం అమృత్ పథకం కింద టెండర్లు పిలిచారని, సీఎంగా, మున్సిపల్ వ్యవహారాలశాఖ కూడా చూస్తున్న రేవంత్‌రెడ్డి ఈ కుంభకోణం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తన బావమరిదికి అమృత్ టెండర్లు ఇస్తే.. ప్రజలకు మాత్రం విషం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ టెండర్లలో సీఎం కుటుంబ సభ్యులు భారీ అవినీతికి పాల్పడినట్టు తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు లేఖ రాసినట్టు తెలిపారు.

పేరొకరిది.. పనులు మరొకరికి

సీఎం బావమరిది సూదిని సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అర్హతలు లేకున్నా వేలకోట్ల రూపాయల పనులు కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక వనరులు కానీ, ఆర్థిక పరపతి కానీ, సంపత్తి కానీ దానికి లేవని తెలిపారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకొని, ఇండియన్ హ్యూమ్ పైప్ (ఐహెచ్‌పీ) అనే కంపెనీని పిలిపించి, బెదిరించి ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని ఆరోపించారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్‌రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని పేర్కొన్నారు. అందులో భాగంగానే జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకి తెరలేపారని ఆరోపించారు. రూ.1137 కోట్ల కాంట్రాక్టు దక్కిందని చెప్తూ ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈకి ఐహెచ్‌పీ లేఖ రాసిందని వివరించారు. 20 శాతం పనిని తాము చేస్తున్నామని, ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ మాత్రం 80 శాతం అంటే దాదాపు వెయ్యి కోట్ల పనిచేస్తుందని లేఖలో పేర్కొన్నారని తెలిపారు. కంపెనీని శిఖండి సంస్థగా అడ్డంపెట్టుకుని రేవంత్‌రెడ్డి, సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని విమర్శించారు. రూ. 2 కోట్ల సృజన్‌రెడ్డి కంపెనీ రూ. 1000 కోట్ల పనులు, పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ అయిన ఐహెచ్‌పీ రూ. 200 కోట్ల పనులు చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి పదవి పోతది

ఆఫీస్ ఫర్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 1988 లో సెక్షన్ 7, 11, 13 నిబంధనల ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆయన సీఎం పదవి కోల్పోతారని కేటీఆర్ తెలిపారు. తన కుటుంబ సభ్యులకు లబ్ధిచేకూరిస్తే, ఆశ్రిత పక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులని తెలిపారు. గతంలో ఇవే చట్టాల కింద సోనియాగాంధీ 2006లో నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయారని గుర్తుచేశారు. అక్రమ మైనింగ్ అనుమతుల నేపథ్యంలో కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప, ఆదర్శ్ కుంభకోణంలో 2011లో మహారాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి అశోక్ చవాన్ పదవి కోల్పోయారని గుర్తుచేశారు. బావమరిది కండ్లలో సంతోషం కోసం రేవంత్ రాష్ర్టాన్ని దోచుకుంటున్నారని పేర్కొన్నారు. తన ఇంట్లో లంకెబిందెలు నింపుకోవడం కోసమే అక్రమ టెండర్లకు తెరలేపారని ఆరోపించారు. అమృత్ టెండర్ల వివరాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు.


మరిన్ని కుంభకోణాలు

రేవంత్‌రెడ్డి కుంభకోణాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందు ఉంచుతానని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్త్ సిటీ కుంభకోణాలను బయటపెడతానని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తొలుత దీనిపై మాట్లాడారని, ఆ తర్వాత కేంద్రం నుంచి ఆదేశాలు రావడంతో దీనిపై మాట్లాడడం మానేశారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ మధ్య ప్రేమకథ నడుస్తున్నదని ఆరోపించారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి ఆర్‌ఆర్ ట్యాక్స్ గురించి మాట్లాడినా, ఇక్కడ మాత్రం చర్యలు ఉండవని పేర్కొన్నారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం అనుకుంటే రేవంత్‌రెడ్డి పదవి ఉండదని కేటీఆర్ తేల్చి చెప్పారు.

బీజేపీ- కాంగ్రెస్ కుమ్మక్కు కాకుంటే

కేంద్ర ప్రభుత్వంలో రాష్ర్టానికి చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మంత్రులుగా ఉన్నారని, రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు కాకుంటే టెండర్ల ప్రక్రియపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వారు మౌనంగా ఉన్నా, విచారణకు ఆదేశించకున్నా రేవంత్‌రెడ్డికి, వారికి మధ్య పూర్తిస్థాయి అవగాహన ఉన్నట్టుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు.

లోకం పోకడ



మన మార్కు పేర్ల మార్పులో భాగంగా దీన్ని ఇలా మార్చేశాను సార్!

బీసీ రిజర్వేషన్లపై బీఆర్‌ఎస్ టూర్

- తమిళనాడు, కేరళలో అధ్యయనం
- స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలి
- లేదంటే ప్రత్యక్ష కార్యాచరణ నిర్ణయిస్తాం
- బీఆర్‌ఎస్ బీసీ నేతల నిర్ణయం



తెలంగాణభవన్‌లో బీసీ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, చిత్రంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు, కులగణనపై అధ్యయనం చేసేందుకు తమిళనాడు, కేరళ రాష్ర్టాల్లో పర్యటించాలని బీఆర్‌ఎస్ బీసీ ముఖ్యనేతలు నిర్ణయించారు. బీసీల కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశాలపై ఆయా రాష్ర్టాల్లో అధ్యయనం చేయనున్నారు. శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో శనివారం తెలంగాణ భవన్‌లో బీసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన సమావేశంలో వివిధ రాష్ర్టాల్లో ఉన్న మెరుగైన విధానాలను అధ్యయనం చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ నేపథ్యంలో తమిళనాడు, కేరళలో అమలు చేస్తున్న రిజర్వేషన్లు, తమిళనాడు ప్రభుత్వ చిత్తశుద్ధి వల్ల బీసీలకు దక్కిన రిజర్వేషన్లు, ఇతర ప్రయోజనాలపై అధ్యయనం చేసి నివేదికను ప్రభుత్వానికి, పార్టీకి అందించాలని నిర్ణయించారు. నవంబర్ 10లోగా కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కులగణన చేసి, 42 శాతం రిజర్వేషన్ల కల్పన, బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించక పోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని నిర్ణయించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, జాజాల సురేందర్, నోముల భగత్, దాసోజు శ్రవణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవి కుమార్ గౌడ్, జూలూరి గౌరీ శంకర్, డాక్టర్ ఆంజనేయ గౌడ్, చిరుమల్ల రాజేశ్ కుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్, ఉపేంద్రాచారి, బీఆర్‌ఎస్ నాయకులు గట్టు రాంచందర్‌రావు, గోసుల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఆరోపణలు అసత్యం.. నిరూపిస్తే రాజీనామా

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి అవినీతికి పాల్పడినట్టు కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమృత్ పథకం కింద రూ. 8,888 కోట్ల అవినీతి జరిగిందని బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లపై తాను ఏ కంపెనీని బెదిరించలేదని స్పష్టం చేశారు. తాను రాజకీయాలకు రాక ముందే కాంట్రాక్టర్‌నని, ఎవరికీ భయపడబోనని పేర్కొన్నారు. ఆరోపణలను కేటీఆర్ నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే ఆయన తన ఎమ్మె ల్యే పదవికి రాజీనామా చేయాలని సవాల్ విసిరారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్‌ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్

- పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- సమస్య పరిష్కరిస్తామని సీపీ హామీతో ఆందోళన విరమణ

జనగామ, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలానికి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులను శనివారం పోలీసులు అరెస్టు చేయడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరుప్పుల మండలం చిన్నమడూరు గ్రామంలో ధృవ వెంచర్ వ్యవహారంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య జరిగిన గొడవలో స్థానిక కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని ప్రత్యర్థులను బెదిరించి కిడ్నాప్ చేశారు. దీన్ని ఎత్తిచూపిన స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఇద్దరిపై కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. దీంతో ఎర్రబెల్లికి ఏసీపీ నర్సయ్య నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కిడ్నాప్ చేసిన కాంగ్రెస్ నాయకులను వదిలిపెట్టి బీఆర్‌ఎస్ నాయకులను ఎలా అరెస్ట్ చేస్తారని ఎర్రబెల్లి పోలీసులను నిలదీశారు. బాధితుడు పోస్టు ద్వారా ఆధారాలు పంపినా ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో ఎర్రబెల్లిని ఫోన్‌లో మాట్లాడించారు. కిడ్నాప్‌కు గురైన వ్యక్తి పిటిషన్‌పై సోమవారం లోగా కేసు నమోదు చేస్తామని డీసీపీ హామీ ఇవ్వడం, ఆ వెంటనే వరంగల్ సీపీ అంబర్ కిశోర్‌ఝా సైతం దయాకర్‌రావుకు ఫోన్‌చేసి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ పేరిట రాసిన ఫిర్యాదును ఎర్రబెల్లి సమక్షంలో పార్టీ శ్రేణులు ఎస్సై సృజన్ కుమార్‌కు అందజేశారు.

నిబద్ధతగల నేత సీతారాం ఏచూరి

- కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నేత
- నేటితరం నేతలకు స్ఫూర్తిదాయకుడు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, పార్టీనేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్, సీపీఎం నేతలు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 21: పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయ నేతల్లో స్థిరంగా సిద్ధాంతం కోసం నిలిచిన నిబద్ధత గల ఆదర్శ నాయకుడు సీతారాంఏచూరి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ఎవరు ఏ సమయంలో ఏ పార్టీ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. నేటి తరం రాజకీయ నాయకులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఢిల్లీలో వెలిగిన అసలైన హైదరాబాద్ బిడ్డ ఏచూరి అంటూ నివాళులర్పించారు. ఇటీవల ఢిల్లీలో కన్నుమూసిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. ఏచూరి హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ స్కూల్ చదువుకున్నారని, ఆ పాఠశాల పక్కనే ఉన్న గ్రామర్ స్కూల్‌లో చదివానని తెలిపారు. తామిద్దరం నిజాం కాలేజీలోనే డిగ్రీ పూర్తి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. ఓట్ల రాజకీయాల్లో వెనుకబడ్డాం.. ప్రజల కోసం చేసిన పోరాటాలలో ముందున్నామని ఏచూరి అనేవారని గుర్తుచేశారు. విద్యావంతుల కుటుంబంలో పుట్టిన ఏచూరి ప్రశ్నించే గొంతుకగా ఎదగడం చాలా గొప్ప విషయమని అన్నారు. పోరాటాల నుంచే వచ్చే నాయకునికి ప్రజల కష్టాలు, సుఖ దుఃఖాలు తెలుసునని చెప్పారు. తిట్లు, రోత మాటలే రాజకీయంగా చలామణి అవుతున్న ఈ రోజుల్లో ఏచూరి ఎంతో హుందాగా వ్యవహరించేవారని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో జేఎన్‌యూ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీని ఆమె ఎదుటే నిలిచి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన గుండెధైర్యం గల నాయకుడు ఏచూరి అని కొనియాడారు. సిద్ధాంతపరంగా తమ పార్టీలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సీపీఎం వ్యతిరేకించినా.. పోరాటాలపరంగా తమ రెండు పార్టీల రక్తం ఒక్కటేనని వ్యాఖ్యానించారు.

ఏచూరి మృతి దేశానికి తీరని లోటు: సీఎం

ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రగిలించి.. పేద ప్రజల పక్షాన గళం విప్పిన సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని అన్నారు. ప్రజాస్వామిక వేదికలపై మన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్పనాయకుడని కొనియాడారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డికి సమకాలికుడుగా ఉండేవారని అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లుల ఆమోదం విషయంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. ఏచూరిని రాహుల్‌గాంధీ మార్గనిర్దేశకుడిగా భావిస్తారని చెప్పారు. దేశంలో జమిలి ఎన్నికల ముసుగులో ఆధిపత్యం చేలాయించాలన్న కుట్ర జరుగుతున్నదని మండిపడ్డారు. రాష్ర్టాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి సందర్భంలో ఏచూరి లేకపోవడం భారీ లోటు అని అన్నారు.

వివిధపార్టీల నాయకులు తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, సీపీఎం నేత బీవీ రాఘవులు, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా తదితరులు పాల్గొన్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	39.7°c	23.0°c
మెదక్	36.8°c	20.5°c
మహబూబ్‌నగర్	32.0°c	21.0°c
వరంగల్	32.0°c	24.0°c
ఖమ్మం	32.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	25.0°c
రంగారెడ్డి	30.0°c	20.1°c
హైదరాబాద్	30.0°c	22.3°c
నల్లగొండ	28.5°c	23.0°c
నిజామాబాద్	27.3°c	23.5°c

రేపటి నుంచి భారీ వర్షాలు

జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో నెలకొన్న ఆవర్తనం ప్రభావంతో దక్షిణ తెలంగాణ జిల్లాలతోపాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో 23న ఏర్పడే అల్పపీడన ప్రభావం వల్ల ఈ నెల 23 నుంచి 26 వరకు దక్షిణ తెలంగాణ, దక్షిణ కోస్తా, కర్నూలు జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ శనివారం హెచ్చరికలు జారీ చేసింది. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, జనగామ, భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. మరోవైపు శనివారం రాత్రి నగరంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు రాకపోకలకు చాలా ఇబ్బంది పడ్డారు.

సీఎం సాక్షిగా ఎంపీ మల్లు రవికి అవమానం

వెనుక సీటులో కూర్చున్నా లేపేసిన సెక్యూరిటీ

సీఎం వెనుక దళిత ఎంపీ కూర్చోవద్దా: బాల్క

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దళిత ఎంపీ మల్లు రవికి అవమానం ఎదురైంది. సీపీఎం నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభకు హాజరైన మల్లు రవి వేదికపై రెండో లైన్‌లో కూర్చున్నారు. మొదటి వరుసలో సీపీఎం జాతీయ నేతలు, సభాధ్యక్షుడు, ముఖ్య అతిథి సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. సభకు ముందుగానే వచ్చిన మల్లు రవి సీఎం రేవంత్‌రెడ్డి కోసం ఏర్పాటుచేసిన కుర్చీకి సరిగ్గా వెనుక వరుస సీటులో కూర్చున్నారు. ఇంతలో సీఎం రేవంత్ సభా వేదిక వద్దకు వచ్చారు. ఆయనకన్నా ముందుగా వేదికనెక్కిన సెక్యూరిటీ సిబ్బంది వెనుకసీటులో కూర్చున్న మల్లు రవిని లేవాలని ఆదేశించారు. తానెందుకు లేవాలి అని మల్లు రవి నిలదీసినప్పటికీ బలవంతంగా ఆయనను అక్కడి లేపి మరింత వెనుకకు పంపించారు. దీంతో దళిత ఎంపీకి జరిగిన అవమానంపై దళితవర్గాలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

ఖండించిన బాల్కసుమన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి దళిత ప్రజాప్రతినిధులను అవమానిస్తూనే ఉన్నదని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏచూరి సంస్మరణ సభలో దళిత ఎంపీ మల్లు రవిని సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది బలవంతంగా లేపి అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఒక సిట్టింగ్ దళిత ఎంపీ అయిన మల్లు రవి సీఎం వెనకాల రెండో వరుసలో కూడా కూర్చోడానికి అర్హుడు కాదా? అని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియోను శనివారం ఎక్స్‌లో పోస్టుచేసి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



30 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు వివిధ కారణాలతో మృతిచెందగా, బాధిత కుటుంబాలకు తెలంగాణభవన్‌లో పార్టీ తరపున శనివారం ఒక్కొక్కరికీ రెండు లక్షల ప్రమాద బీమా ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

రైతుబంధు ఎగ్గొట్టినట్లేనా?

కౌలు రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలి

హెరిటేజ్ కోసమే రైతులకు విజయ డెయిరీ బకాయిలు ఇవ్వటం లేదు: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణానికి 'మాఫీ' లేదు.. రైతుకు 'భరోసా' లేదు.. రుణమాఫీ ఒక మాయ, రైతు భరోసా ఒక భ్రమ అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రూ.2 లక్షల రుణ మాఫీ అయిన ఒక్క రైతును చూపించాలని కాంగ్రెస్ సర్కారుకు సవాల్ విసిరారు. విజయ డెయిరీకి పోసిన పాల బిల్లులు ఇవ్వకపోవటంతో రైతులు పాలను రోడ్లపై పోసి తమ నిరసన తెలియజేస్తున్నారని వెల్లడించారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 10 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.80 వేల కోట్ల అప్పు చేసినా ఏ రంగంలోనూ గణనీయమైన మార్పు రాలేదని విమర్శించారు. మొదట రూ.49 వేల కోట్లు రుణ మాఫీకి అంచనా వేసి, ఆ తర్వాత రూ.41 వేల కోట్లు అని ప్రకటించిన రేవంత్‌రెడ్డి.. బడ్జెట్‌లో మాత్రం రూ.26 వేల కోట్లే కేటాయించారని, చివరికి రూ.17 వేల కోట్లు మాఫీ చేసి చేతులు దులుపుకున్నారని వివరించారు. వానకాలం పంట పూర్తవుతున్నా.. రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, ఆ నిధులు ఎగ్గొట్టినట్టేనా? అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ డిక్లరేషన్‌లో రూ.2 లక్షల రుణ మాఫీ, రైతుభరోసా, పంటలబీమా, పసుపు బోర్డు, చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తామని కాంగ్రెస్ గొప్పలు చెప్పిందని.. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన వల్ల బీమా కంపెనీలకు లాభం తప్ప రైతులకు ప్రయోజనం ఉండదని ఆనాడే చెప్పామని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వంలో పంటలబీమా కోసం నాలుగేండ్లు రూ.2,400 కోట్లు బీమాకంపెనీలకు కడితే రైతులకు తిరిగి రూ.1,800 కోట్లే వచ్చాయని తెలిపారు.



తెలంగాణభవన్‌లో శనివారం మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల

కౌలు రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి

రైతుతో పాటు కౌలు రైతులకూ రైతు భరోసా ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారని, కానీ రైతుభరోసా ఎవరు తీసుకుంటారో రైతు, కౌలురైతు తేల్చుకోవాలని వ్యవసాయ మంత్రి చావు కబురు చల్లగా చెప్పారని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. 'తెలంగాణలో కౌలు రైతు విధానం, ఏపీలో కౌలు విధానం వేరు అని అసెంబ్లీలో కేసీఆర్ పలుమార్లు చెప్పారు. తెలంగాణలో పాలుకు ఇచ్చే విధానం, ఏపీలో కౌలుకు ఇచ్చే విధానం ఉంటుందని చెప్పారు. కొందరు ఆంధ్రా నేతల చేతుల్లో ఉన్న రైతుసంఘాలు ఈ వాదన తెచ్చాయి. దాన్ని కాంగ్రెస్ అందుకుని కౌలు రైతులకు రైతుభరోసా అని బురిడీ కొట్టించింది. ఇప్పుడు అసలు విషయం బయటపెట్టి ముసుగు తొలగించింది. కౌలురైతులకు రైతుభరోసా ఇవ్వబోమంటున్న కాంగ్రెస్ సర్కార్ వారికి క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీకి మళ్లించారని ఆరోపించారు.


హెరిటేజ్ కోసమేనా?

రైతులకు విజయ డెయిరీ 3 నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని, దీంతో రైతన్నలు పాలను రోడ్లపై పోసి నిరసన తెలుపుతున్నారని నిరంజన్‌రెడ్డి అన్నారు. పాల బకాయిలు ఇవ్వకుండా రైతులను హెరిటేజ్ వైపు మళ్లించే కుట్ర జరుగుతున్నదని అనుమానం వ్యక్తంచేశారు. విజయ డెయిరీకి కేసీఆర్ హయాంలో లాభాలు ఎలా వచ్చాయి? ఇప్పుడెలా నష్టాలు వస్తున్నాయి? అని ప్రశ్నించారు. రూ.204 కోట్లతో తెలంగాణలో హెరిటేజ్ పెట్టబడులు పెడుతుందని, నష్టాలు వస్తే ఆ సంస్థ పెట్టుబడి పెడుతుందా? అని నిలదీశారు. పాల రైతులు రోడ్డెక్కితే ఒక్క మంత్రి కూడా ఎందుకు మాట్లాడటం లేదని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యాయాదవ్, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సొంత వ్యవహారంగా ట్రిపుల్ ఆర్!

గోప్యంగా దక్షిణ భాగం అలైన్‌మెంట్

- ఎంపిక చేసిన వారికే సమావేశాల్లో ఎంట్రీ!
- సలహాదారులు, కన్సల్టెంట్లు, ఐఏఎస్‌లకే ప్రవేశం
- ఇంజినీర్ల సైడ్‌లైన్.. ఆర్‌అండ్‌బీకి సమాచారమే లేదు
- రహస్య మంతనాలపై సర్వత్రా సందేహాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం డిజైన్ల తయారీలో ప్రభుత్వ వైఖరి ఆది నుంచి సందేహాలకు తావిస్తున్నది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ రూపకల్పన ముఖ్యమంత్రితోపాటు ఆయన ఎంపికచేసుకున్న కొద్దిమంది సలహాదారులు, కన్సల్టెంట్ల మధ్య, ఓ క్లోజ్డ్ రూమ్‌లో జరగడం అనుమానాలకు తావిస్తున్నది. ప్రజా ప్రయోజనాల కోసమే చేపడుతున్నట్లు చెబుతున్న ఈ ప్రాజెక్టులో సంబంధిత విభాగం అధికారులకే చోటు కల్పించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై సందేహాలను రేకెత్తిస్తున్నది. ఇది ముఖ్యమంత్రి సొంత వ్యవహారంలా మారిపోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో రోడ్లు, భవనాల నిర్మాణానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే ఆర్‌అండ్‌బీ శాఖను ట్రిపుల్ ఆర్ డిజైన్ల తయారీలో ప్రభుత్వం పూర్తిగా దూరం పెట్టింది. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై ముఖ్యమంత్రి వద్ద నిర్వహించే సమావేశాలకు ఒకరిద్దరు ప్రభుత్వ సలహాదారులు, మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులు, కన్సల్టెంటు ఏజెన్సీ ప్రతినిధులు తప్ప ఇతరులకు ప్రవేశం లేకుండా చేశారు. ఇటీవల జరిగిన సమావేశానికి ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగు అధికారులు వెళ్లినప్పటికీ వారిని బయటనే ఉంచారు. వారికి కనీసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌కు సంబంధించిన సమాచారం కూడా ఇవ్వలేదు. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌ను మాత్రమే సమావేశానికి అనుమతించారు. రోడ్లు, భవనాల నిర్మాణం కోసమే ఏర్పాటు చేసుకున్న ఈ శాఖపట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి బహుషా చరిత్రలో ఎన్నడూ లేదంటే అతిశయోక్తి కాదు. ఇంజినీర్లు డిజైన్లు సిద్ధంచేస్తే, ఈఎన్‌సీ లేక చీఫ్ ఇంజినీర్ హోదాలో ఉండే అధికారి వాటిని ప్రభుత్వ పెద్దలకు వివరించడం ఆనవాయితీ. కానీ ఇక్కడ ఇందుకు పూర్తి భిన్నంగా జరిగింది. కన్సల్టెంట్లు తాము రూపొందించిన అలైన్‌మెంట్‌ను ప్రభుత్వ సలహాదారుల సమక్షంలో సీఎంకు వివరించారు. మనం సొంత ఇంటి నిర్మాణం కోసం నియమించుకున్న ఇంజినీర్లకు ఎలాగైతే సూచనలు చేస్తామో.. అదే ధంగా సీఎం కన్సల్టింగ్ ఏజెన్సీకి సూచనలు చేస్తున్నారని, ఎక్కడా ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లను భాగస్వాములను చేయడంలేదని చెప్తున్నారు. దీంతో ఇది ప్రజలకు సంబంధించిన వ్యవహారమా.. లేక ముఖ్యమంత్రి సొంత వ్యవహారమా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ట్రిపుల్ ఆర్ విషయంలో ప్రభుత్వం పాటిస్తున్న ఈ గోప్యత అనేక సందేహాలకు తావిస్తున్నది. దీని వెనుక పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న ఆరోపణలకు బలం చేకూరుతున్నది.

మమ్మల్ని రానివ్వకపోవడం మంచి పరిణామం

తమను ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టులో భాగస్వాములను చేయకపోవడమే మంచిదని కొందరు ఆర్‌అండ్‌బీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం చెప్తున్న విధంగా చేసుకుంటూపోతే ప్రజలనుంచి వ్యతిరేకత రావడమే కాకుండా భవిష్యత్తులో తమ ఉద్యోగాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. అలైన్‌మెంట్‌కు సంబంధించిన వివరాలు సోషల్ మీడియా ద్వారానే తమకు తెలిసిందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం నియమించిన కమిటీలో కూడా ఎవరున్నారో తమకు సమాచారం లేదని తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను ఖరారుచేసి తమకు ఏదైనా టాస్క్ అప్పగిస్తే దాన్ని పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్తున్నారు.

ఔటర్‌ను జ్ఞప్తికి తెస్తున్న ట్రిపుల్ ఆర్

ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి గతంలో ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణం సందర్భంగా జరిగిన అక్రమాలను జ్ఞప్తికి తెస్తున్నది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించిన ఔటర్ రింగురోడ్డు.. పెద్దల ప్రయోజనాల కోసం అష్టవంకరలు తిరిగిన విషయం ఇంకా చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఇందులో పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోగా, భూములు కొనుగోలు చేసుకున్న పెద్దలు మాత్రం రాత్రికి రాత్రే వందల కోట్లకు పడగలెత్తారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఆర్‌ను తమ అనుయాయుల రియల్ ఎస్టేట్ దందా కోసం ఓ గొప్ప అవకాశంగా మలుచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం ఎలైన్‌మెంట్‌కు తుదిరూపం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా అనేక మార్పులు, చేర్పులు జరగాల్సి ఉందని సాక్షాత్తూ అధికారవర్గాలే చెప్తున్నాయి. అది ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదని, ప్రభుత్వ ఆలోచనలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు బేరీజు వేసుకొని అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కమిటీ నివేదిక ఇస్తుందని, అనంతరం మార్పులు చేర్పులు చేసి అలైన్‌మెంట్‌కు తుదిరూపం ఇస్తారని అంటున్నారు. అలైన్‌మెంట్ విషయంలో ప్రభుత్వం ఇస్తున్న లీకులతో రైతులు ఆందోళనలో ఉండగా, రియల్టర్లు మాత్రం అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

శుద్ధపూసలైతే సీబీఐ విచారణ కోరండి

- రీజినల్ రింగ్ రోడ్డుపై కాంగ్రెస్ నేతలకు అవగాహన లేదు
- అలైన్‌మెంట్ మార్పుపై నా ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పండి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు జరగపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయకుంటే సీబీఐ విచారణ కోరాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'నవ్వి పోదురుగాక నాకేంటి సిగ్గు' అన్నట్టు కాంగ్రెస్ నేతల తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు వెనుక అరాచకాలు బయట పెట్టగానే కాంగ్రెస్ నాయకుల పరిస్థితి తేలుకుట్టిన దొంగలా అయిందని శనివారం ఆయన ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. స్క్రిప్ట్ ప్రకారం ప్రెస్‌మీట్ పెట్టి తనను విమర్శించిన కాంగ్రెస్ నేతలకు ట్రిపుల్‌ఆర్ మీద కనీస అవగాహన లేదంటూ విమర్శించారు. ట్రిపుల్ ఆర్ ప్రతిపాదన ఎవరు చేశారు? ఎప్పుడు చేశారు ? కేంద్రం ఎప్పుడు ఒప్పుకున్నది? తెలియని వారి విమర్శలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. తమ హయాంలో ట్రిపుల్ ఆర్‌పై పదేండ్లలో ఏ పనీ జరగలేదనడం కాంగ్రెస్ నేతల అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఉత్తర భాగం అనుమతులు 2021లో కేసీఆర్ హయంలోనే వచ్చాయని, కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను భారత్‌మాల ఫేజ్-1లో చేర్చుతూ 2021 మార్చి 5న ఎన్‌హెచ్ఏఐ అనుమతి ఇచ్చిందని, 2021 డిసెంబర్ 6న అలైన్‌మెంట్ ఆమోదం లభించిందని గుర్తుచేశారు. సంవత్సరం 10 నెలల్లోనే భూ సేకరణ మొదలుపెట్టి 76 శాతం 3డీ పూర్తి చేశామని, పేదలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా భూ సేకరణ చేశామని తెలిపారు. 'కాంగ్రెస్‌నేతలు, వారి బంధువుల భూములు ఉన్నచోట అలైన్‌మెంట్ మారుస్తున్నారా? లేదా? అమాయక పేదలను బెదిరిస్తూ కబ్జా ఒప్పంద రద్దు పత్రాలు రాసుకుంటున్నారా లేదా?' అని ప్రశ్నించారు. కుందారం భూములను పేదల నుంచి లాక్కుంటున్న భూ భకాసురుల పక్షాన నిలబడి, కండ్లుండీ చూడలేక ఈ ప్రభుత్వం పేదల కడుపు కొడుతున్నదని విమర్శించారు. అలైన్‌మెట్ మార్పులో కాంగ్రెస్ నేతల బాగోతాలను బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు బయట పెడుతూనే ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.

ఇందిరమ్మ భూములకు కార్పొరేట్ చెర

మొదటిపేజీ తరువాయి...

సిటీ నిర్మిస్తామని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడంతో వాటిపై తెర వెనక రాజకీయ పెద్దలున్న ఓ కార్పొరేట్ కంపెనీ కన్నుపడింది. ఇంకేముంది! ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల భూములకు రెక్కలొచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఫోర్త్ అలియాస్ ప్యూచర్ సిటీ దరిమిలా కేవలం దాని పరిధిలోనే కాదు.. చుట్టుపక్కల 10-15 కిలోమీటర్ల పరిసరాల్లోనూ సర్కారు భూములకు రెక్కలొస్తున్నాయి. ఇక్కడే కాదు.. ఫోర్త్ సిటీతో పాటు చుట్టుపక్కల అనేక గ్రామాల్లో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన వందల ఎకరాల భూములు అనధికారికంగా చేతులు మారుతున్నాయి. కొన్ని రికార్డుల్లో పట్టాలుగా రూపాంతరం చెందుతుంటే మరికొన్ని స్టాంపు కాగితాలపై 99 ఏండ్ల లీజు ప్రాతిపదికన పెద్దలపరమవుతున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా చెర వీడని భూములు

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధి మంఖాల్ గ్రామంలోని లావణి పట్టా భూములు నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ పరమవడం ఒక్క మంఖాల్‌లోనే కాదు.. చుట్టుపక్కల గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. చివరికి కలెక్టర్ విచారణకు ఆదేశించినా నిరుపేదల భూములు చెర వీడటం లేదు. కొందరు పెద్దలు రంగంలోకి దిగి రైతులకు ఎకరానికి కోటి, కోటిన్నర చొప్పున ఒప్పందం చేసుకొని వారి నోరు మూయించారు. ఓవైపు సాంకేతికంగా అధికారిక విచారణ కొనసాగుతున్నా క్షేత్రస్థాయిలో భూములను సదరు కంపెనీ స్వాధీనం చేసుకొని చుట్టూ రేకుల ప్రహరీ సైతం నిర్మించింది. ఇందులో మరో కొసమెరుపు ఉన్నది. అదేమంటే.. రికార్డుల్లో కంటే రైతుల వద్ద అదనంగా 12 ఎకరాల వరకు భూమి ఉంటే తాజా బదలాయింపులో దాన్ని కూడా కలిపి రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. ఇక్కడ బహిరంగ మార్కెట్లో ఎకరా భూమి రూ.15-20 కోట్లకు పైమాటే. అంటే ఇది రూ.600 కోట్లకు పైగా విలువైన భూముల వ్యవహారన్నమాట!

మంఖాల్ పరిధిలోని సర్వేనంబర్లు 608, 609, 610లో వాస్తవానికి 47.37 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూములను ఇందిరమ్మ కాలంలో అంటే 1970 దశకంలోనే గ్రామానికి చెందిన నిరుపేద దళిత కుటుంబాలకు పంపిణీ చేశారు. వాస్తవానికి పదకొండు మంది రైతులకు 35.36 ఎకరాలు పంపిణీ చేశారు. క్షేత్రస్థాయిలో భూమి ఎక్కువ ఉండటంతో ఒక్కో రైతు అదనంగా కబ్జాలో ఉన్నారు. ఇలా రికార్డుల్లో కంటే వీరికి అదనంగా 12 ఎకరాల వరకు భూమి ఉన్నది. కాగా రెవెన్యూ రికార్డుల్లో 11మంది రైతుల పేరిట లావణి పట్టా భూములుగా నమోదవుతూ ఉన్నాయి. ఖాస్రా పహాణీ వంటి కీలక రికార్డుల్లోనూ ఖారీజు ఖాతా సర్కారీవిగానే నమోదయ్యాయి. వాస్తవానికి గ్రామంలో ఈ భూములను చామలబండ చెల్కలు అంటారు. వీటి పక్కనే మసీదుబండ చెల్కలు ఉన్నాయి. ఇవి దళిత రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములని గ్రామంలో ప్రతిఒక్కరికీ తెలుసు. దీంతో ధరణి రికార్డుల్లో కూడా తొలుత ఇవి లావణి పట్టా భూములుగానే నమోదయ్యాయి. ఆయా రైతుల నుంచి వారి వారసులకు కూడా ఈ భూముల బదలాయింపు (ఫౌతి) జరిగింది. ఈ భూములకు సమీపంలోనే ఔటర్ రింగు రోడ్డు ఉన్నది. ఇక్కడే పోలీస్ క్వార్టర్స్ కోసం భూమిని కేటాయించారు. ఆ క్వార్టర్స్ సౌకర్యార్థం వంద ఫీట్ల రహదారి నిర్మించారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి నేరుగా వంద ఫీట్ల రోడ్డు మీదుగా భూముల్లోకి వెళ్లే వెసులుబాటు ఉండటంతో వీటికి భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో భూముల రికార్డులు ఒక్కసారిగా తారుమారయ్యాయి. రాత్రికి రాత్రే ఇవి పట్టా భూములుగా మారిపోయాయి.

కొన్ని నెలల కిందట వెలుగులోకి..

మంఖాల్‌లోని లావణి పట్టా భూములు పట్టా భూములుగా మారాయని కొన్ని నెలల కిందట వెలుగులోకి వచ్చింది. ఇలా వెలుగులోకి రావడం కూడా వ్యూహం ప్రకారమేనని తెలుస్తున్నది. లావణి పట్టా భూములు పట్టాగా మారాయన్న ప్రచారంతో పాటు వాటికి సంబంధించిన రికార్డులేవీ లేవు. అన్ని గల్లంతయ్యాయని ప్రచారం జరుగుతున్నది. అధికారికవర్గాల్లోనూ ఇదేరీతన ప్రచారం చేశారు. సేత్వారీతో పాటు కొన్ని సంవత్సరాల రికార్డుల్లో పట్టా భూమిగా నమోదైందని, దీన్ని ఆసరా చేసుకొనే ఇలా పట్టాగా బదలాయించారని ప్రచారమైంది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక దీనిపై విచారణకు ఆదేశించగా కొందరు అధికారులు కొంత కాలం విచారణ చేశారు. కానీ ఇప్పటివరకు ఆ ఫలితమేమిటో బయటికి రాలేదు. విచారణ సారాంశమే ఇప్పటివరకు వెల్లడించలేదని ఓ అధికారి తెలిపారు. విచారణలో భాగంగా ప్రచారంలో ఉన్న విషయాలనే నమోదు చేసినట్టు సమాచారం. అధికారులు కూడా కొన్నేండ్ల రికార్డుల్లో పట్టా భూమిగా ఉన్నదని, దీని ఆధారంగానే బదలాయింపు జరిగిందని, అసలు రికార్డులే లేకుండా చేశారని చెప్తున్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' మహేశ్వరం తాహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సంప్రదించగా మూడు సర్వేనంబర్లకు సంబంధించిన రికార్డులు లభ్యమయ్యాయి. అందులో మూడు సర్వేనంబర్ల భూములు లావణి పట్టాగానే ఉన్నాయి. గ్రామంలో ఎవరిని అడిగినా ఇందిరమ్మ కాలంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములేనని చెప్పారు. రికార్డులను పరిశీలిస్తే సేత్వారీలో ఖారీజ్ ఖాతా సర్కారీగానే ఉన్నది. 1954-55లో సర్కారీగానే నమోదై ఉన్నది. 1980, 90,2000 ఇలా పలు దశకాల్లోని పలు సంవత్సరాల రికార్డులను చూసినా లావణి పట్టాగానే ఉన్నది. కాకపోతే కొన్నేండ్లు రికార్డుల్లో ఒకోచోట పట్టాగా రాశారు. ఉదాహరణకు 608/1 లావణి పట్టాగా రాసి, 608/2 పట్టాగా రాశారు. దీనిపై ఓ తహసీల్దార్‌ను సంప్రదించగా రెవెన్యూ రికార్డుల నమోదు సమయంలో వీఆర్వోలు నిర్లక్ష్యంగా లావణి పట్టా అని రాసే బదులు పట్టా అని రాసి వదిలేశారని, రాష్ట్రంలోని పలుచోట్ల కూడా ఇదే నిర్లక్ష్యం ఉన్నదని చెప్పారు. కానీ ఇక్కడ మాత్రం కేవలం దాన్ని ఆసరాగా చేసుకొని సర్కారు భూమిని పట్టాగా మార్చడం గమనార్హం.

ఆధారాలున్నా కాలయాపన ఎందుకో?

ఈ మూడు సర్వేనంబర్లలోని భూములు లావణి పట్టా అని రికార్డుల్లో స్పష్టంగా ఉన్నది. దీంతో పాటు క్షేత్రస్థాయిలో గ్రామసభ నిర్వహించి విచారణ చేసినా గ్రామంలోని వారంతా పూసగుచ్చినట్టు వివరాలు వెల్లడిస్తారు. ప్రధానంగా ఈ మూడు సర్వేనంబర్లలోని భూములు ప్రభుత్వానివే అనేందుకు బలైమన ఆధారం ఒకటి ఉంది. గతంలో 608/5 సర్వేనంబర్‌లోని రెండెకరాల భూమిని సదరు లావణి పట్టాదారు విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆ ప్రక్రియను నిలిపివేశారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయించేందుకు ప్రయత్నించినందున నిబంధనల మేరకు పీవోటీ కింద ఆ రెండెకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంఖాల్ లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా డంపింగ్ యార్డుకు భూమి కావాలని అధికారులు అన్వేషించినపుడు పీవోటీ కింద తీసుకున్న ఈ రెండెకరాల భూమి తెరపైకి వచ్చింది. దాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించారు. అయితే ఈ బదలాయింపు ప్రక్రియలో మాత్రం ఆ రెండెకరాలను వదిలేశారు. ఎందుకంటే.. మిగిలిన భూమికి యజమానులైన వారికి కోట్లు ఇచ్చి నోర్లు మూయించారు. కానీ ఈ రెండెకరాలను కూడా స్వాధీనం చేసుకుంటే గ్రామస్తులు డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని ఎలా తీసుకుంటారంటూ గొడవ చేస్తే మిగిలిన పెద్ద విస్తీర్ణానికి ఎసరు పడుతుంది. అందుకే ఇప్పటికీ నిషేధిత జాబితాలో 608/5 కింద రెండెకరాలను ప్రభుత్వ భూమిగా నమోదు చేసి ఉంచారు. ఈ భూములు ప్రభుత్వానివే అనేందుకు లావణి పట్టాను పీవోటీ కింద స్వాధీనం చేసుకున్న సాక్ష్యం అధికారుల వద్దనే ఉన్నది. రికార్డుల్లో ఉన్న దాని కంటే అదనంగా 12 ఎకరాల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు ధరణి వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నది. ఈ కోణంలోనూ అధికారులకు ఇందులో ఏదో మతలబు ఉన్నదనేది స్పష్టంగా తెలుస్తున్నది. అయినా విచారణ పేరిట నెలల తరబడి కాలయాపన చేస్తుండటం, మరోవైపు భూమిలో సదరు కంపెనీ వ్యక్తులు కార్యకలాపాలు మొదలు పెట్టడం అనుమానాలకు తావిస్తున్నది.



భూముల చుట్టూ కార్పొరేట్ కంపెనీ వేసిన రేకుల ప్రహరీ

విచారణ పూర్తి కాలేదు: కలెక్టర్ శశాంక




మంఖాల్‌లో మూడు సర్వేనంబర్లలోని భూముల అంశంపై రంగారెడ్డి కలెక్టర్ శశాంకను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా దానిపై విచారణ కొనసాగుతున్నదని తెలిపారు. మరోవైపు సదరు వ్యక్తులు భూములను స్వాధీనం చేసుకుని, రేకుల ప్రహరీ నిర్మించారని చెప్పగా ప్రభుత్వ భూమి అని విచారణలో తేలితే ప్రహరీని తొలగిస్తామని చెప్పారు.

గందరగోళంగా బదలాయింపు

మంఖాల్‌లోని 608, 609, 610 సర్వేనంబర్లలోని భూములను లావని పట్టా నుంచి పట్టాగా బదలాయించడం వ్యూహాత్మకమో? లేదా హడావుడో? గాని ప్రక్రియ అంతా గందరగోళంగా ఉన్నది. ప్రస్తుతం ధరణి వెబ్‌సైట్‌లో ఈ మూడు సర్వేనంబర్లలోని వివరాలు పరిశీలిస్తే..

- మూడు సర్వేనంబర్లలో 47.37 ఎకరాల భూమిని 13 ఖాతాల్లోకి బదలాయించారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల్లో 35.36 ఎకరాల భూమి మాత్రమే ఉన్నది. క్షేత్రస్థాయిలో రైతులకు అదనంగా 12 ఎకరాలు కూడా ఉండటంతో పనిలో పనిగా ఆ భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేశారు.
- 608లో 11 బై నంబర్లతో ఏడు ఖాతాలున్నాయి. కానీ ఈసీలు పరిశీలిస్తే 12 బై నంబర్లు, వాటిల్లో కొన్ని ఖాతాల్లో ఉన్నవాటికి భిన్నంగా ఉన్నాయి. 609 సర్వేనంబర్‌లో సుమారు ఐదు ఖాతాల్లో 23 బై నంబర్లు ఉన్నాయి. ఈసీల్లో ఏకంగా 36 బై నంబర్లు కనిపిస్తున్నాయి. 610 సర్వేనంబర్‌లో మరో ఐదు ఖాతాల్లో మూడు సర్వేనంబర్లలో 14 బై నంబర్లు ఉంటే ఈసీలో 19 బై నంబర్లు ఉన్నాయి. ఇలా మూడు సర్వేనంబర్లలో 13 ఖాతాలపై ల్యాండ్ డిటెయిల్స్‌లో 48 బై నంబర్లు ఉంటే ఈసీల్లో ఏకంగా 67 బై నంబర్లు ఉన్నాయి.
- ధరణిలో ఈ మూడు సర్వేనంబర్లలోని వివరాల్లో కేవలం 6.27 ఎకరాలకు సంబంధించిన భూ యజమానుల వివరాలే కనిపిస్తున్నాయి. మిగిలిన విస్తీర్ణంలోని వివరాలన్నింటిలోనూ సిటిజన్ పోర్టల్‌లో ఇచ్చిన అవకాశం మేరకు భూ యజమానుల వివరాలను గోప్యంగా ఉంచారు.
- ఈసీ పరిశీలనలో మాత్రం ప్రధానంగా వీఆర్‌కే డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ పేరిట రిజిస్ట్రేషన్లు జరిగినట్టు కనిపిస్తున్నది.



నిషేధిత జాబితాలో 608/5 కింద 2 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదైనట్టు రికార్డు

మూడు సర్వేనంబర్లలో లావణి పట్టాదారుల వివరాలు ఇవీ..

సర్వేనంబరు	మొత్తం విస్తీర్ణం	రికార్డుల్లో ఉన్న రైతుల పేర్లు
608/1	6-00	శర్పుగళ్ల బాబయ్య-2.00, శర్పుగళ్ల చిన బాబయ్య - 2.00, శర్పుగళ్ల పోచయ్య-2.00
608/2	4-37	నాశిగాని జంగయ్య - 4.37
609/1	1-13	నాశిగాని జంగయ్య - 1.13
609/2	5-39	శివగళ్ల చౌడయ్య - 5.39
609/3	6-00	రాగమళ్ల జంగయ్య - 3.00, రాగమళ్ల బాలయ్య-3.00
610/1	5-33	శివగండ్ల బావయ్య - 5.33
610/2	5-34	శివగళ్ల నర్సయ్య - 2.37, ఎల్లయ్య - 2.37

విల్లాల నిర్మాణానికి స్కెచ్..

ఔటర్‌కు అతి సమీపంతో పాటు వంద ఫీట్ల రహదారి ఉండటంతో ఇక్కడ విల్లాలకు భారీ గిరాకీ ఉంటుందని భావిస్తున్నారు. అందుకే తెరవెనుక పెద్ద ఎత్తున చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విచారణ కొనసాగుతున్నదని అధికారులు చెబుతుండగా నెలల తరబడి విచారణ ఏమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు విచారణ కొనసాగుతుండగానే సదరు కంపెనీ వ్యక్తులు భూమిని స్వాధీనం చేసుకొని చుట్టూ రేకుల ప్రహరీ నిర్మించారు. రక్షణగా కొందరు వ్యక్తులను అక్కడ నియమించి, ఎవరినీ లోపలికి అనుమతించడంలేదు. ప్రస్తుతం ఈ భూములను వ్యవసాయేతరంగా మార్చేందుకు నాలా కింద దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రక్రియ పురోగతిలో ఉన్నట్టు ధరణిలోనే చూపిస్తున్నది.

నోట్ల కట్టలతో నోర్లు మూయించి!



ముందుగా ఈ భూ రికార్డుల బదలాయింపు రైతులకు తెలియకుండానే జరిగినట్టు తెలిసింది. విషయం బయటికి పొక్కగానే సంబంధిత రైతులు పలువురు రాజకీయ నేతలను సంప్రదించారు. అనంతరం తెరవెనుక ఏం జరిగిందో గాని.. కొందరు బడా వ్యక్తులు రంగంలోకి దిగి రైతులను బుజ్జగించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బహిరంగ మార్కెట్లో ఇదేచోట పట్టా భూములు ఉంటే ఎకరా రూ.15-20 కోట్లకు పైగా ధర పలుకుతుందని తెలిసింది. కాకపోతే ఇవి సర్కార్‌వి కావడం, పైగా రికార్డులు మారిపోవడంతో న్యాయపరంగా పోరాడి సాధించేదేమీలేదని రైతులకు చెప్పినట్టు తెలిసింది. ఇప్పుడు రికార్డులు మారినందున ఏమీ చేయలేరని, డబ్బు తీసుకొని కాగితం రాసివ్వాలని సూచించినట్టు సమాచారం. దీంతో రైతులు కూడా కోట్లల్లో డబ్బులు వస్తున్నాయనే ఉద్దేశంతో మిన్నకుండినట్టు సమాచారం. ఔటర్ నుంచి నేరుగా వంద ఫీట్ల రహదారి భూముల వరకు వెళుతుంది. ఈ క్రమంలో రోడ్డుకు సమీపంలో ఉన్న భూముల వారికి ఎకరాకు రూ.2 కోట్ల వరకు, లోపల ఉన్న వారికి కోటి, కోటిన్నర వరకు చెల్లించినట్టు తెలిసింది. ఇంత పెద్ద మొత్తంలో చెల్లించేందుకు కారణం కూడా ఉన్నదని ఓ వ్యక్తి తెలిపారు. బదలాయింపుల్లో భాగంగా రికార్డుల్లో అంటే రైతు పాస్ పుస్తకంలో ఎంత విస్తీర్ణం ఉన్నదో అంతమేరకే డబ్బులు చెల్లించారని, కానీ అదనంగా 12 ఎకరాల వరకు రికార్డులు, క్షేత్రస్థాయిలో వస్తున్నందున రైతులకు కోట్లల్లో ముట్టజెప్పారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

జనాన్ని ముంచుతూ, తాను మునుగుతూ!

1924 డిసెంబర్ 26-28 తేదీల్లో బెల్గాంలో (ఇప్పటి బెళగావి, కర్ణాటక) జరిగిన 39వ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ఆ సందర్భంగా ఓ సందేశమిచ్చారు. 'మనకు అతి త్వరలో స్వాతంత్య్రం రాబోతున్నది. కాంగ్రెస్ నాయకులంతా ఏకతాటిపై ఉండాలి. అట్టడుగువర్గాలను పైకి తీసుకురావడం మన ప్రాధాన్యం కావాలి. కుల-వర్ణ వివక్ష లేని సమాజం మన లక్ష్యం కావాలి' అని ఆయన అన్నరు. మహాత్మాగాంధీ ఆ మాటలు చెప్పి వందేళ్లు దాటినయి. ఇప్పటి కాంగ్రెస్ నేతృత్వంలో ఆ విలువలకు నూరేళ్లు నిండినయి. ఆ మహనీయుడిని గాడ్సే భౌతికంగా నిర్మూలిస్తే, కాంగ్రెస్ పార్టీ ఆయన స్ఫూర్తిని చెరిపివేసింది.




శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

రేవంత్ రెడ్డి మొన్న చెప్పిన 'గాంధీల గొప్పతనం'.. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గురించి కాదు, రేవంత్ రెడ్డి స్కూలులో తాజాగా చేరిన అరికెపూడి గాంధీ గురించి! తాను ఏ పార్టీలో ఉన్నదీ గర్వంగా చెప్పుకోలేని దుస్థితిలో ఒక ఎమ్మెల్యే ఉండటం బహుశా మనం ఇంతకుముందు విని ఎరుగం. అదీ ఈ గాంధీ, వారి నాయకుని గొప్పతనం! రేవంత్ రెడ్డి వ్యవహారశైలి చూస్తుంటే కాంగ్రెస్ పార్టీని నిలువునా ముంచేదాకా ఆయన ఆగరేమోనని అనిపిస్తున్నది. 'స్వాతంత్య్రం రాగానే కాంగ్రెస్ పార్టీని రద్దు చేద్దాం' అని ప్రతిపాదించిన నాటి గాంధీ మాటను రేవంత్ మరోలా సాధిస్తున్న రేమో!

> **ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసేందుకు బలమైన రాజకీయ పార్టీలు అవసరం. రోడ్డు రోలర్ మెజారిటీ వచ్చిన పార్టీలు బుల్డోజర్ పాలన చేస్తాయి. వాటికి ముకుతాడు వేసే ప్రతిపక్షాలు అవసరం. తన పదేండ్ల పాలనలో నరేంద్ర మోదీ అన్ని వ్యవస్థలను ఎట్లా చెరబట్టిండీ, దానికి ప్రతిఫలంగా మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో మౌన విప్లవ ఫలితాలు ఎట్లా బీజేపీని కట్టడి చేసిందీ మనమంతా చూసినం.**

ఇండీ కూటమిలో ప్రధాన పాత్రధారి రాహుల్‌గాంధీకి భవిష్యత్తుపై దృష్టి ఉంటే తన పార్టీలోకి వస్తున్న కొత్త మురికినీటిని ఆయన గుర్తించాలి. పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన పాంచ్‌న్యాయ్ నుంచి పార్టీ దూరం జరిగిందని ఆ మధ్య కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి బహిరంగంగానే విరుచుకుపడ్డారు. ఆ తర్వాత మెత్తబడటం ఆయన సమస్య. కానీ, ఆయన లేవనెత్తిన అంశాలు మాత్రం కాంగ్రెస్ పార్టీ తనను తాను నిలబెట్టుకునేందుకు పనికివచ్చేవే.

పాంచ్‌న్యాయ్‌లో సామాజిక, ఆర్థిక కులగణన హామీతో పాటు యువత, మహిళలు, రైతులు, కార్మికులు తదితర వర్గాలకు వరాలు కురిపించింది కాంగ్రెస్ పార్టీ. ఈ పాంచ్‌న్యాయ్‌లోనే రాజ్యాంగ సమర్థన అనే ప్రత్యేక అంశాన్ని జోడించిన కాంగ్రెస్.. అందులో 13వ అంశంగా ఫిరాయింపుదారులపై వేటుకు సంబంధించి ప్రత్యేక హామీనిచ్చింది. 'ఒక పార్టీ టికెట్‌పై గెలిచిన సభ్యులు మరో పార్టీలోకి మారితే, ఆ సభ్యుల చట్టసభ సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దయ్యేలా చట్టం తెస్తాం. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో అవసరమైన సవరణలు చేస్తాం' అని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. హిమాచల్‌ప్రదేశ్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు జీతభత్యాలు రద్దు చేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్నది అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, తెలంగాణలో వీటన్నింటినీ అటకెక్కించింది. అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ర్టానికో రీతి, పూటకో నీతి కాదు. ఇప్పటికీ బీజేపీ ఒక బలమైన శక్తే. వారిని ఎదుర్కోవాలంటే వారికి లేని యూఎస్పీ (యూనిక్ సెల్లింగ్ పాయింట్) కాంగ్రెస్‌కు ఉండాలి. లేకపోతే ఏ కేజ్రీవాలో, ఏ మమతనో ఇండీ బ్లాక్ నుంచి కాంగ్రెస్‌ను తరిమివేయగలవు రాబోయే కాలంలో. 140 ఏండ్ల పురాతన పార్టీ ఆనాటి గొప్ప విలువలకు ఇప్పుడు నూతన విలువలను జోడిస్తూ బలపడాలి. కానీ, ఎటుపడితే అటు దొర్లే పచ్చి అవకాశవాదిలా మిగిలితే ప్రత్యర్థిని ఎదుర్కోలేదు.



తెలంగాణలో ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టు తలంటుపోసిన రోజే.. అరెకపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చి రేవంత్‌రెడ్డి న్యాయవ్యవస్థను పరిహసించిండు. హైడ్రా బుల్డోజర్ అన్యాయాన్ని కోర్టు ప్రశ్నించిన రోజే.. దాని కమిషనర్ రంగనాథ్ ఆర్డినెన్స్ గురించి మాట్లాడిండు. ముఖ్యమంత్రికి గాని, అధికార గణానికి గాని న్యాయవ్యవస్థపై అగౌరవం మాత్రమే కాదు, ధిక్కారం కూడా ఉన్నదని పదే పదే రుజువు అవుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం పట్టించుకోవడం లేదు.

> **ఒకే కేసులో కేజ్రీవాల్ పట్ల ఒక రకంగా, కల్వకుంట్ల కవిత పట్ల ఒక రకంగా వ్యవహరిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నుంచి గుణాత్మక రాజకీయాలు కోరుకోవడమంటేనే నవ్వులాటగా అనిపిస్తున్నది.**

కాంగ్రెస్‌కు రేవంత్ రెడ్డి రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉన్నది. నరేంద్ర మోదీ ప్రస్తుత భాగస్వామి చంద్రబాబు అనుంగు అనుచరుడైన రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో సత్యమైన విమర్శ చేసినా.. వెంటనే కొట్లాటకు వచ్చేది తెలంగాణ కాంగ్రెస్ అభిమానులు కాదు, టీడీపీ కార్యకర్తలు! వారు ఆంధ్రాలో, తెలంగాణలో, బెంగళూరులో, అమెరికాలో, మరే చోటున్నా డేగ కళ్లతో టీపీసీసీని చూస్తూ ఉంటరు. గాంధీభవన్‌లోనైనా, ప్రజాక్షేత్రంలోనైనా, సోషల్ మీడియాలోనైనా తమ నాయకుడు రేవంత్‌కు ఎల్లవేళలా కాపు కాస్తూ ఉంటరు. ఎప్పటికైనా టీడీపీకి రేవంత్‌రెడ్డియే పునర్ వైభవం తేగలడని వారి మిషన్, విజన్! టీడీపీ-బీజేపీ కాపురం ఢిల్లీ, అమరావతి సహా హైదరాబాద్‌లోనూ ప్రతిష్ఠించే లక్ష్య ప్రకటన వారి మాటల్లో, చేతల్లో కనిపిస్తూ ఉంటుంది.

దురదృష్టవశాత్తూ అంధ అధిష్ఠానానికి చాపకింది నీరు వచ్చేదాకా తెలియదు. తెలంగాణ కాంగ్రెస్‌లోని వీహెచ్, పొన్నం, శ్రీధర్‌బాబు లాంటివారు కరివేపాకులు. తన క్యాబినెట్ సహచరుడు శ్రీధర్‌బాబును మేనేజ్‌మెంట్ కోటా అని చెప్పే సాహసం రేవంత్‌రెడ్డి చేయడానికి కారణం ఆయన వెకిలి క్యారెక్టర్ మాత్రమే కాదు, ఎవరూ ఏమీ చేయలేరన్న ధైర్యం!

సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం ద్వారా తెలంగాణతనంతో (సెంటిమెంట్ అనే పదం సరైనది కాదు) ఆడుకోవాలని రేవంత్‌రెడ్డి పూనుకున్నడు. 'మేము నికార్సైన తెలంగాణవాళ్లం' అంటున్న కొందరు టీడీపీ మిత్రులతో తెలంగాణ తల్లి విగ్రహమా, రాజీవ్‌గాంధీ విగ్రహమా? అని అంటే రాజీవ్ విగ్రహమేనని వారు అన్నరు. వీరి ఆత్మ, రేవంత్‌రెడ్డి ఆత్మ ఒక్కటే. బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించే పాత్రికేయులు కూడా తెలంగాణ తల్లి విగ్రహానికి, రాజీవ్‌గాంధీ విగ్రహానికి పోటీ పెట్టడం సహించలేకపోతున్నరు. 'రాజీవ్‌గాంధీ ప్రాసంగికత ఆయన తెలంగాణ ఇచ్చిన సోనియా భర్తగానే' అనే తీవ్రమైన వ్యాఖ్య చేసిన్రు ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్! జాతీయ పార్టీకి ప్రాంతీయ అస్తిత్వాలు అర్థం కావు అంటున్నరు. జాతీయ పార్టీలకే కాదు, రేవంత్‌రెడ్డి లాంటి కొందరు ప్రాంతీయ దుష్ట పుత్రులకు కూడా ఈ నేల అర్థం కాదు, తెలంగాణ సోయి రాదు.

> **శ్రీకృష్ణుడు, భీష్ముడు, విదురుడు లాంటి మహామహుల మాటలను దుర్యోధనుడే పెడచెవిన పెడితే, కర్ణుడు మాత్రం (క్యారెక్టర్ ఎంత మంచిది అయినా) ఎందుకు ఊరుకుంటడు? ద్రౌపదిని అవమానిస్తడు, అభిమన్యుడిని అన్యాయంగా చంపుతడు కూడా. నేటి ఒరిజినల్ కాంగ్రెస్ నాయకుల పరిస్థితి కర్ణుడి లాంటిదే. ఆయన చావుకు ఆరు కారణాలు ఉన్నట్టు.. వీరి నాయకత్వంలో కాంగ్రెస్ నిర్యాణానికి ఆరు గ్యారెంటీలు, అక్కరకు రాని పరాయి నేతృత్వమూ పని చేస్తున్నయి!**

'కేసీఆర్ ఫాంహౌస్‌లో జిల్లేళ్లు మొలిపిస్తా' అనే రోగ్ మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి, నిజానికి తెలంగాణ అంతా జిల్లేళ్లు, బ్రహ్మజెముళ్లు మొలిపిస్తున్నడు. బ్రహ్మజెముడు అధిష్ఠానానికి జనం ఆక్రందనలు మాత్రం వినపడటం లేదు. 'కాసుకు లోనై అల్లుని తలచుకు ఆనందించెను అయ్యొకడే' అని గురజాడ అన్నట్టు.. ఈయన మోస్తున్న సూట్‌కేసుల కాసులకు లోనైనట్టుంది ఢిల్లీ లాబీ! కాబట్టి, రాష్ట్రంలోని సిసలైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కదిలి అధిష్ఠానం మొద్దునిద్ర వదలగొడితే వారికే మంచిది.

ఈ వ్యాసానికి భూమిక అయిన మహాత్మా గాంధీ కోరుకున్న స్వరాజ్యాన్ని సాధించి చూపిండు కేసీఆర్. ప్రాతఃస్మరణీయులైన స్వాతంత్య్ర యోధుల స్వప్నాలెన్నో తన పదేండ్ల పాలనలో చేసి దేశం ముందు ఒక సగర్వ మోడల్ నిలబెట్టిండు. తాజాగా ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి కూడా చెప్పింది.. దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని! ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దేశంలో, విదేశాల్లో ఘనంగా ప్రదర్శించుకుంటున్న విజయాలన్నీ కేసీఆర్ మానస పుత్రికలే, ఆయన దిద్దిన ఒరవడులే, ఆయన అద్దిన తిలకాలే, ఆయన రూపుకట్టిన ఫలకాలే, ఆయన ఈనగాచిన మాగాణాలే. ఇప్పుడు అది నక్కల పాలు అవుతున్నదని జీడీపీ లెక్కలు కూడా తెలియని గ్రామీణ జనం వాపోతున్నరు.

కరెంటు పోతే కేసీఆర్ గుర్తొస్తున్నడు; పెండ్లి ముహూర్తం పెట్టుకుంటే కేసీఆర్ గుర్తొస్తున్నడు; అకాల మరణాలు సంభవిస్తే కేసీఆర్ సాయం గుర్తొస్తున్నది; పేదల ఇండ్లు కూలితే కేసీఆర్ గుర్తొస్తున్నడు; హాస్టళ్లలో కలుషితాహారానికి, వీధుల్లో కుక్కల దాడులకు చిన్నారులు విగతజీవులవుతుంటే కేసీఆర్ గుర్తొస్తున్నడు; రైతు బంధు రాక ప్రైవేట్ అప్పులు చేసే రైతన్నలకు కేసీఆర్ గుర్తొస్తున్నడు; పాత్రికేయులను, మేధావులను జేసీబీలు, బుల్డోజర్లు ఆలోచనలో పడవేస్తున్నయి; జేఏసీలు గొంతు సవరించుకుంటున్నయి!

> **రైతులు రోడ్లు ఎక్కుతున్నరు; నిరుద్యోగులు జైలు ఊచలను లెక్కచేయక నిరసనలకు దిగుతున్నరు; కాంగ్రెస్ నాయకుల భూదందాలు, బెదిరింపులు, గూండాగిరీ ఇష్టారీతిన సాగుతున్నయి; 'వైఎస్, చంద్రబాబు కూడా చేయనట్లు రేవంత్ రెడ్డి మమ్ముల బజారు పాలు చేసిండు' అని మహిళలు బూతులు తిడుతున్నరు; వైద్యం, పారిశుద్ధ్యం పడకేశాయి; ప్రభుత్వం ఇచ్చే చెక్కులు బౌన్స్ అవుతున్నయి. స్థూలంగా 'మార్పు' కోసం కాంగ్రెస్‌కు ఓటేసిన జనం సంతోషంగా లేరు. 'తప్పు చేసినం, బుద్ధి వచ్చింది, మల్లా కేసీఆరే రావాలె' అంటున్న వీడియోలు సోషల్ మీడియాలో కోకొల్లలుగా చక్కర్లు కొడుతున్నయి.**

దీనంతటికీ కారణం ఒక్క రేవంత్‌రెడ్డియే. మరో మాట లేదు. ఆయన తన స్వార్థ ప్రయోజనాల కోసం తెలంగాణతో పాటు కాంగ్రెస్ పార్టీతోనూ ఓ ఆట ఆడుకుంటున్నడు. కాంగ్రెస్ మాజీ ఎంపీ ఒకరు చెప్పినట్టు.. 'రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లోనే కాదు, రాజకీయాల్లోనే ఉండకూడదు. అత్యంత ప్రమాదకారి ఆయన'!

కాంగ్రెస్ అధిష్ఠానమా, వింటారా? పూర్తిగా పుట్టి మునిగే దాకా ఆగుతారా?

కేసీఆర్ నేతృత్వంలో మేమైతే గాంధీ చెప్పిన మాటలు మననం చేసుకుంటున్నం. 'మనకు (తెలంగాణకు) అతి త్వరలో స్వాతంత్య్రం (తిరిగి) రాబోతున్నది. ప్రజలంతా ఏకతాటిపై ఉండాలి. అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావడం మన ప్రాధాన్యం కావాలి. కుల-వర్ణ వివక్ష లేని సమాజం మన లక్ష్యం కావాలి'.. అని ఆ మహనీయుడి ఉద్బోధలను స్ఫూర్తిగా తీసుకోవడానికి అక్టోబర్ 2 దాకా మేం ఆగబోవడం లేదు. పది నెలల కిందటి బంగారు తెలంగాణ సాధించి తీరుతం!

జై తెలంగాణ! జై భారత్!!

> **మహాత్మాగాంధీ కోరుకున్న స్వరాజ్యాన్ని సాధించి చూపిండు కేసీఆర్. ప్రాతఃస్మరణీయులైన స్వాతంత్య్ర యోధుల స్వప్నాలెన్నో తన పదేండ్ల పాలనలో చేసి దేశం ముందు ఒక సగర్వ మోడల్ నిలబెట్టిండు. తాజాగా ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి కూడా చెప్పింది.. దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని!**

ప్రజలే వారికి బుద్ధి చెప్తరు!

తొలి ఎన్నికల నాటి నుంచి సుమారు 30 ఏండ్ల దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురే లేదు. పల్లెల్లో రాజరికం నడిపినవాళ్లే కాంగ్రెస్‌లో చేరి తమ పెత్తనాన్ని యథావిధిగా కాపాడుకున్నారు. ఆస్తులకు కొదవ లేని ఆ కుటుంబాలు రాజదండం తమ చేతిలో ఉందని తృప్తిపడ్డాయి. ఇప్పటిలా సాగు నష్టాలు, నిరుద్యోగం, వాటికి విరుగుడుగా సంక్షేమ పథకాలు లేనందువల్ల జనం ప్రభుత్వం వైపు ఆశగా, ఆసక్తిగా చూసేవారు కాదు. దాంతో నాయకులకు పార్టీ మారే అవసరమే పడలేదు.



నర్సన్ బద్రి
94401 28169

కాంగ్రెస్ ఆధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతున్న కాలంలో 1980 దశకం ఆరంభంలో ఓ కుదుపు వచ్చింది. 'రాష్ట్రంలో ఈ రాయలసీమ రెడ్ల పాలన ఎన్నాళ్లు?' అనే ఆలోచన సీమాంధ్ర కమ్మవారికి కలిగింది. దీనికి సూత్రధారి ఈనాడు రామోజీరావు కాగా, పాత్రధారి నటుడు ఎన్టీ రామారావు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీతో ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. ప్రత్యేకిచి నాన్ రెడ్డి వర్గాలను ఎన్టీఆర్ ప్రోత్సహించి చేరదీశారు. దీంతో కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు టీడీపీలోకి జంప్ అయ్యారు. ఈ మార్పుతో క్యాడర్‌ను కోల్పోయిన కాంగ్రెస్ బలహీనపడింది.

కేసీఆర్ రూపంలో తెలుగునేలపై మరో ప్రభంజనం పుట్టింది. 2001లో ఆయన స్థాపించిన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఏపీ రాజకీయాలను అతలాకుతలం చేసింది. 45 ఏండ్ల పాటు పెత్తనం చెలాయించిన ఆంధ్రులు కేసీఆర్ డిమాండ్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. బీఆర్ఎస్‌ను పురిటిలోనే చంపేందుకు వైఎస్ఆర్ కుట్రలు చేశారు. క్రమంగా కేసీఆర్‌కు పెరుగుతున్న ప్రజల మద్దతు చూసి ఇతర పార్టీల నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలు మొదలయ్యాయి. తెలంగాణ సాధన కోసం లక్షలాది మంది యువకులు కేసీఆర్ వెంట నడిచారు. ఈ రూపంలో తెలంగాణలోని అన్ని వర్గాలు కొత్తగా రాజకీయాలకు చేరువయ్యాయి. వారిలో చాలామంది స్వరాష్ట్రంలో పదవులను చేపట్టారు.

ఎన్టీఆర్, కేసీఆర్ పార్టీలను స్థాపించడం, అవి విజయవంతమవడంతో కాంగ్రెస్‌లోని పెద్దపెద్ద నాయకులు, చిన్నాచితక నేతలు ఆ పార్టీల్లో చేరిపోయారు. తెలంగాణలో కేసీఆర్ పాలన మొదలయ్యాక 2014లో మరో భారీ కుదుపు తప్పలేదు. టీడీపీ ఎమ్మెల్యేల పరిస్థితి అగమ్యమైపోయింది. తెలంగాణలో ఆ పార్టీ మళ్లీ బతికి బట్టకట్టదని స్థానికంగా బలమైనవారు బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ గద్దె దిగడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేల్లోనూ అభద్రతాభావం ఏర్పడింది. వారు కూడా బీఆర్ఎస్‌ను నమ్ముకున్నారు. కొత్త రాష్ట్రంలో జరిగిన ఈ మార్పులను స్వీయపాలనలో అనివార్య రాజకీయ సమీకరణంగానే భావించాలి. తెలంగాణ అభివృద్ధి కోసం పాటుపడేవారంతా ఒక్కతాటిపైకి రాక తప్పని అవసరమది. ఒకసారి నేతల కోణంలోంచి చూస్తే.. తెలంగాణలో కొత్త రాజకీయ సంస్కృతి వ్యాపించింది. గత 40 ఏండ్లుగా రాజకీయాల్లోకి వచ్చిన వారికి పార్టీ సెంటిమెంట్ లేదనే చెప్పాలి. ప్రజాప్రతినిధులుగా గెలిచినప్పటికీ తమ పార్టీ అధికారానికి దూరమైనవాళ్లలో ఐదేండ్ల పాటు ప్రతిపక్షంలో ఉండే ఓపిక కొరవడుతోంది. 'కోట్లు కుమ్మరించి గెలిచిందే అధికారం కోసం కదా!' అనే కాంక్ష వారిని నిద్రపోనీయడం లేదు. తాము గెలిచిన చోట తమపైనే ఓడిపోయిన అధికార పార్టీ అభ్యర్థులు అధికారుల వద్ద గౌరవం పొందడం, ఆఫీసుల్లో పనులు చకచకా చేసుకోవడం జీర్ణించుకోలేని పరిస్థితి. 'గెలిచి ఎదురీదే ఖర్మ నాకెందుకు' అనే చికాకు వారిని నిలవనీయడం లేదు. 'పార్టీ గీర్టీ జాన్ తే నై.. చలో జంప్ జలానీ' అని చాలామంది ఆలోచిస్తున్నారు. ఈ అనిశ్చితిలో 'నేను పార్టీ మారను' అన్న మర్నాడే కండువా మార్చేస్తున్నారు.



> **బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఈ మధ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారెవరూ తమ పదవులకు రాజీనామా చేయలేదు. వారిలో ఒకరు కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు కూడా.**

కూతురి రాజకీయ భవిష్యత్తు కోసం పదవులిచ్చిన పార్టీకి ఒకరు తీరని ద్రోహం చేశారు. రెండోసారి గెలిచిన ఓ యువ ఎమ్మెల్యే గురువుకే పంగనామాలు పెట్టడం దారుణం. వయసు మీద పడిన పెద్దలు పార్టీ మారి వారి చరిత్రకే మచ్చ తెచ్చుకున్నారు. 81 ఏండ్ల పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరినప్పుడు 'సచ్చే ముందు ఏం రోగమొచ్చిందని పార్టీ మారిండు' అని తిట్టిన రేవంత్ రెడ్డి.. 85 ఏండ్లున్న కె.కేశవరావు, పోచారం శ్రీనివాసరెడ్డిలను కాంగ్రెస్‌లో చేర్చుకొని ప్రభుత్వ పదవులు కట్టబెట్టారు. వారి ఖర్చంతా ఖజానాకు దండగే. ఈ వ్యవహారంలో తప్పు చేర్చుకొనే పార్టీదా.. చేరే ప్రజాప్రతినిధిదా? అనేది పరిస్థితులను బట్టి ఉంటుంది. ఫిరాయింపు వల్ల పరిణామాలు రకరకాలుగా ఉంటాయి. ఇలాంటి ఫిరాయింపులను నిరోధించేందుకు 1985లోనే చట్టం వచ్చింది. పార్టీ నియమాలను, ఆదేశాలను ఉల్లంఘించినట్లు సాక్ష్యాలుంటే స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు. పార్టీ మారే ఎమ్మెల్యేల సంఖ్య 2/3 దాటితే ఈ చట్టం వారికి వర్తించదు. 2016లో 15 మంది టీడీపీ ఎమ్మెల్యేల్లో 12 మంది బీఆర్ఎస్‌లో చేరడం ఈ రకంగా చట్టబద్ధమైనదే.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు గులాబీ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించకపోవడంతో వారు కోర్టుకు వెళ్లారు. ఆ పిటిషన్‌పై న్యాయస్థానం సానుకూలంగా స్పందించడం ఓ శుభపరిణామం. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని సెప్టెంబర్ 8న స్పీకర్ కార్యాలయాన్ని కోర్టు ఆదేశించింది. లేకపోతే సుమోటోగా ఈ కేసును విచారణ చేస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఫిరాయింపు చట్టం ప్రకారం వారు ఎమ్మెల్యేలుగా కొనసాగలేరు. న్యాయం నిలబడి ఉప ఎన్నికలు వస్తే మాత్రం ఓటర్లు వారికి తగిన బుద్ధి చెప్తరు.



వేకువ సూర్యుడు ఏచూరి

మరువదయ్య మరువదయ్య నీ త్యాగం ఈ లోకం
ఆ చంద్ర తారార్కం వెలుగును నీ ఆదర్శం
కరుగుతు వెలుగును పంచె సూర్యునిలా నీ రూపం
తలపుకొచ్చి ప్రతి ఎదలో పొంగుతున్నది శోకం

సిరులకు యే లోటు లేని కుదురులోన పుట్టినావు
పరుల బాధలను గాంచి కన్నీరై కరిగినావు
అనంతమగు కడలి వోలె అంతులేని నీ జ్ఞానం
అలసటన్నదే లేని అవని వోలె నీ పయనం

వేదంతో భాసిల్లే వేకువ ప్రాకారంలో
పసితనంలో నీ పఠనం నీ ప్రతిభకు తొలిబీజం
రామానుజ సమతత్వం శ్రీ వైష్ణవ తిరుతత్వం
మార్క్సిజంతో మేళవించి మంచి నీవు పెంచినావు

నేల మీద నడయాడే సందమామ దీవి నీవు
జాలి గుండె బుద్ధుని వలె మానవతకు తావి నీవు
ఆశలు నింపే బోధలు వేసవిలో వానజల్లు
ఉద్యమాల దారులలో నీ రాతలె హరివిల్లు

సుడిగుండాలెదురీదే విప్లవాల నావ నీవు
కష్టజీవి కడగండ్లను తొలిగించే తోవ నీవు
చంద్ర రాజేశ్వరుండు సుందరయ్య వేసినట్టి
ఉద్యమాల వారధివై ఉప్పెనలను ఆపినావు


నిస్వార్థం కొలువుండే చిరునామా నీ పాదు
నిజం ఎంత బరువున్నా భుజము నీవు వంచలేదు
ప్రతి మలుపులో నీ గమనం విప్లవాల గుణపాఠం
అణువణువున కమ్యూనిజం నీవు నిలుపుకున్న ధనం

గుండె లోతులో నుండి ఉబికే నీ సూటిమాట
నిమిషములో ఎండనైన నీడవోలె మార్చుతుంది
నీ చూపుకు మునిగిపోయే పడవైన తేలుతుంది
నీ నవ్వుకు కటుసీకటి దీపంలా వెలుగుతుంది

కొన ఊపిరిలో సైతం విప్లవ కలనే కన్నావు
ఆ గగనపు ఎర్రజెండ కదిలే అల వలె ఉన్నావు
ఈ మట్టి నుదిటి మీద రాసుకున్న త్యాగ లిపివి
ఎర్రెర్రని సెట్ల పూల వీసే వేకువ గాలివి



- గోరేటి వెంకన్న
(కవి, వాగ్గేయకారుడు)



పాలకుడు విమర్శలను సహించాలి!



పాలకుడు తనకు అత్యంత ప్రతికూలమైన అభిప్రాయాన్ని కూడా సహించి, ఆత్మశోధన చేసుకోవడమే ప్రజాస్వామ్యానికి అతిపెద్ద పరీక్ష. భారతదేశంలో అభిప్రాయభేదాలు ఉండటమనేది సమస్య కాదు, అభిప్రాయాలు లేకపోవడమే అసలు సమస్య. మనం సంప్రదాయవాదులమో లేక వామపక్షవాదులమో కాదు, అవకాశవాదులం. రచయితలు, మేధావులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించాల్సి ఉంది. న్యాయ, పరిపాలన, శాసన, మీడియా వ్యవస్థలనే నాలుగు స్తంభాలు విలువలను పాటించినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతమవుతుంది.

- నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి

సింగరేణిలో బోనస్.. బోగస్



లాభాలను తక్కువ చూపి పొట్టగొడ్తరా?

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ 2023-24లో రూ.4,701 కోట్ల లాభాలు ఆర్జించిందని, కానీ ప్రభుత్వం రూ.2,412 కోట్లకు కుదించి మితం చేసి అందులో 33 శాతం వాటా మాత్రమే కార్మికులకు ఇచ్చి వారి పొట్టగొట్టిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.2,289 కోట్ల లాభాలకు సంబంధించిన బోనస్ ఎగ్గొట్టిందని, వాస్తవానికి ఇచ్చింది 16.90 శాతమేనని ఆరోపించారు. బోనస్ సింగరేణి కార్మికుల హక్కు అని, కాంగ్రెస్ సర్కారు కార్మికులకు ఎక్కువ బోనస్ ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సింగరేణి అభివృద్ధి పేరుతో లాభాలను తగ్గించి చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ఆల్‌టైం రికార్డు ఉత్పత్తి సాధించిందని, అయినా ఒక్కో కార్మికుడికి గతేడాది కంటే రూ.20 వేలు మాత్రమే అదనంగా బోనస్ ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఇలా లాభాలను తగ్గించి చూపలేదని తెలిపారు.

- లాభాల్లో 50 శాతం కోత విధించిన ప్రభుత్వం
- కార్మికుల చెమటకు సెల్యూట్ చేసింది కేసీఆరే
- నికరలాభాల్లో నుంచే 33 శాతం బోనస్ ఇవ్వాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులకు 33 శాతం బోనస్ ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు బోగస్ మాటలు చెప్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కార్మికులకు ఇచ్చే లాభాల్లో సీఎం కోత విధించారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే మొత్తం రూ.4,701 కోట్లల్లో కార్మికులకు 33 శాతం బోనస్ ప్రకటించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపికబురు అని చెప్పి సీఎం చేదు నిజాన్ని దాచారని ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థ లాభాల వాటాలో 50 శాతం కోత విధించడాన్ని ఆయన ఖండించారు. నెత్తురును చెమటగా చేసిన కార్మికుల ఆశలను రేవంత్ సర్కార్ అడియాశలు చేసిందని మండిపడ్డారు. 2008-09 నుంచి 2010-11 వరకు సమైక్య రాష్ట్రంలో సింగరేణి లాభాల్లో కార్మికులకు ఇచ్చిన వాటా కేవలం 16 శాతమేనని, ఆ చరిత్రను సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి గుర్తుచేశారని పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమం వెంట నడిచిన సింగరేణి కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని స్వరాష్ట్రంలో నాటి సీఎం కేసీఆర్ ఎంతో ఉదారతతో వ్యవహరించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తొలి ఏడాది (2014-15)లోనే సింగరేణి లాభాల నుంచి కార్మికులకు 21 శాతం వాటాను ప్రకటించారని తెలిపారు. నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను లాభాల బాటలో పట్టించి కార్మికుల కష్టానికి గుర్తింపుగా ఆర్జించిన నికర లాభాల నుంచి కార్మికులకు ప్రతి ఏడాది వాటాను ఇస్తూ సింగరేణి కార్మికుల చెమటకు సెల్యూట్ చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారుదేనని తేల్చిచెప్పారు. 2022-23లో రూ.2,222 కోట్ల లాభాలు వస్తే కార్మికులకు ఏకంగా 32 శాతం (దాదాపు రూ.710 కోట్లు) వాటాగా ప్రకటించిన కేసీఆర్ కార్మికుల కష్టానికి గుర్తింపు, గౌరవాన్ని ఇచ్చారని తెలిపారు.

కార్మికులకు 1,550 కోట్లు దక్కాలి

2023-24లో వచ్చిన సింగరేణి సంస్థ లాభాలు రూ.4,701 కోట్లని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందులో 33 శాతం లాభాల వాటా పంచితే ఆ మొత్తం రూ.1,550 కోట్లు కార్మికులకు దక్కాల్సి ఉన్నదని తెలిపారు. కానీ కార్మికులకు ప్రకటించింది కేవలం రూ.796 కోట్లేనని, ఈ లెక్కన 16.9 శాతం మాత్రమే బోనస్‌గా ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. కార్మికులకు హక్కుగా రావాల్సిన మిగతా వాటా రూ.754 కోట్లు ఏమైనట్టు? అని ప్రశ్నించారు. ఆల్ టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా గతం కంటే ఒక్కో కార్మికుడికి అదనంగా ఇచ్చేది రూ.20 వేలేనా? అని సర్కారును నిలదీశారు.



లాభాలు తెచ్చిన కార్మికులకు చీకట్లా?

అందరికీ వెలుగులు అందించే సింగరేణి కార్మికుల జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి నింపే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. సమైక్య రాష్ట్రంలో కార్మికులకు జరిగిన అన్యాయం కంటే స్వరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయానికి గురిచేస్తున్నదని పేర్కొన్నారు. బోనస్ విషయంలో కార్మికులకే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకూ అన్యాయమే చేసిందని, ఉద్యోగుల సంఖ్యను కుదించి రూ.5 వేల బోనస్‌ను కొందరికే పరిమితం చేసిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర ప్రగతిలో ఎంతో కీలకంగా ఉన్న సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ సహించదని స్పష్టం చేశారు. పదేండ్లలో సింగరేణి సంస్థ లాభాలు, కార్మికులకు ఇచ్చిన బోనస్, వాటా వివరాల జాబితాను హరీశ్‌రావు విడుదల చేశారు.

సంవత్సరం	వచ్చిన లాభం (కోట్లలో)	కార్మికులకు పంచిన వాటా (కోట్లలో)	వాటా శాతం
2023-24	4,701	796	16.90
2022-23	2,222	700	32
2021-22	1227	368	30
2020-21	272.64	79.07	29
2019-20	993	278	28
2018-19	1765	494	28
2017-18	1212	327	27
2016-17	395	99	25
2015-16	1066	245	23
2014-15	490	103	21

కార్మికులకు 1550 కోట్లు ఇవ్వాలి

- కార్మికులకు ప్రభుత్వం, గుర్తింపు సంఘం మోసం
- కలిసి వచ్చే సంఘాలతో పోరాడుతాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి



గోదావరిఖని, సెప్టెంబర్ 21: సింగరేణి కార్మికులకు 33 శాతం వాటా కింద రూ.1,550 కోట్లు ఇవ్వాల్సిందేనని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులు మునుపెన్నడూ లేనంతగా రూ.70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి, రికార్డు స్థాయిలో బొగ్గు రవాణా చేశారని వివరించారు. 2023-24 వార్షిక సంవత్సరానికి రూ.4,701 కోట్ల నికర లాభం వచ్చినట్టు ప్రభుత్వం పేర్కొన్నదని, అందులో కార్మికులకు 33 శాతం వాటా రూ.1,550 కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.796 కోట్లు మాత్రమే ఇవ్వడం వెనుక మతలబు ఏమిటో చెప్పాలని నిలదీశారు. ప్రతి కార్మికుడికి లాభాల్లో వాటా కింద రూ.4 లక్షలు రావాల్సి ఉన్నదని, కానీ ప్రభుత్వం చేసిన మోసానికి గెలిచిన కార్మిక సంఘం వంతపాడటంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షల మేర లాభాలను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వం, సింగరేణి గుర్తింపు సంఘం మోసాన్ని ఎండగట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు.



ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటాపై గనిలో ఐఎన్‌టీయూసీ నాయకులను ప్రశ్నిస్తున్న సింగరేణికార్మికులు

లాభాల్లో వాటాకు కోతెందుకు?

కాసిపేట 2 ఇంక్లైన్ వద్ద ఐఎన్‌టీయూసీ నేతలను నిలదీసిన కార్మికులు

కాసిపేట, సెప్టెంబర్ 21: సింగరేణి సంస్థకు వచ్చిన లాభం రూ.4,701 కోట్లు. దానిలో రూ.2,283 కోట్లను మినహాయించి, రూ.2,412 కోట్లలో నుంచే 33 శాతం వాటా ప్రకటించారు. మునుపెన్నడూ లాభంలో సగం పక్కన పెట్టి మిగతా సగంలో వాటా ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో చేయని ఆ పని ఇప్పుడు ఎందుకు చేస్తున్నారు? అని మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో కార్మికులు ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో గనిపైకి వెళ్లి ఐఎన్‌టీయూసీ నాయకుడు పుల్లూరి లక్ష్మణ్ సహా పలువురిని నిలదీశారు. 'సింగరేణికి రూ.4,701 కోట్ల లాభాల్లో 33 శాతం అంటే రూ.1,550 కోట్లు రావాలి. కానీ ప్రకటించింది రూ.796 కోట్లేనని చెప్పారు. లాభాల్లో రూ.2,283 కోట్లను పక్కన పెట్టి మిగిలిన దాంట్లో వాటా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఎంత లెక్కలు చేసినా ప్రభుత్వం ఇచ్చేది 17 శాతానికి లోపేనని తేల్చిచెప్పారు. నికర లాభంలో 33 శాతం ఇవ్వాలని, లేకపోతే 33 శాతం ఇస్తున్నట్టు చేసిన ప్రకటనను వెనక్కి తీసుకొని, ఎంత ఇస్తున్నారో బయటికి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు లెక్కలేసి మరీ చెప్పడంతో ఐఎన్‌టీయూసీ నాయకులు సమాధానం చెప్పలేక పోయారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్ని వచ్చాయి? ఇప్పుడు ఎంత వచ్చాయని ప్రశ్నించారు. లాభాల వాటా, బోనస్‌పై కార్మికులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు కార్మిక సంఘం నాయకులు సమాధానాలు చెప్పలేకపోయారు. కేసీఆర్ ఉన్నప్పుడు లాభాల్లో వాటా ఎక్కువ వచ్చిందని, ఇప్పుడు లాభాలు ఎక్కువ శాతం, ఇచ్చేది తక్కువ శాతం ఉన్నదని, ఆ డబ్బు ఎటు వెళ్తున్నదో చెప్పాలంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరద పోయినా కన్నీళ్లు పారాలా?

- బాధితులకు సాయంపై చిత్తశుద్ధి ఏదీ?
- మృతుల కుటుంబాలకు 25లక్షలు ఇవ్వండి
- సీఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): 'వరద పోయినా ఇంకా బాధితుల కన్నీళ్లు పారాలని ప్రభుత్వం చూస్తున్నదా? రేవంత్ రెడ్డి సర్కార్ ఇకనైనా నిర్లక్ష్యం వీడి వరద బాధితులకు తగిన సాయం చేయాలి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు చెల్లించాలని, ఇండ్లు కూలి, సామాన్లు నష్టపోయిన వారికి రూ. 2 లక్షలు, పూర్తిగా ఇండ్లు కూలినవారికి రూ.10 లక్షల చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టం కింద ఎకరాకు రూ. 25వేలు అందించి మాట నిలుపుకోవాలని చెప్పారు. పశువులు నష్టపోయిన వారికి లక్ష సాయం , చిరువ్యాపారులకు రూ. 5లక్షల పరిహారంతో పాటు వడ్డీ లేని రుణాలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ శనివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. భారీ వరదలతో ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్ తదితర జిల్లాల్లో 33 మంది ప్రాణాలు కోల్పోయారని, రూ.5,438 వేల కోట్ల ఆస్తి నష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.

వారికి ఏం సమాధానం చెప్తరు?

వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్ విమర్శించారు. '9 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే కనీసం 9 మందిని కూడా కాపాడే నాయకుడే కరువయ్యాడని ఖమ్మండి జిల్లా ప్రజలు కన్నీటి పర్యంతమవుతూనే ఉన్నారు' అని గుర్తుచేశారు. ప్రభుత్వ చేతగానితనంతో తమ వారిని కోల్పోయామని బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారని తెలిపారు. వరద విషాద పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చిరునవ్వులు చిందిస్తూ.. చేతులూపుతూ ర్యాలీ తీసిన దృశ్యాలు మరింత కుంగదీస్తున్నాయన్నబాధితుల ఆవేదనకు ఏమని సమాధానం చెప్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తక్షణ సాయం కింద ముందు రూ.10వేల పరిహారం ఇస్తామని చెప్పి ఆ తర్వాత నష్టం స్థాయిని బట్టి సాయం చేస్తామనిచెప్పడం బాధితుల్లో అయోమయాన్ని కలిగించిందని చెప్పారు. కట్టుబట్టలతో మిగిలిన వారికి ప్రభుత్వంతోపాటు స్థానిక మంత్రి పొంగులేటి కలిపి కేవలం రూ.16,500 అని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 15,096 మందిని రూ.16,500 సాయం అందించేందుకు గుర్తించి, రూ.18వేలు అందించేందుకు కేవలం 146 మందినే గుర్తించడంలో సర్కారు ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు పది రోజుల్లోనే రైతులకు అందిస్తే కాంగ్రెస్ నానా యాగీచేసిందని, అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.25 వేలు ఇస్తామని నాడు రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట, అధికారంలోకి రాగానే మరోమాట చెప్పి ప్రజలను మోసం చేయటంలో రేవంత్‌రెడ్డి సిద్ధహస్తుడని విమర్శించారు. మీడియా మేనేజ్‌మెంట్‌ను వీడి ప్రకృతి వైపరీత్యాల నిర్వహణపై దృష్టి సారించాలని హితవు పలికారు.



సింగరేణి కార్మికులకు సీఎం దగా

- ఇచ్చిన బోనస్ కేవలం 16.90 శాతమే
- ఒక్కో కార్మికుడికి వచ్చేది 1.90 లక్షలు
- ప్రభుత్వం చెప్పకునేది 33 శాతమా?
- ఆ లెక్కప్రకారం 3.70 లక్షలు రావాలి
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సింగరేణి కార్మికులను సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు నమ్మించి నట్టేట ముంచిందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సింగరేణి కార్మికుల చెమటను, కష్టార్జితాన్ని దోచుకున్నదని ఒక ప్రకటనలో విమర్శించారు. 2023-24 సంవత్సరానికి సింగరేణి సంస్థ రూ.4,701 కోట్ల నికర లాభం ఆర్జిస్తే, కేవలం రూ.796 కోట్లు కార్మికులకు ఇచ్చి 33 శాతం ఇచ్చామని అబద్ధాలు చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. అందులో రూ.2,289 కోట్లను ఎందుకు దాచారని ప్రశ్నించారు. కేవలం రూ.2,412 కోట్లను లాభంగా చూపించి అందులో నుంచి 33 శాతం ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ప్రభుత్వ దగా వల్ల ఒక్కో కార్మికుడు రూ.1.80 లక్షల చొప్పున కోల్పోతున్నాడని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టు లాభాల్లో 33 శాతం చొప్పున కార్మికులకు ఇస్తే.. 33 శాతం (4,701 కోట్ల) వాటా కింద రూ.3.70 లక్షలు వచ్చేవని తెలిపారు. సర్కారు కుట్రపూరితంగా రూ.1.90 లక్షలే ఇచ్చి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. నిరుడు సంస్థకు వచ్చిన నికర లాభం రూ.2,222 కోట్ల నుంచి నిరుడు బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు 32 శాతం వాటా కింద రూ.700 కోట్లను కార్మికులకు పంచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నట్టు వారికి 33 శాతం బోనస్ ఇవ్వలేదని, ఇచ్చింది కేవలం 16.90 శాతం వాటా మాత్రమేనని తెలిపారు.



ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహారదీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ నాయకులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- కాంగ్రెస్ మ్యానిఫెస్టో, హామీలను అమలుచేయాలి
- టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న
- ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహార దీక్షలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. పాలనాపగ్గాలు చేపట్టి 10 నెలలు దాటినా దీనిపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశలవారీ ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద సామూహిక నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలు లేక ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మికుల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే సెలవు మంజూరు కోసం శవంతో సెల్ఫీ పెట్టాలని అధికారులు అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలని జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ బాండ్ బకాయిలను ఉద్యోగులందరికీ చెల్లించాలని, 2017 వేతన సవరణ చట్టప్రకారం బకాయిలు ఇవ్వాలని జేఏసీ వైస్ కన్వీనర్ మౌలానా కోరారు. 2021 వేతన సవరణను అమలు చేయాలని జేఏసీ కో కన్వీనర్ యాదయ్య డిమాండ్ చేశారు. సీసీఎస్‌కు రూ.900 కోట్లు, పీఎఫ్‌కు రూ.1,475 కోట్లు, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీకి రూ.650 కోట్ల చొప్పున సంస్థకు అందజేయాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ల విషయంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కో కన్వీనర్ సురేశ్, కోకన్వీనర్ యాదగిరి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎల్ బాల్‌రాజు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాబు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ పీ సుభాశ్, కండక్టర్ల ఐక్యవేదిక బాధ్యులు కేఆర్ కుమార్, తేజావతి పాల్గొన్నారు.

అంగట్లో రేషన్ డీలర్ పోస్టులు

- పోస్టులు అమ్ముకుంటున్నారన్న కాంగ్రెస్ కార్యకర్త
- కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే రేషన్ దుకాణం
- బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత కక్ష



డీలర్ పోస్టులు కాంగ్రెస్ నేతలు అమ్ముకున్నారని ఆరోపిస్తున్న కాంగ్రెస్ కార్యకర్త మహిపాల్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ డీలర్ల నియామక ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. కాంగ్రెస్ కార్యకర్తలకే కట్టబెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోస్టులను డబ్బులకు అమ్ముకుంటున్నారంటూ కాంగ్రెస్ కార్యకర్త మీడియా ఎదుట ఆరోపించడం బలాన్ని చేకూరుస్తున్నాయి. కండువా కప్పుకుంటేనే దుకాణం.. లేదంటే ఉన్న పోస్టు ఊస్టేనంటూ ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరిస్తున్నట్టు తెలిసింది.

ప్రకటించని జాబితా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 58 కొత్త రేషన్ డీలర్ పోస్టులకు 29న నోటిఫికేషన్ జారీచేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులు కాగా, 15న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించారు. 830 మంది దరఖాస్తు చేసుకోగా, 765 మంది పరీక్షకు హాజరు హాజరయ్యారు. శనివారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మార్కుల జాబితాను అధికారులు ప్రకటించలేదు. దీంతో అభ్యర్థులంతా ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కుల జాబితా బోర్డుపై ప్రదర్శించిన తర్వాతే ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేరుకే పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారని, పోస్టులన్నీ అమ్ముకున్నారంటూ ఓ కాంగ్రెస్ కార్యకర్త మీడియా ముందు వెల్లడించారు. తన వద్ద అన్ని ఆధారాలున్నాయని, ఎవరికి డీలర్‌షిప్‌లు వస్తాయో కూడా తాను బయటపెడుతానని ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త కావాటి మహిపాల్ స్పష్టం చేశారు. తమ ఊళ్లో ఒక ముదిరాజ్, వెలమ వర్గానికి చెందిన ఇద్దరు మహిళలకు పోస్టులు వచ్చాయన్న సమాచారం ఉన్నదని చెప్పారు. రిజల్ట్ తర్వాత తాను చెప్పిన పేర్లు ఉండకపోతే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. ఇదేంటని ప్రశ్నిస్తే 'నా ఇష్టం ఉన్నోళ్లకే ఇచ్చుకుంటానని, ఎస్సీలు, బీసీలకేనా? మా ఓసీలకు ఇచ్చుకోవద్దా? ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ తనను బెదిరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ఇయ్యాళ ఇంకెన్ని సీట్లు అమ్ముకునేటోడివో' అంటూ ఆరోపించారు. 'టీఎస్‌పీఎస్సీలో అవినీతి జరిగిందని గతంలో రోడ్లెక్కి ధర్నాలు చేశాం. ఇప్పుడు కాంగ్రెసోళ్లే రేషన్ డీలర్ల సీట్లు అమ్ముకుంటుంటే మనం రోడ్లెక్కుదామా? బీఆర్ఎస్ వాళ్లను ఎక్కుమందామా? వాళ్లకు ఆధారాలు ఇద్దామా?' అని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ఆరోపణలపై ఏం స్పష్టత ఇస్తారో?

కండువా కప్పుకుంటేనే దుకాణం..

'కండువా కప్పుకో.. దుకాణం నీకే ఇస్తా. లేదంటే నీ పోస్టు ఊస్ట్' అని కేకే మహేందర్ రెడ్డి తనను బెదిరించారని బీఆర్ఎస్ కార్యకర్త తాటి వెంకన్న మీడియా ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. మహిళా సంఘాలకు ఇచ్చిన రేషన్ దుకాణం నడుపుకుంటున్న తాను బీఆర్ఎస్ కార్యకర్త కావడం పాపమా? అని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురి రేషన్ దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేసి, వారిస్థానంలో కొత్తవారిని నియమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దుకాణాలు అమ్ముకున్నరు: బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్

రేషన్ దుకాణాల డీలర్‌షిప్‌లను ముందే అమ్ముకుని నామమాత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి వాళ్ల అనుచరులకు ముందే ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూల కథ నడిపిస్తున్నారంటూ విమర్శించారు. ఈ ఇంటర్వ్యూలు రద్దు చేసి మార్కుల జాబితా ప్రకటించిన తర్వాతే మళ్లీ పారదర్శకంగా ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఆర్డీవోను కలిసి డిమాండ్ చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్ 2 లక్షలు ఎప్పుడిస్తరు?

- సర్కారుకు రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్ల సూటి ప్రశ్న
- నెలలు గడుస్తున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రిటైర్మెంట్ బెనిఫిట్ డబ్బులు ఇంకెప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని అంగన్‌వాడీ టీచర్లు ప్రశ్నిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 65 ఏండ్లు నిండిన టీచర్లను రెండు నెలల క్రితం తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం.. టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.1 లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తామని మాట ఇచ్చింది. నాలుగు రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేస్తామని ఆ సందర్భంగా మంత్రి హామీ కూడా ఇచ్చారు. కానీ.. నెలలు గడుస్తున్నా ఎలాంటి జీవో విడుదల కావటం లేదని ప్రభుత్వంపై రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, రెండు నెలలుగా జీతాలు ఇవ్వటం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారుతున్నదని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సంఘం రాష్ట్ర నాయకురాలు నల్లభారతి తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న బెయిల్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు మేకల తిరుపతన్న దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. శనివారం ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ జువ్వాది శ్రీదేవి తీర్పును రిజర్వులో ఉంచుతున్నట్టు ప్రకటించారు. ఈ కేసులో దర్యాప్తు పూర్తయినందున బెయిల్ మంజూరు చేయాలని తిరుపతన్న తరపు న్యాయవాది వీ సురేందర్ రావు కోరారు. వాదిస్తూ, ఎస్ఐబీలో సభ్యుడిగా ఉన్న పిటిషనర్ తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించారని, తప్పు చేయలేదని చెప్పారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వర్‌రావు స్పందిస్తూ, ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశామని, అదనపు అఫిడవిట్ దాఖలు చేస్తామని, బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు.

పీఏసీ చైర్మన్ ఎంపిక ఎలా జరిగింది?

ఎలక్షన్ ద్వారానా? లేక సెలెక్షన్ ద్వారా చేశారా?

- అరికెపూడి గాంధీ నామినేషన్ వేశారా?
- హరీశ్‌రావు వేసిన నామినేషన్ ఏమైంది?
- స్పీకర్‌ను నిలదీసిన బీఆర్ఎస్ సభ్యులు
- స్పందించని స్పీకర్.. మౌనమే సమాధానం
- హాట్ హాట్‌గా పీఏసీ తొలి సమావేశం
- వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ప్రజాపద్దుల కమిటీ తొలి సమావేశం రసాభాసగా మారింది. ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ నియామకంపై బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను నిలదీశారు. చైర్మన్‌ను ఎలక్షన్ ద్వారానా? లేక సెలెక్షన్ ద్వారా ఎంపికా చేశారా అని ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయానికి స్వస్తి చెప్పి ప్రధాన ప్రతిపక్ష నేతను సంప్రదించకుండా చైర్మన్‌ను ఎలా ఎంపిక చేశారని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి అడిగారు. అరికెపూడి గాంధీని ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారని ప్రశ్నించారు. తమకు సమాధానం చెప్పిన తరువాతనే సమావేశాన్ని కొనసాగించాలని పట్టుబట్టారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో శనివారం జరిగిన ఈ సమావేశానికి స్పీకర్‌తోపాటు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ లేచి పీఏసీ చైర్మన్ ఎంపికను ప్రస్తావించారు. తామడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి సమావేశాన్ని కొనసాగించాలని కోరారు. అయితే స్పీకర్ సహా, మంత్రి, మండలి చైర్మన్.. మౌనమే సమాధానం అన్నట్టు వ్యవహరించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు.

లోక్‌సభలో ఇచ్చారు కదా?


అనంతరం మీడియా పాయింట్ వద్ద వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటరీ వ్యవస్థలో పీఏసీ అత్యంత కీలకమైనదని అన్నారు. సభలో ప్రజల గొంతుకగా వ్యవహరించే ప్రతిపక్షానికి పీఏసీ ఇవ్వడం అనవాయితీగా వస్తున్నదని చెప్పారు. ఈ సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఏసీ నియామకంపై అభ్యంతరాలు, అనుమానాలు ఉన్నాయని, దీనిపై వివరణ ఇవ్వాలని స్పీకర్‌ను కోరామని తెలిపారు. అసెంబ్లీ రూల్ 250 ప్రకారం పీఏసీ చైర్మన్‌ను ఎలక్షన్ ద్వారా ఎన్నుకోవాలన్న నిబంధన ఉన్నదని గుర్తుచేశామని చెప్పారు. పీఏసీ చైర్మన్ పదవి కోసం ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పక్షాన తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ముగ్గురు ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఇద్దరు ఎమ్మెల్సీలు ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ పేర్లు ఇచ్చామని తెలిపారు. వారందరూ నామినేషన్ వేశారని చెప్పారు. అరికెపూడి గాంధీ నామినేషన్ వేశారా? హరీశ్‌రావు నామినేషన్ ఎటు పోయింది? అని స్పీకర్‌ను అడిగామన్నారు. గాంధీ నామినేషన్ వేస్తే ఆరుగురు సభ్యులవుతారని, అప్పుడు ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని చెప్పారు. తమ ప్రశ్నలకు స్పీకర్ సమాధానం ఇవ్వలేదని, మౌనంగా ఉండిపోయారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షమైన కాంగ్రెస్ సభ్యులకు పీఏసీ చైర్మన్ పదవిని ఇచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో కూడా ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు.

ఉదయమే పైరవీలు!

మొదటిపేజీ తరువాయి...

పీఏను. ఒక ఫైల్ కాసేపట్లో మీ దగ్గరకు వస్తుంది. చూసి వెంటనే క్లియర్ చేయండి. సర్ దీని గురించి ఫాలోఅప్ చేస్తున్నారు. ఫైల్ మీవద్దకు రాగానే నాకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వండి. మీకు నమ్మకమైన ఆర్డీవోకు ఆ పని అసైన్ చేయండి'. లేదంటే సర్ దగ్గర మాట వస్తుంది. ముందుగా ఆ ఫైల్ పని కంప్లీట్ చేయండి.. అంటూ ఆదేశాలు

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పలు విభాగాల్లోని ఉన్నతాధికారులకు సదరు పీఏ నుంచి ఫోన్లు వస్తున్నాయి.



ప్రస్తుతం ఈ అంశం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారుల నుంచి మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు ఈ అజ్ఞాత వ్యక్తి ఫోన్ కాల్స్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఎలాంటి అధికార హోదాలేని వ్యక్తి.. ఇలా ప్రభుత్వ విభాగాల్లో వేలు పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. నేరుగా ఉన్నతాధికారులకే ఫోన్లు చేసి ఆదేశాలివ్వడంపై విస్తుపోతున్నారు. ఎక్కడో ఉండి నేరుగా ఫోన్లలో ఆదేశాలు ఇవ్వడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఆయన ఆదేశాలు పాటిస్తే తమకు ఎదురయ్యే ఇబ్బందులకు బాధ్యత ఎవరిదంటూ పలువురు అధికారులు ఓ సన్నిహిత ఐఏఎస్ దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. రోజురోజుకూ ఈ ఫోన్ కాల్స్ కారణంగా తమకు శాఖాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పుకున్నట్టు తెలుస్తున్నది.


ముఖ్యనేత అనుచరుడిగా నామినేటెడ్ పోస్ట్ పొంది..

ఈ ఫోన్‌కాల్స్ వ్యవహారంపై ప్రస్తుతం అధికారవర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. ప్రభుత్వంలోని ఓ ముఖ్య నేత అనుచరుడిగా ఉన్న సదరు వ్యక్తికి ఇటీవలే ఓ నామినేటెడ్ పోస్ట్ ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యనేత ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్తుండగా, ఈ వ్యక్తిని కూడా తీసుకెళ్లాలని ప్రయత్నించినట్టు సమాచారం. నిబంధనలు ఒప్పుకోకపోవడంతో వెంటనే నామినేటెడ్ పోస్ట్ ఇచ్చి విదేశీ పర్యటనకు అవకాశం కల్పించినట్టుగా తెలుస్తున్నది. జాతీయ స్థాయి మీడియా వ్యవహారాలు చూసే పోస్టులో ఆయనను నియమించినట్టుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక అప్పటి నుంచి అతడి హవాకు తిరుగులేదని చెప్తున్నారు. కొన్నేండ్ల కిందట రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపిన ఎమ్మెల్యే కొనుగోలు కేసులో నిందితుడిగా ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కూడా సర్ పేరు చెప్పుకుంటూ బెదిరింపులకు దిగడం, తన పనులు చేసి పెట్టాలని ఒత్తిడి తేవడం చేస్తుండడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ విషయంపై ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సన్నిహిత ఉన్నతాధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్నట్టు తెలుస్తున్నది.

ముందుగా ఫైనాన్స్‌శాఖకే ఫోన్లు

ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఫైనాన్స్ శాఖ అధికారులకే సదరు వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్టు సమాచారం. పలువురు కాంట్రాక్టర్ల వద్ద 10 శాతం కమీషన్ తీసుకొని, ఆ శాఖ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి వందల కోట్ల పెండింగ్ బిల్స్ క్లియర్ చేయించినట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత రెవెన్యూ, ఎక్సైజ్, ఐఅండ్ పీఆర్ శాఖల్లో తలదూర్చి ఫైళ్లను క్లియర్ చేయించినట్టు సంబంధిత విభాగాల అధికారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి మొదలుకొని సెక్షన్ ఆఫీసర్ల వరకు ఈ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ అందుకున్నట్టు సమాచారం. ప్రభుత్వంలో కీలక వ్యక్తి పీఏ , పీఆర్వో అని చెప్పుకుంటూ పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండగా, అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. తొలుత చిన్నపనులే అనుకుంటే ఇప్పుడు పెద్దపెద్ద పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తున్నది. సర్ ఆరా తీస్తున్నారంటూ బెదిరించడం ఎక్కువవుతుండడంతో ఆయా విభాగాల సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. నేరుగా ప్రభుత్వంలోని ఓ కీలక కార్యాలయం నుంచి ఫోన్లు చేస్తూ పనులు చేసిపెట్టాలని ఆదేశిస్తుండడంతో, అధికారులంతా హడలెత్తిపోతున్నారు.

రాష్ట్రంలో గట్టి టాక్స్!



మొదటిపేజీ తరువాయి...

కూడా తమ చిన్న చిన్న క్లెయిమ్‌లను తీసుకోవాలంటే పైసలు ముట్టజెప్పనిదే పని కావటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగుల బిల్లుల విషయంలో ఆర్థికశాఖలోని కొందరు ఉద్యోగులే బ్రోకర్లుగా అవతారమెత్తగా, కాంట్రాక్టర్లు, పెద్ద బిల్లుల విషయంలో ప్రభుత్వంలోని పెద్ద తలకాయలే జోక్యం చేసుకొని పర్సంటేజీలు మాట్లాడుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రభుత్వంలోని రకరకాల బిల్లులు ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరటంతో అంతా గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. దీంతో కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. తొలుత కొంతమంది చిన్నాచితక కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేసినా ప్రతిదానికీ ఒక రేటు పెట్టినట్టు భోగట్టా. రూ.కోటి, ఆపైన ఉండే బిల్లులకు కాంట్రాక్టర్లకు ఉండే తొందర, అవసరాన్ని ఉపయోగించుకొని 'గట్టి' టాక్స్ విధిస్తున్నారు. ఇలాంటి బిల్లుల వసూలు సందర్భంగా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆర్థికశాఖలోని ఒక ముఖ్యమైన వ్యక్తే ఆయన కుటుంబ సభ్యులను నేరుగా రంగప్రవేశం చేసి బిల్లులను క్లియర్ చేయిస్తున్నట్టు అధికారులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

ఆమెదే డామినేషన్

ఆర్థికశాఖలో బిల్లుల విషయంలో 'ఆమె' పైనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సారును కాదు.. ఆమెను కలిస్తే తొందరగా పని అవుతుందని పేషీ అధికారులే చెప్తున్నట్టు సమాచారం. రోజువారీగా జరిగే అధికారిక కార్యక్రమాలను పక్కన పెడితే.. బిల్లులకు సంబంధించిన రోజువారీ వ్యవహారాలను మేడంగారే చక్కబెడుతున్నారట. పుత్రరత్నం కూడా వసూళ్లలో ఒక చెయ్యేస్తున్నట్టు తెలిసింది. పార్లమెంటు ఎన్నికల ముందు రోజుకు సగటున కనీసం రూ. వంద కోట్ల బిల్లులు మంజూరు చేయించనిదే మేడంగారు నిద్రపోయేవాళ్లు కాదని చెప్తున్నారు. 'సారు' కూడా ఇంటి నుంచి వచ్చిన ఆ టోకెన్లను అధికారులకు ఇచ్చి పనిచేయించేవారట. పెద్ద మొత్తాల్లో బిల్లులు ఉంటే అందులో కొంత మొత్తాన్ని విడదీసి తొలుత రిలీజ్ చేసేవారు. ఫస్ట్ రిలీజ్ చేసిన సొమ్ము నుంచి కమిషన్ అప్పగిస్తే మరుక్షణమే మిగిలిన సొమ్ము బిల్లులు మంజూరైపోతున్నాయని చెప్పుకుంటున్నారు. ఎంత బిల్లుకు ఎంత పర్సంటేజీ అన్నది కాంట్రాక్టరు అవసరాన్ని బట్టి ఖరారవుతుంది. ముఖ్యుల సిఫార్సుతో వచ్చిన బిల్లుల్లో కూడా ఏడు శాతానికి అదనంగా 1-2 పర్సంటేజీ ఇస్తేకానీ ఫైళ్లు కదలడంలేదని చెప్తున్నారు. ఆర్థికశాఖలో బిల్లులు మంజూరు చేయించటానికి సంబంధించి ఇలా ఏకంగా ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేశారని చెప్తున్నారు.

ఢిల్లీ పేరుతో హల్‌చల్

7 శాతం సొమ్మును హైకమాండ్‌కు చెల్లించాల్సి ఉంటుందంటూ కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. కొంతమంది బడా కాంట్రాక్టర్లను సిండికేట్ చేసి మరీ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ ఏడు శాతాన్ని తామే నేరుగా పంపించుకుంటామని వసూలు చేసినట్టు సమాచారం. 7 శాతం కమీషన్ ఢిల్లీకి పోతుందని, తమకు ఖర్చులకు ఒక శాతం ఇవ్వాలని కూడా వసూళ్లకు పాల్పడ్డారు. మొత్తంగా 8 శాతం చెల్లిస్తేనే బిల్లు మొత్తం విడుదలయ్యేది. లేకపోతే పెండింగే. కొంత మంది పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇటీవల బిల్లులు మంజూరు కోసం వెళ్లగా.. 'అన్నా మీరు కూడా 7 శాతం ఇవ్వాల్సిందే. మీకు కావాలంటే ఇంకేమైనా పని తెచ్చుకోండి చేసి పెడ్తాం' అని చెప్పినట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ జడ్పీటీసీ రూ.పది కోట్ల బిల్లును వసూలు చేసేందుకు కొత్తగా ఎన్నికైన ఒక ఎమ్మెల్యేకు 8 శాతం కమీషన్ ముట్టచెప్పుకున్నట్టు తెలిసింది. ఇదే ప్రాంతం నుంచి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీచేసిన ఓ అభ్యర్థికి సర్దుబాటు చేయాల్సి వచ్చిందని చెప్తూ ఓ కాంట్రాక్టర్‌కు భారీ బిల్లును మంజూరు చేశారు. దీంట్లో రూ.25 కోట్లు అభ్యర్థి ఖర్చు కింద చూపించారట.

గట్టి టాక్స్.. పొట్టి టాక్స్

గట్టి టాక్స్‌ను ఒకరే వసూలు చేస్తే పెద్దాయన ఏమై పోవాలి? అందుకే రాష్ట్రంలోని అతి పెద్ద ఇంజినీరింగ్ కంపెనీకి చెందిన ఆర్థిక వ్యవహారాల ఇన్‌చార్జికే వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఆయన అతి పెద్ద కాంట్రాక్టర్లను ముఠా కట్టించి వసూళ్లు చేసి పెడుతున్నాడు. ఈ వ్యవహారం బడాకాంట్రాక్టర్లకు తలనొప్పిగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించబోయే ఎత్తిపోతల పథకానికి కాంట్రాక్టర్‌ను వీళ్లు ఇప్పటికే సిద్ధం చేశారు. దీంట్లో గట్టి టాక్స్‌తో పాటు పొట్టి టాక్స్‌లు కూడా ఉంటాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులు వస్తాయని, అన్నింట్లోనూ సిండికేట్ చేసే వ్యవహారాలను ఈ బడా కంపెనీతోపాటు రాష్ట్రంలోని మరో మంత్రి కంపెనీకి అప్పగించినట్టు కాంట్రాక్టర్ల వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

మరో రైతు ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబర్ 21: అప్పుల బాధలు భరించలేక రాష్ట్రంలో మరో అన్నదాత తనవు చాలించాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో మన స్తాపం చెంది ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అర్జున్ తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన రైతు హాళావత్ శ్రీనివాస్ (41) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయన వ్యవసాయంతోపాటు కుటుంబ అవసరాలకు రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా ఆందోళన చెందుతున్నాడు. శనివారం తెల్లవారుజామున బయటకెళ్తున్నట్టు భార్య హాళావత్ లక్ష్మీకి చెప్పి బయలుదేరాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య లక్ష్మి చుట్టుపక్కల వాకబు చేసింది. అంతటా వెతకగా ఉదయం 6 గంటల సమయంలో తన ఇంటి వెనకాల పొలంలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు.

32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచారు

బెంగళూరు: బెంగళూరులోని వయలికవల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను దారుణంగా హతమార్చారు. ఏసీపీ సతీశ్ కుమార్ కథనం ప్రకారం... మహాలక్ష్మీ(29) అనే మహిళను తన ఇంట్లోనే హతమార్చి, 32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచిపెట్టారు. దాదాపు 4-5 రోజుల క్రితం ఈ ఘటన జరిగింది. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తుండటం వల్ల ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. ఈ దారుణ హత్యపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గత ఏడాది ఇలాంటి ఘటనే ఢిల్లీలో జరిగింది. శ్రద్ధా వాకర్ అనే యువతిని ఆమె ప్రియుడు దారుణంగా హతమార్చి ముక్కలు చేసిన ఘటన తెలిసిందే.



సాగర్ కాల్వకు మరోచోట గండి

ఆదివారం రాత్రి వరకు నీరందిస్తాం: సీఈ విద్యాసాగర్

కూసుమంచి, సెప్టెంబర్ 21: ఖమ్మం జిల్లా పాలేరు వద్ద సాగర్ కాల్వ యూటీ ప్రాంతంలో శనివారం లీకేజీ కావడంతో నీరంతా దిగువకు వెళ్తున్నది. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే నీటి ప్రవాహాన్ని నిలిపివేసి మళ్లీ పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ ఎడమ కాల్వకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యా తండా వద్ద ఈ నెల ఒకటో తేదీన గండిపడిన విషయం తెలిసిందే. దానికి మరమ్మతులు చేసిన అధికారులు శనివారం నుంచి సాగు నీటిని విడుదల చేయాలని ఏర్పాట్లు చేశారు. అయితే క్రాస్ బండ్‌కు సమీపంలో కాల్వ వద్ద ఉన్న యూటీ పక్కన మరమ్మతులు చేశారు. నీటిని విడుదల చేసేందుకు బండ్‌ను తొలగించడంతో రెండు మీటర్ల మేర ఆగి ఉన్న నీరు యూటీ మధ్య వాల్ నుంచి వెళ్లింది. దీంతో లీకేజీ పెద్దగా మారుతుందని భావించిన అధికారులు వెంటనే మళ్లీ బండ్ వేసి నీటిని నిలిపివేశారు. దీంతో నీటి విడుదలకు మరో రోజు బ్రేక్ పడింది. వెంటనే మరమ్మతుల కోసం మళ్లీ పైపులు తెప్పించి సాయంత్రం పనులు మొదలు పెట్టారు. 1975లో కట్టిన యూటీ వాల్స్ పటిష్టత విషయంలో చర్యలు చేపట్టకపోవడం వల్లే మళ్లీ లీకేజీ అయినట్టు తెలుస్తున్నది. కాగా.. యూటీ వద్ద ఉన్న వాల్ 1975లో కట్టడం వల్ల దాని దగ్గరే సమస్య వచ్చిందని, వెంటనే అప్రమత్తమై అడ్డుకట్టు వేసి నీటిని నిలిపివేశామని, ఆదివారం రాత్రి వరకు మళ్లీ నీటిని ఇస్తామని సీఈ విద్యాసాగర్ తెలిపారు. కాల్వకు బుంగ పడినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టంచేశారు.



సీఎంతో వరల్డ్ బ్యాంక్ బృందం భేటీ

- రాష్ట్ర పథకాలను వివరించిన రేవంత్‌రెడ్డి
- ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): వరల్డ్ బ్యాంకు సౌత్ ఏసియన్ వైస్ చైర్మన్ మార్టిన్ రైజర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసింది. గత నెలలో సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో భాగంగా వరల్డ్ బ్యాంక్ చైర్మన్ అజయ్ బంగాతో భేటీ అయిన నేపథ్యంలో తదుపరి చర్చల కోసం తాజాగా ఆ బృందం సీఎంను కలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారికి వివరించారు. తమ సర్కారు చేపట్టిన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఇందుకు వారు కూడా సానుకూలంగా స్పందించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ముఖ్యమంత్రి ఆఫీసు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జెన్‌కోలో 62 మందికి పదోన్నతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : టీజీ జెన్‌కోలో 62మంది ఉద్యోగులకు సంస్థ యాజమాన్యం పదోన్నతులు కల్పించింది. ఏకకాలంలో పదోన్నతులు కల్పించడం పట్ల విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) హర్షం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా శనివారం ఉద్యోగులు విద్యుత్తు సౌధలో మిఠాయిలు పంచుకుని సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వీఏవోఏటీ ప్రధాన కార్యదర్శి పాపకంటి అంజయ్య మాట్లాడుతూ కోర్టుకేసులతో అనేక ఏండ్లుగా పదోన్నతులు దక్కలేదని, ఆయా సమస్యలను పరిష్కరించి పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పాడి రైతులకు పొగ

ప్రైవేటు డెయిరీలకు వెళ్లేలా కుట్రలు

- మూడు నెలలుగా బిల్లుల చెల్లింపులు బంద్
- విజయ డెయిరీ బకాయిలు 150 కోట్లు
- ప్రభుత్వంపై పాడి రైతుల పోరుబాట
- 26న ధర్నాచౌక్‌లో భారీ ధర్నాకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీకి పాలు పోసే రైతులను ఆ సంస్థకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా..? రైతులను ప్రైవేటు డెయిరీలకు మళ్లించే కుట్ర జరుగుతున్నదా..? ఇందులో భాగంగానే పాల బిల్లులను చెల్లించడం లేదా..? విజయ డెయిరీలో, పాడి రైతుల్లో ఈ చర్చ జోరుగా జరుగుతున్నది. నిప్పులేనిదే పొగరాదన్నట్టుగా ఈ చర్చకు బలం చేకూర్చేలా ప్రభుత్వం, విజయ డెయిరీ వ్యవహారశైలి ఉన్నది. విజయ డెయిరీ కథను ముగించేందుకు కొందరు ప్రభుత్వ పెద్దలు, విజయ డెయిరీ అధికారులు తెరవెనుక భారీ ప్లాన్ వేసినట్టుగా సమాచారం. విజయ డెయిరీ నుంచి పాడి రైతులకు బిల్లుల చెల్లింపును నిలిపివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు మూడు నెలల నుంచి రైతులకు రూ. 150 కోట్ల వరకు బిల్లులు బకాయి ఉన్నట్టుగా తెలిసింది. ఇలా బిల్లులు నిలిపివేస్తే రైతులు విసిగి వేసారి విజయ డెయిరీకి పాలు పోయడం మానేసి ప్రైవేటు డెయిరీకి వెళతారనే దుర్మార్గపు ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది.



హెరిటేజ్ జాతర.. 'విజయ'కు పాతర

ప్రస్తుతం విజయ డెయిరీకి సుమారు 40 వేల మంది రైతులు ప్రతిరోజు 4 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు.

ప్రైవేటు డెయిరీల బలోపేతం!

రాష్ట్రంలో హెరిటేజ్ వంటి ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే సదరు సంస్థ శామీర్‌పేటలో రూ.200 కోట్లకు పైగా పెట్టుబడితో ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐస్‌క్రీం తయారీకి విజయ డెయిరీ దెబ్బ తినడానికి ఏంటి సంబంధం అనే ప్రశ్న తలెత్తే అవకాశం ఉంది. ఇక్కడే అసలు కుట్ర దాగిందని చెబుతున్నారు. ఐస్‌క్రీం తయారీకి పెద్ద మొత్తంలో పాలు అవసరం. హెరిటేజ్ సంస్థకు అంత భారీ స్థాయిలో రాష్ట్రంలో పాల సేకరణ లేదు. ఈ నేపథ్యంలో విజయ డెయిరీ వంటి సంస్థలను అడ్డు తొలిగిస్తే రైతుల నుంచి తక్కువ ధరకే పాలసేకరణ చేయొచ్చనే ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది. దీంతో పాటు మరో సొసైటీ డెయిరీని బలోపేతం చేసే దిశగా కసరత్తు జరుగుతున్నట్టుగా తెలిసింది. ఇందుకు సంబంధించి ఓ కీలక నేత బాధ్యతలు చేపట్టి పని మొదలుపెట్టినట్టుగా తెలిసింది. తద్వారా మళ్లీ వాళ్ల పాత సామ్రాజ్యాన్ని నిర్మించుకునే దిశగా కసరత్తు చేస్తున్నట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే విజయ డెయిరీని క్రమంగా బలహీన పరిచే కుట్రలకు తెరలేపినట్టుగా పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పాల బిల్లుల కోసం పోరుబాట

పాల బిల్లుల కోసం మూడు నెలల పాటు వేచి చూసి ప్రభుత్వాన్ని, అధికారులను చుట్టూ తిరిగి విసిగి వేసారిన పాడి రైతులు ప్రభుత్వంపై పోరుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 26న ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో భారీ ధర్నాకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎక్కడికక్కడ ధర్నాలు చేస్తున్నారు. రోడ్లపై పాలు పారబోసి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అధికారులను, నూతనంగా నియమితులైన చైర్మన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఎవరిని కలిసినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పోరుకు సిద్ధమయ్యారు.


కలెక్టరాఫీసు వద్ద దీక్షలు చేస్తాం



భైంసా ఎస్‌బీఐలో ముద్ర రుణం రూ.10లక్షలు తీసుకుని 16 ఆవులు, 3 బర్రెలు తీసుకొచ్చాను. పల్సిలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో ప్రతి రోజూ 150 నుంచి 180 లీటర్ల పాలు పోస్తాను. ప్రతి నెలా నాకు రూ.30వేల ముద్ర రుణం కిస్తుతో పాటు పశువుల దాణాకు రూ.60వేలు అవసరం. మూడు నెలలుగా డబ్బులు రాక ఇబ్బందులు తలెత్తాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విజయ డెయిరీ మూతవేయక ముందే పాడి రైతులందరం కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరాహార దీక్షలకు వెనుకాడబోం.

-గుడ్డిబాయ్ దత్తాత్రి, పాడిరైతు, సిర్పెల్లి(హెచ్), కుభీర్ మండలం, నిర్మల్ జిల్లా


బిల్లుల కోసం రోడ్డెక్కుతున్నాం



నాలుగేండ్ల నుంచి విజయ డెయిరీకి పాలు పోస్తున్నా. కాంగ్రెస్ సర్కారొచ్చాక బిల్లుల కోసం రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేయాల్సి వస్తున్నది. వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకొస్తున్నాం. దాణా, మినరల్ మిక్చర్, వైద్య ఖర్చులకు డబ్బులు లేక వ్యాపారం నిర్వహణకు అవస్థలు పడాల్సి వస్తోంది. బిల్లులు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా ఫలితం లేదు.

- ఎం.బాలరాజు, రైతు, పోమాల, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ జిల్లా


రూ.60 లక్షల బిల్లులు ఇవ్వాలి



ప్రభుత్వం పాల ఉత్పత్తిదారులకు ఇప్పటివరకు రూ. 60 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉంది. నర్సంపేట విజయ డెయిరీ పరిధిలోని రెండు వేల మంది రైతులకు మూడు నెలలుగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. బోనస్ బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతులు పశువులకు దాణా, పచ్చిగడ్డి కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పాడి రైతులకు సరైన సమాధానం చెప్పలేక పోతున్నాం.


- బండి రాజ్‌కుమార్, ఇన్‌చార్జి మేనేజర్, విజయ డెయిరీ, నర్సంపేట, వరంగల్ జిల్లా

నిరసనలు చేసినా ఫలితం లేదు



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నంక బిల్లుల కోసం కండ్లలో వత్తులేసుకొని ఎదురుచూడాల్సి వస్తోంది. గత 75రోజులుగా ఐదు బిల్లులు చెల్లించలేదు. దీంతో పశు పోషణ భారంగా మారింది. పాల బిల్లు కోసం అనేకమార్లు నిరసనలు చేశాం. ఎండీని కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వంలో చలనం రాలేదు. బిల్లులు చెల్లించి విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలి.

- ఇమ్మడి శ్రీను, పాడి రైతు, లాలాపురం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా



రూ. 25 లక్షలు రావాలి..

కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చాక జూలై 16వ తేదీ వరకు బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత నుంచి బిల్లుల ఊసెత్తం లేదు. మా గ్రామ సంఘంలోని 150 మంది రైతుల నుంచి ప్రతిరోజు సేకరించిన 900 లీటర్ల పాలు జహీరాబాద్‌లోని విజయ డెయిరీ కేంద్రానికి వెళ్తాయి. మా సంఘానికి పాల బిల్లులు రూ. 25 లక్షల వరకు రావాల్సి ఉంది.

- బరూర్ మాణిక్‌రెడ్డి, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, మామిడ్గి గ్రామం, సంగారెడ్డి జిల్లా


నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గోపలాపురం వద్ద డీ-37 కాల్వలోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి రైతుల నిరసన

డీ-37 కాల్వకు నీరందడంలేదని రైతుల ఆందోళన

మాడ్గులపల్లి, సెప్టెంబర్ 21: డీ-37 కాల్వ చివరి భూముల సాగునీరందడం లేదని ఆరోపిస్తూ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, కన్నెకల్, మాచినపల్లి, కేశవాపురం గ్రామాల రైతులు శనివారం కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. డీ-37 కాల్వ నిర్మాణం కోసం అనేక మంది రైతులు తమ భూములను త్యాగం చేశారని, కాల్వ తవ్విన తర్వాత చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాడ్గులపల్లి మండలంలో డీ-37 కాల్వ 27 కిలోమీటర్ల మేర ఉండగా దీని ద్వారా 42 వేల ఎకరాలకు సాగునీరందించాలని, 19 చెరువులను నింపాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్దేశించిందని పేర్కొన్నారు. కానీ.. ప్రస్తుతం కాల్వ ద్వారా విడుదలవుతున్న కొద్దిపాటి నీటిని మొదట ఉన్న రైతులకే సరిపోతున్నాయని, చివరి భూములకు నీరందక సాగు చేసిన పంటలు, తోటలు ఎండిపోయే స్థితికి చేరాయని పేర్కొన్నారు. నీటి విడుదలను పెంచి చివరి రైతులను ఆదుకోవాలని కోరారు.

- కుప్పకూలిన కుమ్మరికుంట కెనాల్ వంతెన


పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంటలో ఎస్సారెస్పీ కెనాల్‌పై వంతెన కుప్పకూలింది. డీ-83 ప్రధాన కాల్వపై రైతులు రాకపోకలు కొనసాగించడానికి ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితం ఈ వంతెనను నిర్మించింది. ఇటీవల కురిసిన వర్షాలతో వంతెన దెబ్బతిని శుక్రవారం రాత్రి నేలమట్టమైంది. అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన నూతన వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. -జూలపల్లి

ఢిల్లీ కొత్త సీఎంగా ఆతిశీ ప్రమాణం

క్యాబినెట్‌లో అయిదుగురికి స్థానం



న్యూఢిల్లీ: ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా ఆతిశీ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమెతోపాటు ఆప్ నేతలు గోపాల్‌రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్, అహ్లావత్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆతిశీ ఢిల్లీకి ఎనిమిదో ముఖ్యమంత్రి కాగా, అత్యంత పిన్న వయస్కురాలైన సీఎంగా ఆమె రికార్డులకెక్కారు. అలాగే, ఢిల్లీ పీఠాన్ని అధిష్టించిన మూడో మహిళగానూ మరో ఘనత సాధించారు. ప్రమాణ స్వీకారానికి ముందు ఆతిశీ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించడంతో ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆతిశీ 5 నెలలు మాత్రమే ఢిల్లీ సీఎంగా ఉండనున్నారు.

కేజ్రీవాల్‌ను తిరిగి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలి

ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చేసిన తొలి ప్రసంగంలో ఆతిశీ తన మెంటార్, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఇప్పుడు మన ముందున్న ఏకైక కార్యం కేజ్రీవాల్‌ను తిరిగి అధికారంలోకి తేవడమేనని అన్నారు. 'ఈ రోజు ముఖ్యమంత్రిగా నేను ప్రమాణ స్వీకారం చేశా. అయితే సీఎంగా కేజ్రీవాల్ లేకపోవడం మా అందరినీ ఉద్విగ్న పరిచింది. మేమందరం ప్రస్తుతం చేయాల్సిన ఏకైక పని కేజ్రీవాల్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే' అని ఆతిశీ అన్నారు.

8 హైకోర్టులకు కొత్త సీజేలు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం దేశంలోని 8 హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఎక్స్ వేదికగా ఈ వివరాలను తెలిపారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ మన్మోహన్‌ను నియమించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్‌ను హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమించారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సురేశ్ కుమార్ కెయిత్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా పదోన్నతి లభించింది. కలకత్తా హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న ముఖర్జీ మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కేరళ హైకోర్టు సీజేగా జస్టిస్ నితిన్ మధుకర్ జామ్‌దార్‌ను, జస్టిస్ తషి రబ్‌స్టన్‌ను జమ్ము కశ్మీర్, లడఖ్ హైకోర్టు సీజేగా నియమించారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీరామ్ కల్పతి రాజేంద్రన్‌కు మద్రాస్ హైకోర్టు సీజేగా పదోన్నతి లభించింది. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావును జార్ఖండ్ హైకోర్టు సీజేగా బదిలీ చేశారు.

భిన్నాభిప్రాయాలను సహించడమే పెద్ద పరీక్ష

- మేధావులు నిర్భయంగా అభిప్రాయాలు చెప్పాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: భిన్నాభిప్రాయాలను సహించడమే ప్రజాస్వామ్యంలో అతి పెద్ద పరీక్ష అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. పాలకుడు తనకు వ్యతిరేకంగా ఉన్న బలమైన అభిప్రాయాన్ని కూడా సహించగలడని, అది ఆత్మ పరిశీలనకు కూడా దారి తీస్తుందని ఆయన అన్నారు. పుణెలోని ఎంఐటీ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు, మేధావులు నిర్భీతిగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని కోరారు. మన దేశంలో అభిప్రాయ భేదాల సమస్య లేదు కాని, అభిప్రాయ లోపం సమస్య ఉందని అన్నారు. మనం లెఫ్టిస్టులమో, రైటిస్టులమో కాదని, అవకాశవాదులమని, అందుకే రచయితలు, మేధావుల నుంచి ఎలాంటి భయం లేకుండా అభిప్రాయాలను ఆశిస్తున్నామని అన్నారు. ఎప్పుడైతే సమాజంలో అస్పృశ్యత, సాంఘిక న్యూనత, ఆధిక్యత భావనలు కొనసాగుతాయో అప్పుడు దేశ నిర్మాణం పూర్తవుతుందని చెప్పలేమని అన్నారు.

మీ వాటర్ ప్యూరిఫైర్ మంచిదేనా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): నల్లా నీటి కంటే ప్యూరిఫైర్ నీరు ఆరోగ్యానికి మంచిదని మనం తాగుతూ ఉంటాం. ఆర్వో, యూవీ, ఆల్కలైన్ తదితర వెరైటీల పేరిట మార్కెట్లో ఎన్నో ప్యూరిఫైర్లు లభిస్తున్నాయి. అయితే, ప్యూరిఫైర్లు నీటిని శుద్ధిచేసే క్రమంలో శరీరానికి అత్యవసరమైన మెగ్నీషియం వంటి ఖనిజాలను కూడా వడపోస్తున్నట్టు ఇజ్రాయెల్ పరిశోధకుల తాజా అధ్యయనంలో తేలింది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం.. ప్రతీ లీటర్ నీటిలో 40 నుంచి 81 మిల్లీగ్రాముల మెగ్నీషియం అనేది కచ్చితంగా ఉండాలి. అయితే, మార్కెట్లో లభిస్తున్న చాలా ప్యూరిఫైర్ల నీటిలో అసలు మెగ్నీషియం కనిపించట్లేదని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ వివరాలు 'నేచర్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి. శరీరానికి తగినంత మెగ్నీషియం అందకుంటే నాడీ సంబంధిత వ్యాధులతో పాటు మెదడుకు రక్త ప్రవాహంలో సమస్యలు, టైప్-2 డయాబెటిస్, డిమెన్షియా వచ్చే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు. మెగ్నీషియం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడంతో పాటు మెగ్నీషియం ఖనిజాన్ని వడబోయని ప్యూరిఫైర్‌ను చూసి కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచించారు.

హెచ్ఐవీకి టీకా వచ్చేసింది!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా ఏటా పది లక్షల మంది హెచ్ఐవీ మహమ్మారి బారినపడుతున్నారు. వేలాదిమంది మరణిస్తున్నారు. రోగ నిరోధక శక్తికి దొరకకుండా హెచ్ఐవీ వైరస్ తరచూ మ్యుటేషన్‌కు లోనవుతుండటంతో ఈ వ్యాధిని నయం చేయడం కుదరట్లేదు. శక్తిమంతమైన ఔషధాలు, ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఏడు వ్యాక్సిన్ డోసులతో ప్రభావం కూడా అంతంత మాత్రంగానే ఉన్నది. దీంతో అమెరికాలోని ఎంఐటీ పరిశోధకులు హెచ్ఐవీ నియంత్రణకు ఓ టీకాను అభివృద్ధి చేశారు.

వారం వ్యవధిలో రెండు డోసులు

హెచ్ఐవీ నియంత్రణ కోసం ఈ టీకాను వారం వ్యవధిలో రెండు మోతాదులుగా ఇస్తారు. తొలి డోసులో 20 శాతం వ్యాక్సిన్‌ను, రెండో డోసులో 80 శాతం వ్యాక్సిన్‌ను రోగికి వేస్తారు. స్వల్ప వ్యవధిలో ఇచ్చే ఈ రెండు డోసులతో వైరస్ మ్యుటేషన్ జరిగేలోగా టీకా తన పనిని చేస్తుందని, రోగ నిరోధక వ్యవస్థను కూడా ఉత్తేజితం చేస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్టు వెల్లడించారు. 'ఇంట్రెస్టింగ్ ఇంజినీరింగ్' ఈ వివరాలను వెల్లడించింది.

మంత్రిగా డీకే విఫలం

- 15 రోజుల్లో గుంతలు పూడ్చుతానన్నారు
- హామీని మరచి అమెరికాలో చక్కర్లా?
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ ఫైర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఓ మంత్రిగా ఫెయిల్ అయ్యారని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ పాయ్ తీవ్రంగా మండిపడ్డారు. బెంగళూరు రోడ్లమీద ఉన్న గుంతలను 15 రోజుల్లోగా పూడ్చుతానంటూ వాగ్దానం చేసిన డీకే.. హాలీడే పేరిట అమెరికాలో షికారు చేస్తున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

ఇక నమ్మడం ఎలా?

ఇటీవలి వర్షాలతో బెంగళూరు రోడ్లన్నీ గుంతలమయమైనట్లు వచ్చిన ఫిర్యాదులపై డీకే ఈ నెల 1న స్పందించారు. 15 రోజుల్లోగా గుంతలన్నింటినీ పూడ్చేయాలని బీబీఎంపీ అధికారులను ఆదేశించారు. పనులు జరగకపోతే కఠిన చర్యలు తీసుకొంటానని హెచ్చరించారు. కానీ పరిస్థితి యథాతథంగా కొనసాగుతుండటంతో వాహనదారుల అవస్థలను బీజేపీ ఎంపీ పీసీ మోహన్ బుధవారం ఎక్స్ వేదికగా వివరించారు.

హెచ్ఐవీ మహిళతో హనీట్రాప్

- కర్ణాటకలోని ప్రత్యర్థి పార్టీ నేతలే లక్ష్యం
- బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నే సూత్రధారి
- రేప్ కేసు బాధితురాలి సంచలన ఆరోపణలు
- మళ్లీ అరెస్టైన మునిరత్న.. 14 రోజుల కస్టడీ
- విచారణకు సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తనపై బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న లైంగిక దాడి చేశారంటూ సంచలన ఆరోపణలు చేసిన మహిళ (40) ఇప్పుడు ఇదే కేసులో మరిన్ని కీలక విషయాలను బయటపెట్టారు. ప్రత్యర్థి పార్టీ నేతలను హనీట్రాప్ చేయడానికి మునిరత్న హెచ్ఐవీ సోకిన ఓ మహిళను వాడుకొన్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయాన్ని మునిరత్నే తనతో స్వయంగా వెల్లడించినట్టు ఆమె చెప్పారు. 'నా ప్రత్యర్థి పార్టీలోని ఓ నేతను బుట్టలోకి దించడానికి హెచ్ఐవీ సోకిన మహిళను హనీట్రాప్ కోసం వాడుకొన్నా. ఇంకో నేతను కూడా ఇలాగే ముగ్గులోకి దించడానికి మరో హెచ్ఐవీ సోకిన మహిళ నాకు కావాలి. సాయం చేస్తావా?' అంటూ మునిరత్న తనను అడిగినట్టు సదరు మహిళ ఆరోపించారు. ఈ మేరకు తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని, అయితే కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించినట్టు బాధితురాలు పేర్కొన్నారు.

విచారణకు సిట్ ఏర్పాటు

మునిరత్నపై నమోదైన కేసుల విచారణకు కర్ణాటక ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. అడిషనల్ డీజీపీ(సీఐడీ) బీకే సింగ్ నేతృత్వంలో ఐపీఎస్ అధికారులు లభురామ్, సౌమ్యలత, సీపసైమన్‌తో సిట్‌ను నియమించింది. కాగా, వారం వ్యవధిలో మునిరత్నపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఓ మహిళపై లైంగిక దాడి, ఓ కాంట్రాక్టర్‌ను కులం పేరిట



దూషించిన ఆరోపణలతో ఇప్పటికే రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. తాజాగా రేప్ కేసులో మూడో ఎఫ్ఐఆర్ నమోదైంది. దళితులపై దుర్భాషలాడిన కేసులో బెయిల్‌పై బయటకొచ్చిన మునిరత్నను.. ఈ రేప్ కేసులో పోలీసులు మళ్లీ అరెస్టు చేశారు. ఆయన్ని 14 రోజుల పోలీసు కస్టడీకి అప్పగిస్తూ శనివారం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

బీజేపీలో అంతర్మథనం

మునిరత్నపై వస్తున్న వరుస ఆరోపణలపై రాష్ట్ర బీజేపీ నేతలు ఆచితూచి మాట్లాడుతున్నారు. ఈ విషయంపై కేంద్ర నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్తున్నారు. 'మునిరత్నపై ఏ నిర్ణయాన్నైనా కేంద్ర నాయకత్వమే తీసుకోవాలి' అని కర్ణాటక బీజేపీ క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ లింగరాజ్ పాటిల్ అన్నారు.

ఎన్ఐటీ పాట్నాలో ఏపీ విద్యార్థిని ఆత్మహత్య

పాట్నా: బీహార్‌లోని ఎన్ఐటీ పాట్నాలో బీటెక్ చదువుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. క్యాంపస్‌లోని హాస్టల్ గదిలో శుక్రవారం రాత్రి ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నది. ఘటనా స్థలిలో పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని ఆత్మహత్య సమాచారాన్ని బంధువులకు తెలియజేశారు. అయితే బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యపై క్యాంపస్‌లోని విద్యార్థులంతా ఆందోళన నిర్వహించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వాయుసేన చీఫ్‌గా అమర్ ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ: వాయుసేనలో అపార అనుభవం, వ్యూహకర్తగా గుర్తింపు అందుకున్న ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్‌సింగ్ భారత వాయుసేన తదుపరి చీఫ్‌గా నియమితులయ్యారు. వాయుసేన ప్రస్తుత అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఈ నెల 30న పదవీ విరమణ చేయబోతున్నారు. ఈ మేరకు శనివారం రక్షణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అమర్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్' వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా ఉన్నారు. 1964 అక్టోబర్ 27న జన్మించిన ఆయన భారత వాయుసేనలో యుద్ధ విమానాల పైలట్‌గా 1984లో కెరీర్ ఆరంభించారు. గత 40ఏండ్లుగా వివిధ హోదాల్లో పని చేస్తున్నారు.

ఎన్పీఏ డైరెక్టర్‌గా అమిత్ గార్గ్

ఎన్సీఆర్బీ డైరెక్టర్‌గా అలోక్ రంజన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ(ఎన్పీఏ) డైరెక్టర్‌గా అమిత్ గార్గ్ నియమితులయ్యారు. ఆయన 1993 బ్యాచ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) డైరెక్టర్‌గా మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అలోక్ రంజన్ నియమితులయ్యారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక డైరెక్టర్లుగా రిత్విక్ రుద్ర, మహేశ్ దీక్షిత్, ప్రవీణ్ కుమార్, అర్వింద్ కుమార్, సీఐఎస్ఎఫ్ స్పెషల్ డీజీగా ప్రవీర్ రంజన్, సీఆర్పీఎఫ్ స్పెషల్ డీజీగా వితుల్ కుమార్, బీఎస్ఎఫ్ స్పెషల్ డీజీగా ఆర్ ప్రసాద్ మీనాను కేంద్రం నియమించింది.

పూరీ రత్న భండార్‌లో రెండో విడత సర్వే

పూరి: ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని మరోసారి తెరిచారు. ఇందులో రెండో విడత సర్వేను భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) శనివారం ప్రారంభించింది. రత్న భాండాగారంలోని నిధి నిక్షేపాల వెలికితీత, సంపద అన్వేషణకు ఉద్దేశించిన ఈ సర్వే వల్ల మూడు రోజుల పాటు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తోబుట్టువుల దేవతల దర్శనాన్ని భక్తులకు నిషేధించారు. అలాగే ఈ సర్వే సమయంలో ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేస్తారు. ఆలయ రత్న భాండాగారంలో ఏదైనా రహస్య చాంబర్ లేదా సొరంగం ఉన్నదా? అన్న అంశాన్ని ఈ సర్వేలో పరిశీలిస్తారు.

మణిపూర్‌లోకి 900 మంది కుకీ మిలిటెంట్లు!

2 చోట్ల ఆయుధాలు స్వాధీనం

న్యూఢిల్లీ: మయన్మార్ నుంచి దాదాపు 900 మంది కుకీ మిలిటెంట్లు మణిపూర్‌లోకి చొరబడబోతున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించినట్లు మణిపూర్ భద్రతా సలహాదారు కుల్‌దీప్ సింగ్ తెలిపారు. చురచాంద్‌పూర్, తౌబల్‌లో జరిపిన దాడుల్లో సాధారణ ఆయుధాలతో పాటు, పిస్తోళ్లు, రైఫిల్ వంటి ఆయుధాలతో పాటు యుద్ధరంగంలో వినియోగించే రాకెట్లు, మోర్టార్ బాంబులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాగా, మయన్మార్‌లోని చిన్ తెగవారితో మణిపూర్‌లోని కుకీ తెగ వారికి సంబంధాలు ఉన్నాయి. కుకీ మిలిటెంట్లు డ్రోన్ దాడులకు పాల్పడినట్లు అధికారులు ఆరోపించారు.

ఔషధాల కొనుగోళ్లలోనూ అక్రమాలు

వెలుగులోకి సందీప్ ఘోష్ అక్రమాలు

కోల్‌కతా: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన జరిగిన ఆర్జీ కర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రోగులకు అందించే ఔషధాల కొనుగోళ్లలో సందీప్ ఘోష్ అవకతవకతకు పాల్పడ్డాడని సీబీఐ ఆరోపించింది. సరఫరా చేసే సంస్థల సాంకేతికత మూల్యాంకనం చేయకుండానే టెండర్లు ఖరారు చేశాడని పేర్కొన్నది.

పాక్షికంగా విధుల్లో చేరిన జూడాలు

జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా 42 రోజుల పాటు విధులు బహిష్కరించి ఆందోళన చేసిన పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు శనివారం పాక్షికంగా విధుల్లో చేరారు. ప్రభుత్వ దవాఖానల్లో ఔట్ పేషెంట్ విభాగాలు మినహా మిగతా సేవలకు హాజరయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలకు సైతం హాజరవుతున్నామని వారు ప్రకటించారు. కాగా, తమ డిమాండ్లను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి మరో వారం పాటు వేచి చూస్తామని తెలిపారు.

రక్తదానం చేయకున్నా చేసినట్టు పోజు

మొరాదాబాద్ మేయర్‌పై విమర్శలు

మొరాదాబాద్: ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17న నిర్వహించిన రక్తదాన శిబిరం అభాసుపాలైంది. మొరాదాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆ పార్టీ సీనియర్ నేత, స్థానిక మేయర్ వినోద్ అగర్వాల్ రక్తదానం చేయకపోయినప్పటికీ చేసినట్టుగా కెమెరా ముందు నటించి అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆయన రక్తపోటును పరిశీలించేందుకు ఓ ఆరోగ్య సంరక్షణ కార్యకర్త సిద్ధమవడంతో ఆ ప్రక్రియను కొనసాగించవద్దని ఆయన వైద్యుడిని కోరారు. ఆ తర్వాత ఆ వైద్యుడు సూదిని బయటకు తీయగానే అగర్వాల్ మంచం దిగి ఆ గది నుంచి వెళ్లిపోయారు. కెమెరా కోసం నకిలీ రక్తదానం చేశారంటూ పలువురు ఆయనపై విమర్శలు గుప్పించారు.

పరీక్షల్లో అక్రమాల భయంతో మొబైల్ ఇంటర్నెట్ బంద్

జార్ఖండ్ ప్రభుత్వం నిర్ణయం



రాంచి, సెప్టెంబర్ 21: శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు పుకార్లు వ్యాపించకుండా మొబైల్ ఇంటర్నెట్‌ను బంద్ చేయడం గురించి చాలాసార్లు విన్నాం. కానీ, జార్ఖండ్ ప్రభుత్వం మాత్రం పరీక్షల్లో అక్రమాల భయంతో మొబైల్ ఇంటర్నెట్‌ను ఆపేయాలని నిర్ణయించింది. పరీక్షల కోసం ఇలాంటి ముందు జాగ్రత్త చర్య తీసుకోవడం బహుశా దేశంలో ఇదే మొదటిసారి. జార్ఖండ్ జనరల్ గ్రాడ్యుయేట్ లెవెల్ కంబైన్డ్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్(జేజీజీఎల్‌సీసీఈ) పరీక్షలు శనివారం, ఆదివారాల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పరీక్ష జరిగే రెండు రోజులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, టెలిగ్రామ్, ట్విట్టర్ వంటి మొబైల్ యాప్‌లను ఉపయోగించి గతంలో కొందరు అక్రమాలకు పాల్పడ్డట్టు గుర్తించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కోర్ట్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

భూగర్భంలోకి చొచ్చుకెళ్లి 'లక్ష్యం' పూర్తి

నిఘా సమాచారంతోనే హెజ్బొల్లా కమాండర్ హతం

బీరుట్‌పై దాడి ఘటనలో 37కి చేరిన మృతుల సంఖ్య



దాడి జరిగిన ప్రాంతం, అకీల్

జెరూసలేం: ఇజ్రాయెల్ సైన్యాధ్యక్షుడు హెర్జి హలేవీ ప్రస్తుతం ఉత్తర ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఇంతలో ఆయనకు నిఘా వర్గాల నుంచి ఓ సమాచారం వచ్చింది. ఇది 'వదులుకోరాని అవకాశం' అని, తక్షణమే దాడి చేయాలని హెర్జి ఆదేశించారు. అంతే.. వెంటనే ఇజ్రాయెల్ దళాలు బీరుట్‌లోని దహియాహ్ నైబర్‌హుడ్‌లో 8 అంతస్థుల నివాస భవనం పార్కింగ్ స్థలంపై పైకి నాలుగు క్షిపణులను కురిపించాయి. దీంతో భూగర్భంలో 20 మంది కమాండర్లతో సమావేశమైన హెజ్బొల్లా అగ్రస్థాయి ఉగ్రవాది ఇబ్రహీం అకీల్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. ఇంతకీ ఈ నిఘా సమాచారం ఏమిటంటే, అకీల్‌తోపాటు హెజ్బొల్లాకు చెందిన టాప్ రద్వాన్ దళాల ఉగ్రవాదులు సమావేశమయ్యారని, వీరు ఇజ్రాయెల్‌లోని గలీలీ ప్రాంతంపై దాడి చేయడం కోసం చర్చిస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్పాయి. ఇజ్రాయెల్ తక్షణమే స్పందించి కురిపించిన క్షిపణులు మొదటి భవనాన్ని నేలమట్టం చేసి, రెండో భవనాన్ని చీల్చుకుంటూ భూగర్భంలోకి చొచ్చుకెళ్లి 'లక్ష్యాన్ని' పూర్తి చేశాయి. ఈ దాడిలో అకీల్ సహా 37 మంది మరణించినట్లు, వీరిలో ఏడుగురు మహిళలు, ముగ్గురు బాలలు ఉన్నట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. ఈ ఘటనలో 68 మంది గాయపడగా, 15 మంది దవాఖానలో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఉగ్రవాదులు తమకు రక్షణ కవచంగా సామాన్యులను ఉపయోగించుకుంటున్నారని ఇజ్రాయెల్ సైనిక అధికార ప్రతినిధి ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు.

టాప్ కమాండర్లను మట్టుబెట్టాం: ఐడీఎఫ్

హెజ్బొల్లాకు చెందిన రద్వాన్ ఫోర్స్ టాప్ కమాండర్లలో ఇద్దర్ని శుక్రవారం మట్టుబెట్టామని ఇజ్రాయెల్ దళాలు శనివారం ధ్రువీకరించాయి. హెజ్బొల్లా క్షేత్ర స్థాయి సైనిక కార్యకలాపాలను రద్వాన్ ఫోర్స్ నిర్వహిస్తుందని చెప్పింది. ఈ దళంలోని అకీల్ టాప్ కమాండర్లలో రెండోవాడని తెలిపింది. ఇతనితోపాటు మరో సీనియర్ కమాండర్‌ను, 14 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు వివరించింది.

గ్రీన్‌కార్డుల కాల పరిమితి పొడిగింపు

36 నెలలకు పెంచిన అమెరికా



న్యూయార్క్, సెప్టెంబర్ 21: గ్రీన్ కార్డులు లేదా పర్మినెంట్ రెసిడెంట్ కార్డులు ఉండి వాటి రెన్యువల్ కోసం ఎదురుచూస్తున్న పౌరులు, వలసదారులకు అమెరికా శుభవార్త చెప్పింది. వారి పర్మినెంట్ రెసిడెంట్ కార్డుల చెల్లుబాటు కాలాన్ని మరింత పొడిగిస్తున్నట్టు ప్రకటించింది. గతంలో ఈ కార్డుల కాల పరిమితి ముగిసిన తర్వాత మరో 24 నెలలు పొడిగించేవారు. ఇప్పుడు దానిని 36 నెలలకు పెంచారు. సాధారణంగా గ్రీన్‌కార్డు దారులు ప్రతీ ఐదేళ్లకోసారి వాటిని రెన్యువల్ చేసుకోవాలి. దానికోసం వారు ఐ-90 ఫామ్‌ను సమర్పించాలి. చట్టబద్ధమైన శాశ్వత నివాసితులై ఫామ్ ఐ-90ని సమర్పించిన వారి శాశ్వత నివాసి కార్డులు లేదా గ్రీన్ కార్డు చెల్లుబాటును 36 నెలల పాటు పొడిగిస్తున్నట్టు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ప్రకటించింది. దీంతో రెన్యువల్ కోసం వేచి చూస్తున్న వారికి ఇది ఎంతో ఉపశమనం కలిగించింది. ఈ నిర్ణయం ఈ ఏడాది సెప్టెంబర్ 10 నుంచి అమలులోకి వస్తున్నట్టు తెలిపింది. గ్రీన్ కార్డు గడువు ముగిసిన వారికి, పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గడువు ముగిసిన గ్రీన్ కార్డుల రెన్యువల్‌కు ఏడు నుంచి 12 నెలల సమయం పడుతుంది. దాంతో అది వచ్చేవరకు పౌరులకు టెన్షన్ తప్పేది కాదు. ఈ ఎదురుచూపులకు అడ్డుకట్ట వేయడానికే గడువును 36 నెలలు పొడిగిస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. గ్రీన్‌కార్డు దారులు అమెరికాలో ఎక్కడైనా ప్రయాణించడానికి అర్హులు. దేశం వెలుపల ఏడాది గడిస్తే వారి గ్రీన్ కార్డు గడువు ముగుస్తుంది. దాని పునరుద్ధరణ కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్త విధానం ప్రకారం గ్రీన్ కార్డు పొడిగింపునకు అందుకున్న నోటీసుతో పాటు, గడువు ముగిసిన గ్రీన్ కార్డును రుజువుగా చూపెడుతూ వారు తామున్న చోట కొనసాగవచ్చు.

విద్యావంతులైన వలసదారుల్లో మనోళ్లే టాప్

అమెరికాలో విద్యావంతులైన వలసదారుల్లో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నట్టు మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్(ఎంపీఐ) అనే సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. 2022 నాటికి అమెరికాలో 1.40 కోట్ల మంది వలసదారులైన విద్యావంతులు ఉన్నారు. వీరిలో భారతీయులు 14 శాతం ఉన్నారని, ఆ తర్వాత చైనీయులు 7.9 శాతం, ఫిలిప్పిన్స్‌కు చెందిన వారు 6.9 శాతం ఉన్నారని ఎంపీఐ తెలిపింది. హెచ్-1బీ పొందుతున్న వారిలోనూ భారతీయుల సంఖ్య గణనీయంగా ఉందని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆమోదించిన పిటిషన్లలో భారతీయులవే 72 శాతం ఉన్నట్టు తెలిపింది.

స్పామ్ మెసేజ్‌లకు చెక్

వాట్సాప్‌లో త్వరలో కొత్త ఫీచర్

గురుగ్రామ్, సెప్టెంబర్ 21: చికాకు పెట్టించే స్పామ్ మెసేజ్‌లకు చెక్ పెట్టే కొత్త ఫీచర్‌ను వాట్సాప్ త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నది. 'బ్లాక్ అన్‌నోన్ అకౌంట్ మెసేజెస్' అనే ఈ ఫీచర్ ద్వారా అన్‌నోన్(తెలియని నెంబర్లు) అకౌంట్ల నుంచి మెసేజ్‌లు రాకుండా బ్లాక్ చేయవచ్చు. ఈ ఫీచర్‌ను ఉపయోగించి గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే స్పామ్ మెసేజ్‌లకు అడ్డకట్ట వేయొచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ పలువురు బెటా టెస్టర్లకు వాట్సాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలోనే వినియోగదారులు అందరికీ ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నది. వాట్సాప్ అకౌంట్‌కు ఈ ఫీచర్ రక్షణగా ఉంటుందని, డివైజ్ పనితీరును మెరుగుపరుస్తుందని వాట్సాప్ తెలిపింది.



తిరుమల లడ్డూ కల్తీని తీవ్రంగా పరిగణిస్తున్నాం

తార్కిక ముగింపు ఇస్తామన్న మంత్రి ప్రహ్లాద్ జోషి

హుబ్బళి: కల్తీ కారణంగా తిరుమల శ్రీవారి లడ్డూ అపవిత్రం అయ్యిందని వస్తున్న ఆరోపణలపై కేంద్రం స్పందించింది. లడ్డూ కల్తీ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనికొక తార్కిక ముగింపును ఇస్తామని కేంద్ర ఆహార, వినియోగదారుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. హుబ్బళిలో శనివారం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌కు చెందిన నందిని నెయ్యి వాడకాన్ని నిలిపివేసిన అనంతరం టీటీడీపై ఆరోపణలు వచ్చాయని తెలిపారు. నెయ్యి కల్తీపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందన్నారు.

అయోధ్యలో తిరుపతి లడ్డూలే పంచాం

ఈ ఏడాది జనవరిలో అయోధ్య దేవాలయ ప్రతిష్ఠ ఉత్సవంలో భక్తులకు తిరుపతి లడ్డూలనే ప్రసాదంగా పంపిణీ చేసినట్టు ఆ ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ తెలిపారు. మరోవైపు కల్తీ నెయ్యికి సంబంధించిన వివాదంలో తమ కంపెనీని లాగడం పట్ల గుజరాత్‌కు చెందిన అమూల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లడ్డూ తయారీలో తాము సరఫరా చేసిన నెయ్యిని వాడినట్టు ప్రచారం జరగడాన్ని ఖండిస్తూ దీనిపై చర్య తీసుకోవాలంటూ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైనాలో మాజీ మహిళా గవర్నర్‌కు 13 ఏండ్ల జైలు శిక్ష

సిబ్బందితో లైంగిక సంబంధాలు, లంచాలే కారణం

బీజింగ్, సెప్టెంబర్ 21: నైరుతి చైనా 'గిజో' ప్రావిన్స్‌లో అత్యున్నత స్థాయి అధికారిణి, 'బ్యూటిఫుల్ గవర్నర్'గా పేరొందిన 52 ఏండ్ల జాంగ్ యాంగ్‌కు 13 ఏండ్ల జైలు శిక్ష విధించారు. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా కథనం ప్రకారం, తన కింద పనిచేసే 58 మంది సిబ్బందితో ఆమె లైంగిక సంబంధాలు కలిగి ఉన్నారని, 60 మిలియన్ యువాన్లు (సుమారుగా రూ.70 కోట్లు) లంచాలుగా తీసుకున్నారని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అక్కడి ప్రభుత్వం ఆమెకు జైలు శిక్షను విధించింది. అంతేగాక ఆమెకు 10 లక్షల యువాన్ల జరిమానా కూడా విధించినట్టు తెలిసింది. ప్రావిన్స్‌లో స్వతంత్ర హోదా కలిగిన ఓ ప్రాంతానికి గవర్నర్‌గా వ్యవహరిస్తున్న ఆమెపై ఈ ఏడాది ఏప్రిల్‌లో వేటు పడింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

మంత్రి పొంగులేటి హామీ

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగులకు హామీ ఇచ్చారు. డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, తాసీల్దార్లు, వీఆర్వోలు, రీడిప్లాయిడ్ వీఆర్వోల అసోసియేషన్లు, వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి, రెవెన్యూ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్లతో మంత్రి పొంగులేటి శనివారం సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 29న తాసీల్దార్లు, అక్టోబర్ 6న డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో భేటీ కానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తాసీల్దార్లు, 317జీవో బాధితులను పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని, అన్నిస్థాయిల్లో అర్హులకు పదోన్నతులు కల్పించాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు మంత్రికి విజ్ఞప్తి చేశాయి.

దవాఖానాల్లో బయోమెట్రిక్ అటెండెన్స్

మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో తక్షణమే బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఫుడ్ సెక్యూరిటీ అధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలోని డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరిట ఉత్సవాలెందుకు?

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన పేరిట ఉత్సవాలు నిర్వహించడమెందుకో అర్థం కాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయం(ముగ్దుంభవన్)లో శనివారం విలేకరులతో మాట్లాడారు. తొలి తెలంగాణ పోరాట యోధులు సురవరం సుధాకర్‌రెడ్డి, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ పేర్లను యూనివర్సిటీలకు పెట్టడం, గద్దర్ పేరిట అవార్డులు అందజేయడాన్ని అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్ బాల మల్లేశ్, కలవేణ శంకర్, ఎం బాలనర్సింహ పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నరు..

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తమ చరిత్రగా చెప్పుకునేందుకు కొన్ని పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని పలువురు వక్తలు మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాల ముగింపు సభ శనివారం రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రొఫెసర్ హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

డిజైన్ల మేరకే కాళేశ్వరం నిర్మాణం

- **నిబంధనల ప్రకారమే క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు**
- **కమిషన్ ఎదుట ప్రాజెక్టు ఇంజినీర్ల వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఇచ్చిన డిజైన్ల మేరకే చేపట్టామని, ఎక్కడా డివియేషన్ లేదని ఇంజినీర్లు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జస్టిస్ ఘోష్ ఎదుట నివేదించారు. బీఆర్కే భవన్‌లో శనివారం జస్టిస్ ఘోష్ నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగింది. అంచనాకు మించి బరాజ్ వద్ద నీటి ప్రవాహ వేగముందని, గుర్తించిన వెంటనే పరిష్కారాల కోసం నిపుణులను సంప్రదించామని, పరీక్షలను నిర్వహించామన్నారు. నిర్మాణ ఏజెన్సీ సైట్ వద్దనే క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. నాణ్యతా పరీక్షల్లో కచ్చితమైన ఫలితాలు వచ్చాయని తెలిపారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి



ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

- **మా భూములను వాపసు ఇవ్వాలి**
- **నాలుగు గ్రామాల రైతులు డిమాండ్**
- **సోనియా, రాహుల్‌కు లేఖలు**

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడంలేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.



కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాసిన కుర్మిద్ద గ్రామ రైతులు

ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

▸ మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందేనని తేల్చిచెప్పారు.

యథావిధిగా ఫార్మాసిటీ

కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, దాన్ని రద్దు చేసేందుకు ఎలాంటి విధాన నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. అవార్డు నోటిఫికేషన్‌పై పిటిషనర్ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని, నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.



ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- **2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ**
- **'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ**

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె

ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

ఆదర్శంగా వరంగల్ జిల్లాలోని గొల్లపల్లె గ్రామం

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలామంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు. వారం రోజుల క్రితం గ్రామంలో సమావేశమై సంపూర్ణ మద్యపానం అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీలకతీతంగా గ్రామంలోని యువకులు, గ్రామపెద్దలు సంయుక్త నిర్ణయంతో మద్యపాన నిషేధాన్ని ప్రకటించి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు.

ఐఐటీలో చదువుతూ గంజాయి దందా

- **హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ విక్రయాలు**
- **పట్టుబడ్డ ఇద్దరు తమిళనాడు ఐఐటీ విద్యార్థులు**
- **మరోచోట గంజాయి అమ్ముతూ దొరికిన టెకీ**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో విద్యాభ్యాసం.. కానీ, చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్ముతూ పట్టుబడ్డారు ఇద్దరు ఐఐటీ విద్యార్థులు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన కొలి మణికంఠ చౌదరి, గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పవన్.. తమిళనాడులోని ఐఐటీ క్యాంపస్‌లో చదువుతున్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి గంజాయి అమ్మి డబ్బు సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నారు.ఎవరికీ అనుమానం రాకుండా హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో ఉన్న ఓ హాస్టల్‌లో తమ దందా నడుపుతున్నారు. రూ.వెయ్యికి 20 గ్రాములు చొప్పున అమ్ముతున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్‌పై దాడిచేసి ఇద్దరిని అరెస్టుచేశారు. వారి వద్ద 1.2 కిలోల గంజాయితో పాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న వైజాక్‌కు చెందిన కమలేశ్, అమోశ్‌పై కేసు నమోదుచేశారు. నిందితుల వద్ద గంజాయి కొనుగోలు చేసిన 22 మందిని గుర్తించి, వారిపైనా కేసులు పెట్టారు. అదేవిధంగా, నెల్లూరు జిల్లాకు చెందిన ఎర్రగంటి లోకేశ్.. నగరంలోని ఒక ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. గంజాయి మత్తుకు అలవాటు పడటంతో ఉద్యోగం పోయింది. గంజాయి విక్రయాలనే వృత్తిగా మార్చుకున్న లోకేశ్.. మణికొండలో ఇల్లు అద్దెకు తీసుకుని దందా కొనసాగించాడు. సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు.. నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద 1.74 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా చేసిన నెల్లూరు వాసి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు.

• ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ



"నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం

- **బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం**



హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తుతం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీ బరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతలవారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయకుండా ప్రాజెక్టులను నింపితే అవి కాళేశ్వరం నీళ్లు ఎట్లా అవుతాయో హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు.

ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- **కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలె?**
- **మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు**

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెటిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు. నీటి కొరత ఉన్న వేళ మేడిగడ్డ నుంచి, వరద వచ్చినప్పుడు ఎస్సారెస్పీ నుంచి, ఆ దిగువన ఎల్లంపల్లి నుంచి ఇలా బహుళ ప్రదేశాల నుంచి జలాలను తరలించుకునే అవకాశమున్న ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమని, అది కేసీఆర్ రీడిజైన్ ఘనతని తెలంగాణవాదులు కొనియాడుతున్నారు.

రంగంలోకి సైబర్ కమాండోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలను అరికట్టేందుకు ఐదేండ్లలో 5వేల మంది సైబర్ కమాండోలను సిద్ధం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. వివిధ రాష్ట్ర పోలీసు బలగాల నుంచి దాదాపు 350మందితో ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేశారు. వీరికి తమిళనాడులోని తిరుచ్చి (ఐఐటీ)లో శిక్షణ ఇవ్వనున్నారు.శిక్షణకు వరంగల్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఏ.ప్రశాంత్‌కుమార్ ఎంపికయ్యారు.

నేడు విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. యజ్ఞానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఆచారి, జూలూరు గౌరీశంకర్, దాసోజు శ్రవణ్, ఉపేంద్రాచారి హాజరవుతారని తెలిపారు.

స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు

కార్మిక ఉపాధి కల్పన శాఖపై సమీక్షలో సీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ):నూతనంగా ఏర్పాటు చేయనున్న స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్ కాలేజీలను తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రారంభించాలని నిర్దేశించారు. సిలబస్ రూపకల్పనకు నిపుణుల కమిటీని నియమించి విద్యావేత్తల సలహాలు స్వీకరించాలని సూచించారు. శనివారం సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీఐ కాలేజీలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చర్యలు తీసుకొని, సమగ్రంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో ఏటీసీలను ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఐటీఐ,ఏటీసీలు లేని నియోజకవర్గాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ/ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు.

తిరుమల లడ్డూకు మళ్లీ నందిని నెయ్యి!

2024-25లో 350 మెట్రిక్ టన్నులకు ఆర్డర్ • కిలో నెయ్యి 478 రూపాయలకు కొనుగోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం రేపిన నేపథ్యంలో లడ్డూ తయారీలో మళ్లీ నందిని నెయ్యినే వినియోగించాలని టీటీడీ నిర్ణయించింది. 2024-25 సంవత్సరంలో టీటీడీకి 350 మెట్రిక్ టన్నుల నెయ్యిని సరఫరా చేయాలని ఆర్డర్ ఇచ్చారు. కిలో నందిని నెయ్యిని 478 రూపాయల చొప్పున టీటీడీ కేఎంఫ్ నుంచి కొనుగోలు చేయనున్నది. గతంలో 2013-14 నుంచి 2021-22 వరకు 5వేల టన్నుల నెయ్యిని కేఎంఎఫ్ సరఫరా చేసింది. 2022-23లో అధిక ధర ఉందనే కారణంతో నందిని నెయ్యి టెండర్‌ను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.

కొద్దిరోజుల క్రితమే ఆర్డర్..

- *తిరుమల అధికారులు కొద్ది రోజుల క్రితమే 350మెట్రిక్ టన్నుల నెయ్యి కోసం ఆర్డర్ చేసినట్టు కేఎంఎఫ్ ప్రెసిడెంట్ భీమానాయక్ తెలిపారు. ఆవు నెయ్యిని మాత్రమే తిరుమలకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చామని పేర్కొన్నారు.*
- *శ్రీవారి ప్రసాదాల తయారీపై వస్తున్న వార్తలు తనను ఎంతగానో కలిచివేశాయని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు తెలిపారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం చంద్రబాబుకు సూచించానన్నారు.*
- *లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం పాపమని, ఘోరాతిఘోరమని నటుడు మంచు మోహన్ బాబు ఎక్స్‌వేదికగా వ్యాఖ్యానించారు.*

తిరుమలలో రేపట్నుంచి మహాశాంతి యాగం?

- *తిరుమల ఆలయ పవిత్రతను కాపాడేందుకు టీటీడీ ఉపశమన చర్యలకు ఉపక్రమించింది. శనివారం ఈవో శ్యామలారావు ఆధ్వర్యంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు శ్రీవారి ఆలయంలో మహాశాంతియాగం నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది.*



నెయ్యి సరఫరా చేస్తాం : విజయ డెయిరీ లేఖ

టీటీడీకి పాల ఉత్పత్తులు సరఫరా చేసేందుకు తెలంగాణ విజయ డెయిరీ సిద్ధంగా ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఈవో జే శ్యామలరావుకు శనివారం లేఖ ద్వారా ప్రభుత్వ ప్రతిపాదనను వెల్లడించారు. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యతను నిర్ధారించడంతోపాటు లక్షలాది మంది పాడి రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతుందని పేర్కొన్నారు.

ఓయో చేతికి అమెరికా హోటళ్లు

ఒప్పందం విలువ రూ.4,300 కోట్లు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: దేశీయ ఆతిథ్య సేవల సంస్థ ఆయో...అగ్రరాజ్యం అమెరికాలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సిద్ధమైంది. అమెరికాలోని బడ్జెట్ హోటల్ చెయిన్ మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్ హోటళ్లను నడుపుతున్న జీ6 హాస్పిటాల్టీని కొనుగోలు చేయబోతున్నది. జీ6లో పెట్టుబడులు పెట్టిన బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ నుంచి 525 మిలియన్ డాలర్ల(రూ.4,300 కోట్లకు పైమాటే)కు కొనుగోలు చేయబోతున్నట్లు ఓయో మాతృ సంస్థ ఓర్వల్ స్టేస్ ప్రకటించింది. పూర్తిస్థాయిలో నగదు రూపంలో జరగనున్న ఈ ఒప్పందం ఈ ఏడాది నాలుగో త్రైమాసికం నాటికి పూర్తికాగలదనే విశ్వాసాన్ని ఓయో వ్యక్తం చేసింది. మోటల్ 6 గడిచిన ఏడాదికాలంలో 1.7 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2019లో అమెరికాలో అడుగుపెట్టిన ఓయో..35 స్టేట్స్‌లో 320 హోటళ్లలో ఆతిథ్య సేవలు అందిస్తున్నది. కేవలం 2023లో 100 హోటళ్లను తన పరిధిలోకి తీసుకొచ్చిన సంస్థ..2024లోనే ఇదే పంథాను కొనసాగిస్తూ 250 హోటళ్లలో తన సేవలు అందిస్తున్నది. ఈ సందర్భంగా ఓయో ఇంటర్నేషనల్ సీఈవో గౌతమ్ స్వరూప్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఓ స్టార్టప్ కంపెనీ తన ఉనికి చాటుకోవడంతో ఈ కొనుగోలు కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. మోటల్ 6కు అమెరికాలో మంచి గుర్తింపువున్నదన్న ఆయన..ఓయోకున్న అనుభవంతో మరింత వృద్ధి సాధిస్తామన్న ధీమను వ్యక్తం చేశారు. ఈ కొనుగోలు సంస్థను వేరే సంస్థగా కొనసాగిస్తామన్నారు.

లిమిటెడ్ ఎడిషన్‌గా వ్యాగన్‌ఆర్

ధర రూ.5.64 లక్షలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..వ్యాగన్‌ఆర్ వాల్ట్ ఎడిషన్‌గా విడుదలచేసింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ రకాల్లో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.5,65,671గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ మాడల్‌ను నూతన టెక్నాలజీతో ఆధునీకరించినట్లు, ముఖ్యంగా లోపలిభాగంలో పలు మార్పులు చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఫాగ్ ల్యాంప్స్‌తోపాటు వీల్ ఆర్చ్ క్లాడింగ్స్, బంపర్ గార్డ్స్, బాడీ సైడ్ మౌల్డింగ్స్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, స్పీకర్లు, రివర్స్ పార్కింగ్ కెమెరా కూడా ఉన్నాయి. దేశీయ రోడ్లపై 32.5 లక్షల వ్యాగన్ ఆర్ కార్లు దూసుకుపోతున్నాయి. పెట్రోల్‌తోపాటు సీఎన్‌జీ వెర్షన్‌లో కూడా లభించనున్నది.



శనివారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమైన రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్

తగ్గిన పెట్టుబడుల వ్యయం



తొలి త్రైమాసికంలో భారీగా కుదింపు

ఏపీలో 88.7 శాతం, తెలంగాణలో 40.4 శాతం కోత

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ వెల్లడి

సార్వత్రిక ఎన్నికలే కారణం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాల ఆర్థిక వృద్ధికి ప్రాణం పోసే మూలధన వ్యయంపై పార్లమెంట్ ఎన్నికలు తీవ్ర ప్రభావం చూపించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని గణనీయంగా తగ్గించాయి. గత తొలి త్రైమాసికంతో పోలిస్తే ఏపీ 88.7 శాతం, తెలంగాణ 40.4 శాతం పెట్టుబడి వ్యయాన్ని కుదించాయి. పెద్దమొత్తంలో రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్‌డీపీ) కలిగిన 15 రాష్ట్రాలకుగాను 10 రాష్ట్రాలు తొలి త్రైమాసికంలో పెట్టుబడుల ఖర్చులకు పెద్దమొత్తంలో కోతలు పెట్టాయి. పార్లమెంట్ ఎన్నికల కారణంగా పెట్టుబడుల వ్యయాన్ని ఆయా రాష్ట్రాలు భారీగా తగ్గించినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన డాటా విశ్లేషణలో వెల్లడైంది.

తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన పెట్టుబడి వ్యయం

ఆంధ్రప్రదేశ్‌లో 2023 జూన్ నాటికి పెట్టుబడుల ఖర్చు రూ.12,495 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ.1,417 కోట్లకు.. అంటే 88 శాతం తగ్గింది. తెలంగాణలో 2023 జూన్ నాటికి రూ.9,817 కోట్ల నుంచి 2024 జూన్ నాటికి రూ. 5,854 కోట్లకు.. అంటే 40 శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో కూడా పెట్టుబడుల ఖర్చులో గణనీయమైన తగ్గుదల కనిపించింది. 2024 మొదటి త్రైమాసికం నాటికి రాష్ట్రాల పెట్టుబడుల ఖర్చు బడ్జెట్ నిష్పత్తి.. 5 శాతం నుంచి 20 శాతం మధ్యనే ఉన్నది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు బడ్జెట్‌లో కేటాయించిన నిష్పత్తుల కంటే పెట్టుబడుల ఖర్చులో తక్కువ శాతం నమోదు చేశాయి. మొదటి త్రైమాసికంలో 27 రాష్ట్రాల మొత్తం మూలధన వ్యయం గత సంవత్సరం కంటే గణనీయంగా తగ్గింది. జూలై నెలలో మాత్రం 6.8 శాతం పెరుగుదల నమోదైంది. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రాష్ట్రాల మూలధన వ్యయం 6.5 శాతం తగ్గింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తన మూలధన వ్యయంలో 35 శాతం కోత విధించింది.

ఇది రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకమే

రాష్ట్రాల్లో పెట్టుబడుల వ్యయం తగ్గుదలకు ప్రధాన కారణం సార్వత్రిక ఎన్నికలు అని ఆర్థిక నిపుణుడు సుజన్ హజ్రా అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితి రాష్ట్రాల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ధోరణి కనిపించిందని తెలిపారు. రాష్ట్రాల మూలధన వ్యయంలో తగ్గుదల రాష్ట్రాల అభివృద్ధిని పెద్ద ఎత్తున దెబ్బతీస్తుందని, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు సృష్టి, ఆర్థిక వృద్ధి వంటి అంశాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

టాప్ 15 రాష్ట్రాల్లో 10 రాష్ట్రాలు

2024-25 తొలి త్రైమాసికంలో మూలధన వ్యయం తగ్గుదల ఇలా ఉంది

ఆంధ్రప్రదేశ్:	-88.7%
తెలంగాణ:	-40.4%
గుజరాత్:	-25.5%
ఛత్తీస్‌గఢ్:	-19.0%
హర్యానా:	-17.0%
మధ్యప్రదేశ్:	-15.2
ఉత్తరప్రదేశ్:	-12.6%
కేరళ:	-8.4%
బీహార్:	-5.2%
తమిళనాడు:	-3.0%
వృద్ధి చూపిన రాష్ట్రాలు	
ఒడిశా:	+3.6%
మహారాష్ట్ర:	+17.2%
పంజాబ్:	+92.3%
అస్సాం:	+126.0%
కర్ణాటక:	+134.5%

(జూన్ 2023 నుంచి జూన్ 2024 వరకు వృద్ధి శాతాలు)

ఎఫ్‌డీఐలో భారీ వృద్ధి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకట్టుకోవడంలో భారత్ దూసుకుపోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో ఎఫ్‌డీఐలు 23.6 శాతం ఎగబాకి 27.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని రిజర్వు బ్యాంక్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో భారత్‌లోకి 22.4 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. దీంట్లో నికర ఎఫ్‌డీఐలు 3.8 బిలియన్ డాలర్ల నుంచి 5.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తన బుల్‌టెన్‌లో పేర్కొంది. సింగపూర్, మారిషస్, నెదర్లాండ్స్‌తోపాటు అమెరికా, బెల్జియం, జపాన్ దేశాల నుంచి అత్యధిక ఎఫ్‌డీఐలు వచ్చాయని పేర్కొంది.

తగ్గిన కోమెట్ ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: జేఎస్‌ డబ్ల్యూ ఎంజీ మోటర్ ఇండియా.. కోమెట్ ధరను భారీగా తగ్గించింది. బ్యాటరీ యాస్ ఏ సర్వీసు కింద కొనుగోలు చేసిన వారికి ఈ మాడల్ ధరను రూ.2 లక్షల వరకు కోత పెట్టింది. దీంతో కోమెట్ ఈవీ ధర రూ.4.99 లక్షలకు తగ్గనున్నది. ఎక్స్‌షోరూం ధర రూ.6.99 లక్షలు. ఈ నూతన ధరలతో కిలోమీటరుకు అయ్యే ఖర్చు రూ.2.5కి తగ్గనున్నదని పేర్కొంది. సింగిల్ చార్జింగ్‌తో ఈ కారు 230 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

భాగస్వామ్యంతో విద్యుత్ ప్లాంట్లు

- **తొలిసారిగా సింగరేణి సంస్థతో జట్టు కట్టనున్న జెన్‌కో**
- **వారంలో విధివిధానాలు.. నెలలోపు డీపీఆర్‌కు ఆదేశాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రామగుండంలో కొత్తగా నిర్మించతలపెట్టిన థర్మల్ పవర్‌ప్లాంట్ విషయంలో జాయింట్ వెంచర్ విధానానికే రాష్ట్ర సర్కారు సై అన్నది. విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు ఎంతగా వ్యతిరేకించినా సింగరేణి సంస్థతో జట్టుకట్టేందుకు సిద్ధపడింది. సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంట్‌ను నిర్మించనున్నది. సింగరేణి, టీజీ జెన్‌కో సంయుక్తంగా ఈ ప్లాంట్‌ను నిర్మించనున్నాయి. ఈ ప్లాంట్ నిర్మాణంపై టీజీ జెన్‌కో, సింగరేణి సంస్థలు వారంలోగా విధివిధానాలు ఖరారుచేయాలని, నెలలోగా డీపీఆర్‌ను రూపొందించి సమర్పించాలని ప్రభుత్వం ఆయా సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్.. టీజీజెన్‌కో, సింగరేణి సంస్థల సీఎండీలకు శనివారం లేఖలు రాశారు. రాష్ట్రంలో విద్యుత్తు ప్లాంట్లను జెన్‌కో ద్వారానే నిర్మించి చేపడుతున్నారు. ఇప్పటివరకు 6,485 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను జెన్‌కో నిర్మించగా, ఇప్పుడు పవర్ ప్లాంట్ల నిర్మాణంలో కొత్తగా జాయింట్‌వెంచర్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిసారి సింగరేణి సంస్థకు భాగస్వామ్యం కల్పిస్తున్నది. విధివిధానాలు, డీపీఆర్ తయారీ పూర్తికాగానే రెండు సంస్థల మధ్య ఎంవోయూ కుదుర్చుకోనున్నారు. కాగా, సింగరేణి సంస్థ భాగస్వామ్యాన్ని విద్యుత్తు ఉద్యోగ, కార్మిక సంఘాలు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ మేర కు పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వం జాయింట్ వెంచర్ విధానానికే మొగ్గుచూపడం గమనార్హం.



76 వేలకు పుత్తడి

హైదరాబాద్, సెప్టెంబర్ 21: బంగారం సామాన్యుడికి అందనంటుంది. రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న పుత్తడి శనివారం 76 వేలకు చేరువైంది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా ధరలు పుంజుకోవడం, ఫెడ్ వడ్డీరేట్లను భారీగా తగ్గించడంతో ఎగువముఖం పట్టాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర శనివారం ఒకేరోజు రూ.820 ఎగబాకి రూ.75,930 పలికింది. అంతకుముందు ఇది రూ.75,110గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర కూడా రూ.750 అందుకొని రూ.69,600కి చేరుకున్నది. దీంతోపాటు వెండి ధరలు కూడా మరింత పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.500 పెరిగి రూ.98 వేలకు చేరుకున్నది. మరోవైపు, ప్రస్తుత సంవత్సరంలో బంగారం ధరలు 27 శాతం వరకు పెరిగాయి. 2010 తర్వాత ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. మధ్యప్రాచ్యం దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ధరలు అంతకంతకు పెంజుకోవడంతో కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. గరిష్ఠ స్థాయికి పుత్తడి చేరుకోవడంతో కొనుగోళ్లు చేయడానికి జంకుతున్నారని ఆభరణాల వర్తకులు వెల్లడించారు.

గ్లోబల్ మార్కెట్లో రికార్డు

అంతర్జాతీయ మార్కెట్లో పుత్తడి రికార్డుల మీద రికార్డుల స్థాయిలో ర్యాలీ జరుపుతున్నది. విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను అర శాతం తగ్గించడంతో పెట్టుబడిదారులు తమ నిధులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,600 డాలర్ల పైకి చేరుకున్నది. స్పాట్ మార్కెట్లో పుత్తడి విలువ 1.3 శాతం ఎగబాకి 2,620.26 డాలర్లు పలికింది. బంగారం చరిత్రలో ఇంతటి స్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారి. అలాగే వెండి కూడా 1.4 శాతం బలోపేతమై 31.21 డాలర్లకు చేరుకున్నది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో ర్యాలీ జరుపుతున్నప్పటికీ త్వరలో కరెక్షన్ గురయ్యే అవకాశాలున్నాయని పెట్టుబడిదారులు హెచ్చరిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఆ బాధ్యత వారిదే!

మహిళల పట్ల అకృత్యాలు, లైంగిక వేధింపులు.. సినిమా ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆ వుడ్, ఈ వుడ్ అని కాదు.. ఇప్పుడు అన్ని భాషల చిత్ర పరిశ్రమల్లోనూ ఈ తరహా ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్ నటి కృతిక కమ్రా సోషల్ మీడియా వేదికగా ఓ విజ్ఞప్తి చేశారు. పరిశ్రమను కుదిపేస్తున్న క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు లాంటి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత.. పరిశ్రమలోని మగవాళ్లదేనని చెప్పారు. ముందుగా వారివారి సినిమా షూటింగ్స్‌పై దృష్టి పెట్టాలనీ, అందులో పాల్గొంటున్న మహిళల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. మహిళా నటులు, ఇతర సాంకేతిక సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాకబు చేసి.. కావాల్సిన సాయం అందించాలన్నారు. పని ప్రదేశం ప్రొఫెషనల్‌గా ఉండేలా చూసుకోవాలనీ, షూటింగ్ స్పాట్ల దగ్గర ఇష్టారీతిన మాట్లాడటం, మహిళలపై అసభ్యకరమైన జోకులు వేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'ఒకరిని పొగడటానికి.. వారిని ఆక్షేపించడానికి మధ్య ఎంతో తేడా ఉంది. ఆ హద్దును దాటకుండా.. మహిళలతో మాట్లాడగలిగితేనే సమాజంలో నిజమైన మార్పు వస్తుంది' అని చెప్పారు కృతిక. టెలివిజన్, ఓటీటీ షోల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది కృతిక. హుష్ హుష్ మొదలుకొని బొంబై మేరీ జాన్ వరకు.. వైవిధ్యమైన పాత్రల ద్వారా తన నటనా నైపుణ్యాన్ని నిరూపించుకున్నది.

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్ | ఆదివారం 22 సెప్టెంబర్ 2024 www.ntnews.com 11



తలవని ముగింపు

తలవన్

ఓటీటీ హిట్

సోనీలివ్: సెప్టెంబర్ 12
తారాగణం: బిజు మేనన్, ఆసిఫ్ అలీ, మియా జార్జ్ తదితరులు
దర్శకత్వం: జిస్ జోయ్



మలబారు తీరంలో కథలు చెట్లకు కాస్తాయేమో! అందుకే కాబోలు.. మాలీవుడ్‌లో వినూత్న కథలు విభిన్నంగా తెరకెక్కుతుంటాయి. ఫ్యామిలీ, థ్రిల్లర్, హారర్ ఇలా జానర్ ఏదైనా కేరళీయులు కథను తీసే విధానం హైలైట్‌గా నిలుస్తుంది. అందుకే.. మలయాళ చిత్రాలు ఓటీటీలో రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నాయి. తాజాగా సోనీలివ్ ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్న చిత్రం తలవన్. క్రైమ్ అండ్ పనిష్‌మెంట్ కథను ఇంత నాన్ వయొలెంట్‌గా తీయొచ్చా అని ఆశ్చర్యపరుస్తుంది ఈ సినిమా. కథలోకి వెళ్తే.. సీఐ జయశంకర్ (బిజు మేనన్) స్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసర్. ఎస్ఐ కార్తిక్ (ఆసిఫ్ అలీ) బదిలీపై జయశంకర్ స్టేషన్‌కు వస్తాడు. కార్తిక్‌ది దుందుడుకు స్వభావం. ఈ ఇద్దరి మధ్యా పెద్దగా పొట్లాటలేం జరగవు కానీ, ఏదో గ్యాప్ అయితే ఉంటుంది. ఇదిలా ఉండగా ఒకసారి జయశంకర్ ఇంట్లో రమ్య అనే యువతి మృతదేహం దొరుకుతుంది. ఒక కేసు విషయమై రమ్య తరచూ జయశంకర్‌ను కలుస్తుంటుంది. దీంతో ఆమెకు, సీఐకి ఏదో సంబంధం ఉందని కొందరు ప్రచారం చేస్తారు. ఈ నేపథ్యంలో సీఐ ఇంట్లో రమ్య మృతదేహం దొరకడంతో.. ఆయనే ఆమెను హత్య చేశాడని అందరూ అనుకుంటారు. జయశంకర్‌ను అరెస్టు చేస్తారు. ఎస్ఐ కార్తిక్ కేసు విచారణ చేపడతాడు. ఇంతకీ రమ్యను ఎవరు హత్య చేశారు? జయశంకర్ పాత్ర ఏంటి? కేసు విచారణలో ఎస్ఐ కార్తిక్ ఏం చేశాడు? అన్నది మిగిలిన కథ. ఆసక్తికరమైన మలుపులతో సినిమా సాగుతుంది. అక్కడక్కడా బోర్ కొట్టించినా.. తలవని ముగింపు ప్రేక్షకుడికి థ్రిల్ ఇస్తుంది.

ఏదో ఫ్రెండ్‌షిప్ కొద్దీ..



అంచనాలకు మించి పెళ్లి వేడుకలు నిర్వహించడం.. అంబానీల ఆనవాయితీ! అనంత్ అంబానీ – రాధికా మర్చంట్ వివాహ సంబురం ముగిసి అప్పుడే మూడు నెలలు కావస్తున్నది. అయినా.. ఆ వేడుక గురించి ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతూనే ఉన్నది. తాజాగా.. ఈ పెళ్లికి హాజరైన బాలీవుడ్ ప్రముఖుల గురించిన ఓ వార్త తెగ వైరల్ అవుతున్నది. అంబానీ ఆతిథ్యం స్వీకరించడానికి, వారి పెళ్లి బరాత్‌తో స్టెప్పులేయడానికి కొందరు బాలీవుడ్ తారలు పెద్ద మొత్తంలో డబ్బులు పుచ్చుకున్నారన్నది ఆ వార్త సారాంశం. అయితే.. ఈ అంశంపై బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే సోషల్‌మీడియా వేదికగా స్పందించింది. అనంత్‌తోపాటు రాధికా మర్చంట్ కూడా తనకు ఎంతో ప్రియమైన స్నేహితులనీ, అందుకే.. ఆ హైప్రొఫైల్ పెళ్లికి హాజరయ్యాననీ చెప్పుకొచ్చింది. అంబానీ పెళ్లి బరాత్‌లో పలువురు సెలెబ్రిటీలతో కలిసి అనన్య స్టెప్పులేసింది. రణ్‌వీర్ సింగ్, అర్జున్ కపూర్‌తో కలిసి డ్యాన్స్‌లతో అలరించింది. తాజా పుకార్లపై స్పందిస్తూ.. ''ఆ దంపతులిద్దరూ నా స్నేహితులు. సహజంగానే.. నా స్నేహితుల పెళ్లిలో నేను డ్యాన్స్ చేస్తాను. నా ప్రేమను ఇలా పంచుకోవడం నాకు ఇష్టం!'' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం అనన్య పాండే నటించిన వెబ్‌సిరీస్ 'కాల్ మీ బే'.. రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది.

సినిమా కథాంశాల్లో పీరియాడిక్ జానర్ చాలా ప్రత్యేకమైనది. ప్రేక్షకుల్ని కాలం వెనక్కి తీసుకెళ్లి నాటి కథలను, సంఘటనలను వెండితెరపై కళ్లకు కట్టినట్లు చూపిస్తాయి. కాలగర్భంలో కలిసిపోయిన అనేక రహస్యాలను పట్టి చూపిస్తాయి. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో పీరియాడిక్‌చిత్రాలకు ఆదరణ పెరుగుతున్నది. ఇక తెలుగులో పదికిపైగా చిత్రాలు ఈ జానర్‌లో రూపుదిద్దుకుంటున్నాయి. అందులో కొన్ని పూర్తిగా చారిత్రక యథార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కుతుండగా, మరికొన్ని ఫిక్షనల్ కథాంశాలతో ముస్తాబవుతున్నాయి.

పీక్‌లో పీరియాడిక్స్

Periodic Movies

పీరియాడిక్ సినిమాల ట్రెండ్ తెలుగులో కొత్తేమీ కాదు. ఈ జానర్‌లో వచ్చిన ఆర్ఆర్ఆర్, శ్యామ్‌సింగరాయ్, సీతారామం, సలార్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాల్ని సొంతం చేసుకున్నాయి. వీటి స్ఫూర్తితో యువ దర్శకులు సైతం అలాంటి కథలతో ముందుకొస్తున్నారు. ఈ తరహా చిత్రాల్లో కథా నేపథ్యమే ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్‌గా నిలుస్తున్నది. మేకింగ్, విజువల్స్ పరంగా కూడా కొత్తదనాన్ని చూపించే అవకాశం ఉండటంతో ఈ జానర్ చిత్రాలపై ప్రేక్షకులు కూడా ఆసక్తిని చూపిస్తున్నారు.

18వ శతాబ్దం కథతో రాజమౌళి-మహేశ్ చిత్రం

మహేశ్‌బాబు–రాజమౌళి కాంబినేషన్ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రాజమౌళి నుంచి రాబోతున్న సినిమా ఇదే కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ ఏర్పడింది. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో సమకాలీన అంశాలతోపాటు 18వ శతాబ్దం నేపథ్యంలో కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. దీని కోసం గిరిజన తెగల నాటి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లపై దర్శకుడు రాజమౌళి విస్తృత పరిశోధన చేస్తున్నారని, వాళ్ల లుక్స్ ఎలా ఉండాలనే విషయమై స్కెచ్‌లు కూడా గీయించారని తెలుస్తున్నది. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరిలో సెట్స్ మీదకు వెళ్లనుంది.

బ్రిటిష్ సైనికుడిగా ప్రభాస్


అగ్ర హీరో ప్రభాస్ ఏకకాలంలో మూడు సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో నటిస్తున్న సినిమా కూడా ఉంది. 1945 ప్రాంతపు స్వాతంత్ర్య సంగ్రామం నేపథ్యంలో నడిచే కథ ఇదని సమాచారం. ఇందులో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారని తెలుస్తున్నది. హిస్టారికల్ ఫిక్షన్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్వాతంత్ర్యసిద్ధికి యుద్ధం ఒక్కటే పరిష్కారమని నమ్మే యోధుడిగా ప్రభాస్ పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని.. దేశభక్తి, ప్రేమ, త్యాగం, పోరాటం అంశాల కలబోతగా యూనివర్సల్ ఫీల్‌తో ఈ సినిమా ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు.

యథార్థ చారిత్రక ఘటనలతో..

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 1854–1978 మధ్యకాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల నేపథ్య కథాంశమిది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారనే వార్తలొస్తున్నాయి. రాయలసీమ గ్రామీణ నేపథ్యంలో కథ నడుస్తుందని, యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది.


ఉత్తర తెలంగాణ నేపథ్యంలో శర్వానంద్..

యువ హీరో శర్వానంద్ తాజా సినిమా ప్రకటన ఇటీవలే వెలువడింది. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఉత్తర తెలంగాణ నేపథ్య కథాంశంతో తెరకెక్కించనున్నారు. 1960 దశకంలో ఉత్తర తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు లోని గ్రామీణ ప్రాంతంలో నడిచే కథ ఇది. ఈ సినిమా కోసం హీరో శర్వానంద్ సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. భారీ యాక్షన్ అంశాలతో ఎమోషనల్ డ్రామాగా తీర్చిదిద్దుతున్నామని దర్శకుడు సంపత్ నంది తెలిపారు.



సంచలన సంఘటనలతో 'మట్కా'

వరుణ్‌తేజ్ నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. 80వ దశకంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. విశాఖపట్నంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఈ కథను సిద్ధం చేసుకున్నారని, 1958–1982 మధ్య కథ నడుస్తుందని చెబుతున్నారు. ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ప్రభుత్వ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి ఆదరణ దక్కింది.



లష్కర్ నేపథ్య కథతో నాని

'దసరా' చిత్రం హీరో నానిలోని మాస్ కోణాన్ని ఆవిష్కరించింది. బాక్సాఫీస్ వద్ద రూ.100కోట్లతో సంచలనం సృష్టించింది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తొలి చిత్రంతోనే సత్తా చాటారు. ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమా కూడా 'దసరా' తరహాలోనే సింగరేణి నేపథ్య కథాంశమని ప్రచారం జరిగింది. అయితే తాజా సమాచారం ప్రకారం సికింద్రాబాద్‌లోని బస్తీ నేపథ్యంలో నడిచే కథని తెలుస్తున్నది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా బలమైన భావోద్వేగాలతో దర్శకుడు శ్రీకాంత్ ఓదెల స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు.

ఈ సినిమాలతోపాటు మరికొన్ని భారీ ప్రాజెక్ట్‌లు సైతం పీరియాడిక్ కథాంశాలతో రూపొందుతున్నాయి. తమిళ అగ్ర హీరో సూర్య నటిస్తున్న 'కంగువ' చిత్రాన్ని కొన్ని వందల ఏళ్ల నాటి పీరియాడిక్ కథతో రూపొందిస్తున్నారు దర్శకుడు శివ. నవంబర్‌లో విడుదల కానుంది. ఓ రహస్య దీవి నేపథ్యంలో నడిచే ఈ కథలో సూర్య యుద్ధవీరుడి పాత్రను పోషిస్తున్నారు. నిఖిల్ 'స్వయంభూ' సినిమా కూడా పీరియాడిక్ కథనే. చారిత్రక, దైవిక అంశాల కలబోతగా తెరకెక్కిస్తున్నారు. యువ హీరో కిరణ్ అబ్బవరం 'క' పేరుతో ఓ సినిమా చేస్తున్నారు. 1970వ దశకంలో నడిచే థ్రిల్లర్ ఇది. వీటితోపాటు అనేక చిన్న చిత్రాలు కూడా పీరియాడిక్ కథలతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రజెంట్ ట్రెండ్‌లో పీరియాడిక్ కథలకు లభిస్తున్న ఆదరణ దృష్ట్యా హీరోలతోపాటు దర్శకనిర్మాతలు కూడా ఈ తరహా కథలపై మక్కువ చూపిస్తున్నారు.

... సినిమా డెస్క్

పటౌడీల పొదుపు పాఠం!



ఒకప్పుడు ఆ కుటుంబం ఓ రాజ్యాన్నే పాలించింది. ఆ తర్వాత క్రికెట్‌ను, బాలీవుడ్‌నూ శాసించింది. వారుండే ఇంటి విలువ.. రూ.800 కోట్లకు పైమాటే! అంత డబ్బు ఉన్నా.. ఇల్లంతా పొదుపు మంత్రం పాటించాల్సిందే! డబ్బును ఆదా చెయ్యాల్సిందే! వినడానికి విచిత్రంగా ఉన్నా.. పటౌడీలు చెబుతున్న పొదుపు పాఠాలివి! ఒకవైపు భారతీయ సినిమా చరిత్రలో గొప్ప నటీమణుల్లో ఒకరైన షర్మిల ఠాగూర్. మరోవైపు భోపాల్ నవాబు, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మన్సూర్ అలీఖాన్. వీరి కొడుకు బాలీవుడ్ స్టార్‌హీరో సైఫ్ అలీఖాన్, కోడలు స్టార్ హీరోయిన్ కరీనా కపూర్. కూతురు బీటౌన్ బ్యూటీగా గుర్తింపు తెచ్చుకున్న సోహా అలీఖాన్. ఇంతమంది ఉద్దండుల నివాసం.. రూ.800 కోట్ల విలువ కలిగిన పటౌడీ ప్యాలెస్! వేల కోట్ల ఆస్తి ఉన్నా.. పటౌడీలు పొదుపు మంత్రం పాటిస్తున్నారు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో సోహా అలీఖాన్ ఈ విషయాలను వెల్లడించారు. పటౌడీ ప్యాలెస్‌కు రంగులు వేయించకుండా.. కేవలం వైట్ వాష్ మాత్రమే వేయిస్తూ ఖర్చును ఆదా చేస్తుంటారట. ఇక షర్మిల ఠాగూర్.. ఎన్ని పనులున్నా ఇంటి ఖర్చులను దగ్గరుండి చూసుకుంటారట. పద్దు లెక్కల పుస్తకాన్ని ఎప్పుడూ చేతిలో పట్టుకొనే ఉంటారట. అంతేకాదు.. తమ ఇంట్లోకి కొత్త వస్తువులు కొనికూడా కొన్నేళ్లు అవుతున్నదని చెప్పుకొచ్చింది సోహా! విచిత్రం ఏమిటంటే.. ఈ పొదుపు మంత్రం తమ తాతల కాలం నుంచీ ఉండేదట. ఈ ప్యాలెస్ నిర్మాణంలో పాలరాయి ఖర్చును తగ్గించడానికి కార్పెట్లను కొనుగోలు చేశారట. అందుకే.. ఇప్పుడు ప్యాలెస్ అడుగడుగునా కార్పెట్లే స్వాగతం పలుకుతాయని చెబుతున్నదని సోహా అలీఖాన్!

ఆస్కార్ ఖాయం!



వచ్చే ఏడాది జరిగే 'ఆస్కార్' వేడుకల్లో భారత్ తరఫున 'లాపతా లేడీస్' అర్హత సాధిస్తుందని నమ్మకంగా చెబుతున్నది బాలీవుడ్ డైరెక్టర్ కిరణ్ రావు. రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారైన ఇద్దరు గ్రామీణ ప్రాంత పెళ్లి కూతుళ్ల ఇతివృత్తంతో ఈ సినిమా తెరకెక్కింది. అమిర్ ఖాన్ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం.. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నది. సుప్రీం కోర్టు డెబ్బై ఐదేళ్ల వేడుకల్లో భాగంగా.. కోర్టు అడ్మినిస్ట్రేట్ వేడుకల్లోనూ ఈ చిత్రం ప్రదర్శితమైంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో కిరణ్‌రావు మాట్లాడుతూ.. తమ చిత్రం ఆస్కార్ వేదికపై మనదేశానికి ప్రాతినిధ్యం వహించాలనేది తనతోపాటు చిత్ర బృందం కోరిక అని వెల్లడించింది. ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా తనవంతు బాధ్యతగా ఆస్కార్‌కు పంపిస్తుదనే నమ్మకం ఉన్నదనీ చెప్పుకొచ్చింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టిన కిరణ్‌రావు.. 2011లో అమీర్‌ఖాన్ హీరోగా 'ధోబీ ఘాట్' అనే చిత్రంతో దర్శకురాలిగా మారింది. గతేడాది 'లాపతా లేడీస్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



జాతీయ సాహస శిబిరానికి మల్లాపూర్ విద్యార్థులు



తిమ్మాపూర్ రూరల్, సెప్టెంబర్ 21: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. చదువుతున్నది ప్రభుత్వ పాఠశాల అయినా ప్రతిభ కొదువలేదని చేతల్లో చూపించారు. హర్యానా వేదికగా అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ వరకు నేషనల్ యూత్ అడ్వెంచర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ సాహస కృ త్యాల శిబిరానికి 10 మంది మల్లాపూర్ వి ద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం ఉమారాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహస కృత్యాలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరింతంగా పెంపొందుతాయని ఆమె అన్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు రాఫెలింగ్, మౌంటెనీరింగ్, రివర్‌క్రాసింగ్ వంటి భిన్నమైన సాహస విన్యాసాల్లో పాల్గొంటారని తెలిపారు. శిబిరానికి ఎంపికైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స మావేశం నిర్వహించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనాచా రి, స్కౌట్ జిల్లా కార్యదర్శి రాంరెడ్డి పాల్గొన్నారు.

పంత్, గిల్ గర్జన

సూపర్ సెంచరీలతో విజృంభణ

భారత్ రెండో ఇన్నింగ్స్ 287/4 డిక్లేర్డ్

బంగ్లా లక్ష్యం 515, ప్రస్తుతం 158/4



పంత్ (109)

గిల్ (119*)

భారత యువ కిశోరాలు శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్..బంగ్లాదేశ్‌పై గర్జించారు. భవిష్యత్ ఆశాకిరణాలుగా భావిస్తున్న ఈ ఇద్దరు.. బంగ్లాపై సూపర్ సెంచరీలతో కదంతొక్కారు. ఘోర రోడ్డు ప్రమాదంలో కొని ప్రాణంతో బయటపడి మైదానంలో మళ్లీ అడుగుపెట్టిన పంత్ టెస్టుల్లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. చిదంబరం స్టేడియంలో బంగ్లా బౌలర్లను ఉతికి ఆరేస్తూ శతకంతో విరుచుకుపడ్డాడు. తన ట్రేడ్‌మార్క్ షాట్లతోఅభిమానులను అలరిస్తూ కెరీర్‌లో ఆరో సెంచరీ ఖాతాలో వేసుకుంటూ దిగ్గజ ధోనీతో సమంగా నిలిచాడు. తానేం తక్కువ కాదన్నట్లు గిల్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో బంగ్లా బౌలర్లు చేష్టలుడిగిపోయారు. వీరిద్దరి శతక విజృంభణతో బంగ్లా ముందు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. మరో రెండు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో 4 వికెట్లు కోల్పోయిన బంగ్లా 158 పరుగులతో కొనసాగుతున్నది. టీమ్ఇండియా బౌలర్లు జూలు విదిలిస్తే..బంగ్లాదేశ్ ఖేల్ ఖతమైనట్లే.

చెన్నై: సొంతగడ్డపై తమకు తిరుగులేదని భారత్ మరోమారు చేతల్లో చూపెడుతున్నది. ప్రత్యర్థి ఎవరైనా తమ వ్యూహాల్లో తేడా ఉండదని సిరీస్‌కు ముందే హెచ్చరించిన కెప్టెన్ రోహిత్ శర్మ..అందుకు తగ్గట్లు బంగ్లాదేశ్‌కు ఉచ్చు బిగిస్తున్నాడు. టీమ్ఇండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ తొలి టెస్టుపై పూర్తి పట్టు సాధించింది. భారత్ నిర్దేశించిన 515 పరుగుల లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఓపెనర్లు జాకిర్ హసన్(33), షాద్మన్(35) మెరుగైన శుభారంభం అందించగా, కెప్టెన్ నజ్ముల్(51 నాటౌట్) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. అశ్విన్(3/63) మూడు వికెట్లు తీసి జోరు మీదున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 81/3తో మూడో రోజు శనివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్ఇండియా..గిల్(176 బంతుల్లో 119 నాటౌట్, 10ఫోర్లు, 4సిక్స్‌లు), పంత్(128 బంతుల్లో 109, 13ఫోర్లు, 4సిక్స్‌లు) సెంచరీలతో విజృంభించారు. బంగ్లా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ వీరిద్దరు రాణించడంతో 287 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. మెహదీహసన్(2/103) రెండు వికెట్లు దక్కాయి.

గిల్, పంత్ మోత

యువ క్రికెటర్లు గిల్, పంత్..చెన్నై చిదంబరం స్టేడియంలో పరుగుల వరద పారించారు. బంగ్లా బౌలర్లను సులువుగా ఎదుర్కొంటూ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన గిల్..తన విలువ చాటుకున్నాడు. ఎక్కడా చెత్త షాట్లకు పోకుండా ఇన్నింగ్స్ కొనసాగించాడు. స్పిన్నర్ మెహదీ హసన్ బౌలింగ్‌లో సిక్స్‌తో గిల్ 50 పరుగుల మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో పంత్..గిల్‌కు చక్కని సహకారం అందించాడు. తొలి సెషన్‌లో వికెట్ కోల్పోకుండా జాగ్రత్తపడ్డ ఈ ఇద్దరు భారీ ఇన్నింగ్స్‌కు రూపకల్పన చేశారు. ఓవైపు మంచి బంతులను గౌరవిస్తూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరుబోర్డుకు కీలక పరుగులు జతచేశారు. అయితే షకీబ్ అల్‌హసన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన పంత్..72 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కెప్టెన్ నజ్ముల్ క్యాచ్ విడిచిపెట్టడంతో లైఫ్ దక్కించుకున్నాడు. ఇక అక్కణ్నుంచి మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. గిల్ ఒకింత నెమ్మదించగా, పంత్ టాప్‌గేర్‌లో దూసుకెళ్లాడు. బౌండరీలతో ఆకట్టుకున్నాడు. షకీబ్ బౌలింగ్‌లో 124 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో పంత్ ఒకింత భావోద్వేగానికి గురయ్యాడు. ఆకాశం వైపు తదేకంగా చూస్తూ అభిమానులకు అభివాదం చేశాడు. మెహదీ వేసిన మరుసటి ఓవర్‌లోనే అతనికే రిటర్న్ క్యాచ్ ఇచ్చి పంత్ వెనుదిరిగాడు. ఆ తర్వాత గిల్ సెంచరీ మార్క్ అందుకోగా, రాహుల్(22) నాటౌట్‌గా నిలిచాడు

బంగ్లా 158/4:

భారీ లక్ష్యఛేదనలో బంగ్లాకు మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు జకీర్, షాద్మన్ ఆకట్టుకున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ నజ్ముల్ అర్ధసెంచరీతో రాణించాడు. అశ్విన్(3/63) రాణించడంతో బంగ్లా నాలుగు వికెట్లు కోల్పోయింది. వెలుతురు లేమి కారణంగా అంపైర్లు మ్యాచ్‌ను ముందుగానే నిలిపివేశారు.

పంత్ ప్రణామ్..!



రోడ్డు ప్రమాదం నుంచి బయటపడి తిరిగి బంగ్లాదేశ్‌పైనే టెస్టుల్లో పునరాగమనం చేసిన పంత్ మూడో రోజు ఆటలో భావోద్వేగంతో కనిపించాడు. రెండో సెషన్‌లో మైదానంలోకి దిగే ముందుకు తన బ్యాట్, హెల్మెట్, గ్లౌసెస్‌కు మొక్కాడు. మరోవైపు తాను బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బంగ్లా కెప్టెన్ నజ్ముల్‌కు పంత్ సూచనలు ఇవ్వడం లైవ్‌లో రికార్డయ్యింది. ఇక్కడ ఒక ఫీల్డర్‌ను పెట్టమంటూ చెప్పడం నవ్వులు తెప్పించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376 ఆలౌట్, బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149 ఆలౌట్, భారత్ రెండోఇన్నింగ్స్: 287/4 డిక్లేర్డ్(గిల్ 119 నాటౌట్, పంత్ 109, మెహదీ 2/103), బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: 158/4 (నజ్ముల్ 51 నాటౌట్, షాద్మన్ 35, అశ్విన్ 3/63)

అఫ్గన్ అద్భుతః

- దక్షిణాఫ్రికాపై తొలిసారి వన్డే సిరీస్ సొంతం
- రెండో వన్డేలో అఫ్గన్ ఘన విజయం
- గుర్బాజ్, రషీద్ విజృంభణ



షార్జా: అంతర్జాతీయ క్రికెట్‌లో తాము ఎంత మాత్రం పసికూనలం కాదని అఫ్గానిస్థాన్ జట్టు నిరూపించింది. శుక్రవారం అర్ధరాత్రి ముగిసిన రెండో వన్డేలో అఫ్గన్ 177 పరుగులతో దక్షిణాఫ్రికాపై చారిత్రక విజయం సాధించింది. తద్వారా సఫారీలపై తొలి వన్డే సిరీస్‌ను దక్కించుకుని తమ సత్తాఏంటో ప్రపంచానికి చాటిచెప్పింది. తొలుత రహ్మనుల్లా గుర్బాజ్ (105) సూపర్ సెంచరీకి తోడు అజ్మతుల్లా ఒమర్జాయ్(86 నాటౌట్), రెహమత్ షా(50) అర్ధసెంచరీలతో అఫ్గన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 311/4 భారీ స్కోరు చేసింది. 88 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన అఫ్గన్‌ను ఒమర్జాయ్, రెహమత్‌షా ఆదుకున్నారు. వీరిద్దరు సఫారీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా ఒమర్జాయ్ తన ఇన్నింగ్స్‌లో 10ఫోర్లు, మూడు భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. గుర్బాజ్ తర్వాత క్రీజులోకొచ్చిన అజ్మతుల్లా దూకుడు కనబరిచాడు. 5ఫోర్లు, 6సిక్స్‌లతో సఫారీలపై విరుచుకుపడటంతో స్కోరు 300 మార్క్ అందుకుంది. ఎంగ్డీ, బర్గర్, పీటర్, మార్క్‌రమ్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 34.2 ఓవర్లలో 134 పరుగులకు కుప్పకూలింది. స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్(5/19) ధాటికి సఫారీ బ్యాటర్లు చాప చుట్టేశారు. ఓవైపు గాయం వేధిస్తున్నా..రషీద్ తన స్పిన్ నైపుణ్యంతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. కెప్టెన్ బవుమా(38) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. రషీద్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



భారత్ స్వర్ణ సంబురం

- ఓపెన్‌లో పసిడి పతకం
- సత్తాచాటిన అర్జున్
- చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్‌లో భారత్ స్వర్ణ చరిత్ర లిఖించింది. టోర్నీలో తొలిసారి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన టోర్నీ ఓపెన్ విభాగంలోభారత్ మరో రౌండ్ మిగిలుండగానే 19 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 2020లో రష్యాతో కలిసి సంయుక్త విజేతగా నిలిచిన భారత్ తాజాగా స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. శనివారం రాత్రి జరిగిన పదో రౌండ్ పోరులో భారత బృందం 2.5-1.5 తేడాతో అమెరికాపై అద్భుత విజయం సాధించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తలపడబోతున్న దొమ్మరాజు గుకేశ్.. అమెరికా స్టార్ ప్లేయర్ ఫాబియానో కరువానను మట్టికరిపించాడు. అయితే వెస్లీ చేతిలో ప్రజ్ఞానంద ఓటమిపాలు కావడంతో పోరు ఆసక్తికరంగా మారింది. తెలంగాణ యువ జీఎం ఇరిగేసి అర్జున్ డొమింగే పెరెజ్‌పై గెలిచి భారత్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. లెవాన్ ఆరోనియాన్‌తో గేమ్‌ను విదిత్ గుజరాతీ డ్రా చేసుకోవడంతో మన గెలుపు ఖరారైంది. మరోవైపు మహిళల విభాగంలో భారత్ 2.5-1.5తో చైనాపై గెలిచి అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది.

లంక, కివీస్ టెస్టుకు బ్రేక్

కొలంబో: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్టుకు బ్రేక్ పడింది. ఇప్పటికే మూడు రోజుల ఆట ముగిసిన టెస్టులో నాలుగో రోజైన శనివారం విరామం ప్రకటించారు. తొలుత షెడ్యూల్‌లో ప్రకటించినట్లే మూడు రోజుల తర్వాత మ్యాచ్‌కు విరామమిచ్చారు. శనివారం శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇలా బ్రేక్ ఇచ్చినట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం, సోమవారం మిగిలిన రెండు రోజుల ఆట కొనసాగనుంది.

ఇండియా 'డీ'కి భారీ ఆధిక్యం

అనంతపూర్: దులీప్ ట్రోఫీలో ఇండియా 'బీ', 'డీ' జట్ల మధ్య రసవత్తర పోరు జరుగుతున్నది. రికీ భుయ్(90 నాటౌట్), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(50) అర్ధసెంచరీలతో ఇండియా 'డీ' రెండో ఇన్నింగ్స్‌లో 244/5 స్కోరు చేసింది. భుయ్ బాధ్యాయుత ఇన్నింగ్స్‌తో రాణించాడు. ముకేశ్ (3/80) ఆకట్టుకున్నాడు. ఇండియా 'డీ' ప్రస్తుతం 311 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఓవర్‌నైట్ స్కోరు 210/6తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇండియా 'బీ' 282 కు ఆలౌటైంది.

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ఆపండి!

- గ్రూప్-1పై హైకోర్టులో 14కు పైగా కేసులు
- కేసులు తేలాకే నిర్వహించాలి
- మెయిన్స్ తర్వాత తీర్పులొస్తే అమలు ఎలా?
- రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యర్థుల వినతి
- ఎన్టీఆర్ స్టేడియంలో సమావేశం
- హైకోర్టు సీజే అలోక్ అరాధేకు లేఖలు రాయాలని నిర్ణయం



హైకోర్టు సీజేకు లేఖలు రాసేందుకు ఎన్టీఆర్ స్టేడియంలో సమావేశమైన నిరుద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): 'గ్రూప్ 1పై 14కు పైగా కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు ఉన్నాయి. పరీక్షల అనంతరం కోర్టు తీర్పులొస్తే ఎలా అమలు చేస్తారు. అందుకే తీర్పుల అనంతరమే పరీక్షలు నిర్వహించాలి' అని అభ్యర్థులు కోరుతున్నారు. కేసులు కొలిక్కి వచ్చేవరకు పరీక్షలను నిర్వహించొద్దని కోరుతున్నారు. ఈ అంశంపై శుక్రవారం అభ్యర్థులు ఎన్టీఆర్ స్టేడియంలో పెద్ద ఎత్తున సమావేశమయ్యారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సంతకాలు సేకరించి హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేకు విన్నవించుకోవాలని అభ్యర్థులు నిర్ణయించారు. గ్రూప్-1పై పెండింగ్‌లో ఉన్న కేసులు హైకోర్టు ధర్మాసనం ముందు విచారణ జరుగుతుండగా పరీక్షలెలా నిర్వహిస్తారని అభ్యర్థులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఒకవేళ మెయిన్స్ పరీక్షలు నిర్వహించిన తర్వాత తీర్పులొస్తే అమలు ఎలా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 9న జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు 3.02 లక్షల మంది హాజరయ్యారు. వీరిలో మెయిన్స్ పరీక్షలకు 31,382 మంది అర్హత సాధించారు. వీరికి అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నది. గ్రూప్-1పై ప్రస్తుతం పలు కేసులు హైకోర్టులో విచారణ జరుగుతున్నాయి. హారిజాంటల్ రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ నవంబర్ 7న, ఫైనల్ కీపై, జీవో-29పై వేసిన కేసులు ఈ నెల 27 విచారణకు రానున్నాయి. స్థానికతపై వేసిన పిటిషన్ కేసు అక్టోబర్ 3న విచారణకు రానున్నది. ఆయా కేసులు తేలాకే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలన్నది అభ్యర్థుల ప్రధాన డిమాండ్.

గ్రూప్-1పై వివిధ కేసుల వివరాలు?

- ప్రాథమిక కీపై 1,712 మంది అభ్యర్థుల నుంచి 6,417 అభ్యంతరాలు వచ్చాయి. నిపుణుల కమిటీ సూచనల మేరకు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌లో 56, 59 ప్రశ్నలను తొలగించారు. 115వ ప్రశ్నకు సమాధానంగా ఆప్షన్ 2 నుంచి 1 సరైన సమాధానంగా మార్చారు. అయితే అభ్యర్థులు మొత్తం 13 ప్రశ్నల సమాధానాలపై అభ్యంతరాలు లేవదీశారు. 35, 41, 45, 59, 64, 66, 67, 79, 95, 106, 116, 119, 139వ ప్రశ్నలపై అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ అంశంపై కోర్టులో విచారణ జరుగుతున్నది.
- గ్రూప్-1 నోటిఫికేషన్‌లో తొలుత 503 పోస్టులను విడుదల చేయగా, కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు మరో 60 పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్‌ను జారీచేసింది. దీంతో కొత్తగా 1.71 లక్షల మంది రెండోసారి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తొలుత దరఖాస్తు చేసిన వారికి 503, రెండోసారి నోటిఫికేషన్ జారీచేసిన 60 పోస్టులకు కొత్త, పాత వారందరికీ వర్తింపజేయాలని హైకోర్టును ఆశ్రయించారు.
- జీవో 29ని సవాల్ చేస్తూ మరో కేసు కోర్టులో నడుస్తున్నది. ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల వర్తింపు సహా పలు రిజర్వేషన్లపై వివిధ కేసులు ఉన్నాయి. జీవో 55 కేసుపై తుది తీర్పు రానేలేదు.
- ఎస్టీ రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచడంపైనా కోర్టులో కేసు నడుస్తున్నది. ఈ అంశంపై అక్టోబర్ 14న తీర్పు వచ్చే అవకాశం ఉన్నది.
- పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసే అవకాశం లేదని, ఎలా రద్దు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టులో మరో కేసు వేశారు.
- మొత్తం పోస్టులకు కాకుండా ఓపెన్ క్యాటగిరీ పోస్టుల్లోనే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను వర్తింపజేయాలని హైకోర్టులో కేసు నడుస్తున్నది. మధ్యప్రదేశ్ హైకోర్టు సింగింగ్ బెంచ్ ఇదే తీర్పు ఇవ్వగా ఈ తీర్పును మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు.
- స్పోర్ట్స్ కోటా పోస్టులకు జాతీయస్థాయిలో ఆడిన క్రీడాకారులను సైతం అనుమతించాలని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ పోస్టులకు 198 మందిని పికప్ చేయాల్సి ఉండగా, 8 వేల మంది సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ఇప్పట్లో సాధ్యమా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

టెట్‌పై సస్పెన్స్!

- డిసెంబర్‌లో జీవో ఇచ్చిన సర్కారు
- జాబ్ క్యాలెండర్‌లో జనవరి అని ప్రకటన
- ప్రభుత్వంలో లోపించిన సమన్వయం

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): టెట్ షెడ్యూల్ విషయంలో స్పష్టత కొరవడింది. ప్రభుత్వమే పరస్పర విరుద్ధమైన ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వంలో సమన్వయం కొరవడింది. టెట్‌ను ఏటా రెండుసార్లు నిర్వహిస్తామని, జూన్‌లో ఒకసారి, డిసెంబర్‌లో మరోసారి నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జీవో 18 ను విడుదల చేశారు. జూలై 5న జీవోను విడుదల చేయగా, ఆగస్టు 3న ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌లో టెట్‌ను జనవరి 2025లో నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్‌లోనే టెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పింది. నెలరోజుల వ్యవధిలోనే డిసెంబర్‌లో అని జీవో, జనవరిలో అని జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించడంతో సందిగ్ధత నెలకొన్నది. సాక్షాత్తు ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పరస్పర విరుద్ధంగా ఉంటే ఎలా అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. టెట్‌ను ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరుతున్నారు.

రేషనలైజేషన్ జీవోను మార్చాలి: యూఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): రేషనలైజేషన్ జీవో-25 నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన టీచర్ల సర్దుబాటును నిలిపివేయాలని యూఎస్‌పీఎస్సీ ప్రకటనలో కోరింది. ప్రాథమిక పాఠశాలల్లో 11 మందికి ఇద్ద రు, 60 మందికి ఇద్దరు టీచర్లను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమని పేర్కొంది. డీఎస్సీ నియామకాలు జరగాల్సిన తరుణంలో సర్దుబాటు చేయడాన్ని బట్టి ఇప్పట్లో నియామకాలు చేపట్టే ఉద్దేశ్యం లేదా? అని ప్రశ్నించింది.

పదోన్నతులు, బదిలీలు చేపట్టండి: టీజీవో

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): రెవెన్యూశాఖలో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీజీవో ప్రభుత్వాన్ని కోరింది. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, శ్యామ్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్.. జీఆర్ఎల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ విభాగంలోని డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ గ్రేడ్ -2 జనరల్ ర్యాంకింగ్ లిస్టు(జీఆర్ఎల్)ను టీజీపీఎస్సీ శనివారం విడుదల చేసింది. జీఆర్ఎల్‌తోపాటు ఫైనల్ కీని సైతం విడుదల చేసింది. జూన్ 30, జూలై 4న డీఏవో ఉద్యోగాల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ టెస్టును నిర్వహించారు. జూలై 31న ప్రాథమిక కీని విడుదల చేయగా, తాజాగా శనివారం ఫైనల్‌కీతోపాటు జనరల్ ర్యాంకింగ్ లిస్టును వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

టైం టేబుల్ మార్చండి: పీఆర్‌జీటీఏ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాలలు, కళాశాలల టైం టేబుల్‌ను మార్చాలని పీఆర్‌జీటీఏ ప్రభుత్వాన్ని కోరింది. పీఆర్‌జీటీఏ ప్రతినిధులు శనివారం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 010 పద్దుద్వారా జీతాలు చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని, సీపీఎల్ మంజూరు, కేర్‌టేకర్ల నియామకం, డిగ్రీకాలేజీలను ఏర్పాటుచేయాలని కోరారు. పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ రెడ్డి, నిర్మలానందం, విద్యాసాగర్, రమేశ్, విజయ్‌కుమార్, చెల్కా సంజీవ రెడ్డి వినతిపత్రాన్ని సమర్పించారు.

స్కూల్‌గ్రాంట్ విడుదలపై హర్షం

ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, ఆదర్శపాఠశాలలకు స్కూల్ గ్రాంట్, స్పోర్ట్స్ గ్రాంట్‌ను విడుదల చేయడంపై పీఆర్టీయూటీఎస్ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెన్సీతో వద్దు..

నేరుగా జీతాలు చెల్లించండి

ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం గల ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వం ద్వారానే జీతాలు చెల్లించాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నేరుగా ప్రభుత్వం, కార్పొరేషన్ ద్వారా వేతనాలను అందించాలని ప్రకటనలో కోరింది. జేఏసీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు శ్రీధర్ శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతి నెల 5లోపు వేతనాలు అందించాలని, హెల్త్‌కార్డులు మంజూరుచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సెలవులను 30కి పెంచాలని కోరారు.

కంగన రనౌత్‌కు సమన్లు

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, ఎంపీ కంగన రనౌత్‌కు ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు సమన్లు జారీ చేసింది. వచ్చే నెల 25న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా 2020-21లో జరిగిన రైతుల నిరసనలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు ఆమెపై నమోదైన కేసులో ఈ చర్య తీసుకుంది.

త్వరలో కొత్త పాఠ్యపుస్తకాలు

దశలవారీగా అందుబాటులోకి


హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్(ఎన్సీఎఫ్)-2023 ప్రకారం విద్యాశాఖ కొత్త పాఠ్యపుస్తకాలను దశలవారీగా రూపొందించనున్నది. 2014 తర్వాత కేసీఆర్ సర్కారు హయాంలో పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేశారు. కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్(ఎన్సీఎఫ్)-2023 ఆధారంగానే కొత్త కరిక్యులం రూపొందించాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలను మినహాయించి నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులకు కొత్త కరిక్యులాన్ని రూపొందించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత భాషలకు సంబంధించిన కరిక్యులాన్ని సైతం మార్చనున్నారు.

ఎన్సీఎఫ్ సూచనలిలా..

- పాఠ్యప్రణాళికల్లో 20%స్థానిక, 30% ప్రాంతీయ, 30% జాతీయ, 20% అంతర్జాతీయ అంశాలుండాలి.
- కంఠస్థం, బట్టిపట్టే పద్ధతుల నుంచి విద్యార్థులను దూరంచేసేలా కరిక్యులాన్ని తయారుచేయాలి.
- 6 నుంచి 8వ తరగతి వరకు సామాజిక శాస్త్రాల బోధనకు థీమాటిక్ విధానం అవలంభించాలి. 9వ తరగతి తర్వాతే చరిత్ర, భూగోళం, ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రంగా విభజించాలి.
- పరీక్షలను సంస్కరించాలి. 10, 12 తరగతుల పరీక్షలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలి.
- గణితం సమస్యా పరిష్కరణ దిశలో అమూర్త, తార్కిక ఆలోచన సామర్థ్యాలను పెంపొందించేలా ఉండాలి.
- సైన్స్, పర్యావరణం పాఠశాలజీవితంలో అంతర్భాగం కావాలి. సృజనాత్మక, కుతూహలాన్ని పెంపొందించే విధంగా సైన్స్ పాఠ్యాంశాలుండాలి. సైన్స్, ప్రయోగ కృత్యాలు వాస్తవ ప్రపంచంలోకి ప్రవేశించేందుకు ఉపయోగపడాలి.
- భాషల బోధన పాఠ్యపుస్తక సరిహద్దులు దాటి ఉండాలి. విద్యార్థి మూడు భాషలను అధ్యయనం చేసే స్వేచ్ఛనివ్వాలి.

మరియపురానికి గ్రామ స్వరాజ్ అవార్డు

అందుకోనున్న మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి




గీసుగొండ, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో ఆదర్శ గ్రామ పంచాయతీ అయిన మరియపురం గ్రామ స్వరాజ్ అవార్డుకు ఎంపికైనట్టు మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి తెలిపారు. అక్టోబర్ 17, 18, 19న తిరుపతిలో అగ్రశ్రీ సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి పంచాయతీ రాజ్ సెమినార్‌కు హాజరు కావాలని ఆహ్వానం అందినట్టు చెప్పారు. 2022-2023లో గ్రామాభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతలో సాధించిన ప్రగతి ఆధారంగా దేశంలో గ్రామ స్వరాజ్‌కు ఎంపికైన ఆరు గ్రామ పంచాయతీల్లో మరియపురం ఉందని పేర్కొన్నారు. ఈ సెమినార్‌కు వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు హాజరై అవార్డును బహూకరిస్తారని తెలిపారు.

'యోగా'కు దరఖాస్తులు


హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆయుష్ డిపార్ట్‌మెంట్ వివిధ జిల్లాల్లో పార్ట్ టైం బేసిస్ మీద యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. వివరాలు కోసం ayush. telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

తెలంగాణ వర్సిటీలో పాముల కలకలం



నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో రెండు పాములు శనివారం కలకలం రేపాయి. కంప్యూటర్ సైన్స్ ల్యాబ్‌లోకి దూరిన విష సర్పాలను చూసి సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. అక్కడే ఉన్న సిబ్బంది వాటిని బయటకు పంపించడంతో అక్కడున్న వారు ఊపిరి పీల్చుకున్నారు. -డిచ్‌పల్లి

బడిలో కొండచిలువ



జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఊట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొండచిలువ హడలెత్తించింది. ఈ ఘటన మూడు రోజుల క్రితం చోటు చేసుకోగా ప్రస్తుతం వైరల్ అవుతున్నది. స్కూల్ పక్కన ప్రకృతివనం ఉండడంతో నిత్యం విష పురుగులు వస్తున్నాయి. -కథలాపూర్



అమితాబ్ బచ్చన్ నాకు స్ఫూర్తినిచ్చారు

'వేట్టైయాన్' ఆడియో వేడుకలో రజనీకాంత్

'ఒక హిట్ సినిమా తర్వాత ఎలాగైనా మరో హిట్ కొట్టాలనే టెన్షన్ ఉంటుంది. హిట్ కావాలంటే ఓ మ్యాజిక్ జరగాలి. అన్నీ కుదరాలి. 'జైలర్' తర్వాత నేను అంతగా కథలు వినడం లేదు. కానీ దర్శకుడు జ్ఞానవేల్ చెప్పిన ఈ కథ నచ్చడంతో వెంటనే అంగీకరించా' అన్నారు సూపర్‌స్టార్ రజనీకాంత్. ఆయన తాజా చిత్రం 'వేట్టైయాన్' ఆడియో రిలీజ్ వేడుక శుక్రవారం చెన్నైలో జరిగింది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో అమితాబ్ వంటి పెద్దస్టార్ భాగం కావడంతో నాలో ఉత్సాహం రెట్టింపయ్యింది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అమితాబ్‌ను నేను స్ఫూర్తిగా తీసుకుంటా. ఓ సమయంలో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా ఆయన కెరటంలా పైకి లేచారు. 80 ఏండ్ల వయసులో కూడా ఉత్సాహంగా సినిమాలు చేస్తున్నారు. ఫహాద్ ఫాజిల్, రానా ఈ సినిమాలో గొప్ప పాత్రలు చేశారు' అన్నారు. రజనీకాంత్‌తో కలిసి నటించడం గర్వంగా భావిస్తున్నానని అమితాబ్ బచ్చన్ చెప్పారు. రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ నుంచి ఎన్నో జీవిత సత్యాలను తెలుసుకున్నానని, అభిమానుల అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందని దర్శకుడు జ్ఞానవేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

మూడింటినీ సమాంతరంగా



ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు లారెన్స్ కెరీర్ పరంగా జోరు పెంచారు. ప్రస్తుతం మూడు సినిమాలతో బిజీగా ఉన్నారాయన. ఈ మూడింటినీ సమాంతరంగా పూర్తిచేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నారట లారెన్స్. వాటిలో 'బెంజ్' చిత్రం చిత్రీకరణ దశలో ఉండగా, ఇటీవలే ప్రకటించిన రమేష్ వర్మ చిత్రం షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది. ఇంకోవైపు 'కాంచన 4'కి సంబంధించిన కసరత్తులు ముమ్మరం చేశారు. ఇప్పటివరకూ 'కాంచన' ఫ్రాంచైజీ దక్షిణాది ప్రేక్షకుల్ని మాత్రమే అలరించింది. ఈ నాలుగో భాగం మాత్రం పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కించనున్నారట లారెన్స్. ఇందులో కథ రీత్యా ముగ్గురు హీరోయిన్లు ఉంటారట. వారిలో ఓ పాత్రకు బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్‌ని అనుకుంటున్నారట. 'స్త్రీ 2'తో 800కోట్ల విజయాన్ని ఖాతాలో వేసుకొని ఫుల్ జోష్‌మీద ఉన్నది శ్రద్ధాకపూర్. 'కాంచన 4' కూడా కామెడీ హారర్ సినిమానే కావడంతో ఇందులో నటించేందుకు శ్రద్ధా ఉత్సాహం చూపిస్తున్నారట. మిగతా ఇద్దరు దక్షిణాది హీరోయిన్లే ఉంటారని తెలుస్తున్నది. త్వరలోనే 'కాంచన 4' పట్టాలెక్కనుంది. ఈ మూడు షూటింగ్‌లూ సమాంతరంగా జరుగనున్నాయి.




ఊరికి సరిపోయేంత భోజనం వచ్చేది

ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నది కథానాయిక మాళవిక మోహనన్. ఈ సినిమా విడుదలకు ముందే మాళవికకు యూత్‌లో ఓ రేంజ్‌లో క్రేజ్ ఏర్పడిపోయింది. 'రాజాసాబ్' గురించి తన తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది మాళవిక మోహనన్. 'ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న సినిమా ద్వారా తెలుగులోకి ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. నిజానికి టాలీవుడ్ ఎంట్రీకోసం ఎన్నో కథలు విన్నాను. చివరకు 'రాజాసాబ్' నా తెలుగు డెబ్యూ అయ్యింది. ఈ విషయంలో నిజంగా నేను లక్కీ. ఇదొక రొమాంటిక్ హారర్ కామెడీ డ్రామా. ఇందులో నా పాత్రకు మంచి ప్రాధాన్యం ఉంది. ఇదొక అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. ప్రస్తుతం సగం షూటింగ్ పూర్తయింది' అని తెలిపింది మాళవిక మోహనన్. ప్రభాస్ గురించి మాట్లాడుతూ 'ప్రభాస్ లాంటి వ్యక్తిని నేనెక్కడా చూడలేదు. ఎదుటివారికి అన్నం పెట్టి, వారు తింటుంటే ఆయన ఆనందిస్తుంటాడు. ప్రభాస్ ఇంటి భోజనానికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. భోజనం అంటే బిర్యానీనో, లేక రెండుమూడు కర్రీలతో వైట్‌రైస్ భోజనమో కాదు, ఏకంగా పెద్దపెద్ద పాత్రలతో ఒక ఊరికి సరిపోయేంత భోజనాన్ని లొకేషన్‌కి తెప్పిస్తాడు. నా లైఫ్‌లో అంత రుచికరమైన భోజనం నేను తినలేదు. ఆయన మంచి మనసుకు ఇదే పెద్ద నిదర్శనం' అంటూ చెప్పుకొచ్చింది మాళవిక.



వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. దిల్‌రాజు, శిరీష్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. శనివారం ఈ సినిమా సెట్‌కు అగ్ర హీరో బాలకృష్ణ ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. వెంకటేష్‌తో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ అగ్రహీరోలిద్దరూ కలిసి తీయించుకున్న ఫొటోలు సోషల్‌మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

థగ్‌లైఫ్‌కు గుమ్మడికాయ కొట్టేశారు



కమల్‌హాసన్, మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన క్లాసిక్ 'నాయకుడు' వచ్చి అక్షరాలా 37ఏండ్లు. మళ్లీ ఇన్నాళ్లకు కమల్, మణిరత్నం కలిసి పనిచేస్తున్నారు అనగానే 'థగ్‌లైఫ్' సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అందుకు తగ్గట్టుగానే మణిరత్నం పీరియాడిక్ డ్రామాను ఎంచుకున్నారు. అంతేకాదు, మణిరత్నం ఈ సినిమా షూటింగ్‌ని త్వరగా కంప్లీట్ చేశారు. ఇంత త్వరగా మణిరత్నం షూటింగ్ పూర్తి చేయడం 'థగ్‌లైఫ్' విషయంలోనే జరిగిందని కోలీవుడ్‌లో పలువురు అభిప్రాయపడుతున్నారు. త్రిష ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది చివర్లో కానీ, వచ్చే ఏడాది మొదట్లో కానీ 'థగ్‌లైఫ్'ని విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంగా సుహాసిని మణిరత్నం ఓ ఫొటోను తన ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేశారు. ఇదిలావుంటే.. ప్రతిష్ఠాత్మక నెట్‌ఫ్లిక్స్ సంస్థ ఈ సినిమా ఓటీటీ హక్కులను 150కోట్లకు సొంతం చేసుకున్నది. ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న విషయం విదితమే.



ఇంగ్లాండు రాణి అందచందం


శ్రీవిష్ణు, రీతూవర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'శ్వాగ్'. హసిత్‌గోలి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని వేగవంతం చేశారు. శనివారం 'ఇంగ్లాండు రాణి..' అంటూ సాగే మూడో గీతాన్ని విడుదల చేశారు. వివేక్‌సాగర్ స్వరపరచిన ఈ గీతాన్ని స్వరూప్ గోలి రచించారు. కైలాష్‌ఖేర్ ఆలపించారు. ఈ పాటలో కథానాయిక రీతూవర్మ లుక్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, శ్రీవిష్ణు నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారని, నాయిక రీతూవర్మ మహారాణి పాత్రలో అలరిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. మీరా జాస్మిన్, దక్ష నగార్కర్, శరణ్య ప్రదీప్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, రచన-దర్శకత్వం: హసిత్ గోలి.

ఫ్లాష్‌బ్యాక్ లేనిదెవరికి?



ఏఎస్ రవికుమార్‌చౌదరి దర్శకత్వంలో 'ఫ్లాష్‌బ్యాక్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. 'లేనిది ఎవరికి?' అనేది ఈ టైటిల్‌కి ఉపశీర్షిక. ఆద్య ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై కార్తీక్‌రెడ్డి రాకాసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. న్యూఏజ్ కథాంశంతో రూపొందనున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కి ప్రముఖ టెక్నీషియన్స్ పనిచేయనున్నారని, ఇందులో నటించే నటీనటుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రభాకరరెడ్డి, సంగీతం: జేబీ, పాటలు: సుద్దాల అశోక్‌తేజ, వరంగల్ శ్రీను, సమర్పణ: ఎఎస్ రిగ్వేద చౌదరి.

అమెరికా నేపథ్యంలో రొమాంటిక్ డ్రామా



యువనటుడు గల్లా అశోక్ హీరోగా ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ ఓ చిత్రాన్ని ప్రారంభించింది. శ్రీగౌరీప్రియా, రాహుల్ విజయ్, శివాత్మిక కీలక పాత్రధారులు. ఉద్భవ్ దర్శకుడు. శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నమ్రత ఘట్టమనేని క్లాప్ ఇవ్వగా, పద్మ గల్లా, మంజుల స్వరూప్ స్క్రిప్ట్‌ని చిత్ర బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా అతిథులందరూ చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. అమెరికా నేపథ్య కథాంశంతో ఈ సినిమా రూపొందనున్నదని, కడుపుబ్బా నవ్వించే హాస్యంతోపాటు, హృదయాన్ని హత్తుకునే డ్రామా కూడా ఇందులో ఉంటుందని, ఈ నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. రొమాంటిక్ కామెడీ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రానికి కెమెరా: భరద్వాజ్.ఆర్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.



కొత్త జంట చెట్టాపట్టాల్

ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టారు సినీ తారలు సిద్ధార్థ్, అదితిరావు హైదరీ. ఈ నెల 16న వీరిద్దరి వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. వివాహానంతరం ఈ జంట తొలిసారి మీడియా కెమెరాలకు చిక్కారు. ముంబయిలో ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకొస్తూ అభిమానులకు, అక్కడున్న మీడియా వారిని విష్ చేస్తూ ఉల్లాసంగా కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.